

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

1-6-2024 శనివారం సంపుటి: 30 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50


రాష్ట్ర గీత రచన పోటీ.. ఎంపికైన గీతానికి లక్ష 3లో

జులై 11న ట్రంప్‌కు శిక్ష ఖరారు 5లో

## చివరి విడత పోలింగ్ నేడే

### 57 నియోజక వర్గాలలో 904 మంది పోటీ

బరిలో కాశీ నుంచి మోడీ, హిమాచల్ నుంచి కంగనా రనౌత్


5లో



## నేడు రాష్ట్రానికి సిఎం జగన్ రాక

### 161 సీట్లు ఖాయమని ఆశాభావం

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఈ నెల 17న కుటుంబ సభ్యులతో కలిసి లండన్ వెళ్ళిన సీఎం జగన్ రేపు ఉదయం అంటే ఈ నెల31 విజయవాడ చేరుకొనున్నారు.గురువారంరాత్రి ఆయన లండన్ నుంచి బయలుదేరి, శుక్రవారం ఉదయం విజయవాడ(గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని భావించారు. అయితే ఆయన మారిన షెడ్యూల్‌ను అనుసరించి లండన్ నుంచి శనివారం ఉదయం విజయవాడ(గన్నవరం) 5 >>2




## నేడే ఎగ్జిట్‌పోల్స్

### పోలింగ్ ముగిసిన తర్వాత వెల్లడి

### దక్షిణాది రాష్ట్రాలపైనే అందరి ఫోకస్

**న్యూఢిల్లీ,మే 31:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తుదిఘట్టం శనివారంతో ముగుస్తున్నది. శనివారం 57 నియోజకవర్గాలకు జరుగుతున్న పోలింగ్‌తో మొత్తం ఏడు విడతల పోలింగ్ ముగుస్తున్నది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతంలో జరుగుతున్న ఈ ఎన్నికలపై పోటాపోటీ ప్రచారంతో అధినేతలంతా ఇపుడు మౌనముద్రలో ఉన్నారు. పోలింగ్ ముగిసిన సాయంత్రం నుంచి ముందస్తు సర్వేలు వెల్లడికానున్నాయి. పోలింగ్ ముగిసేంతవరకూ ఎగ్జిట్‌పోల్స్ వివరాలు వెల్లడించకూడదన్న ఎన్నికల సంఘం నిబంధనలతో ఇపుడు శనివారం వరకూ వివిధ ప్రైవేటు, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు, అంతర్జాతీయ సర్వే సంస్థలు తమతమ సర్వే నివేదికలతో సిద్ధం అవుతున్నాయి. శనివారం సాయంత్రం ఆరుగంటల తర్వాత ఈ వివరాలను వెల్లడించేందుకు సిద్ధంఅవుతున్నాయి.అలాగే దేశవ్యాప్తంగా వివిధ రాజకీయపార్టీలు, ప్రజలు విభిన్నరంగాల ప్రముఖులు కూడా ఈ ఎగ్జిట్‌పోల్స్ నివేదికలపై ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ శాస >>2



శుక్రవారం ఉదయం కన్యాకుమారి సముద్రతీరంలో సూర్యునికి అర్ఘ్యం ఇస్తున్న ప్రధాని మోడీ

## సూర్యునికి అర్ఘ్యం

### కన్యాకుమారి వివేకానంద మండపంలో ధ్యానదీక్ష ప్రారంభించిన ప్రధాని మోడీ

### 45 గంటలు సాగనున్న దీక్ష

**కన్యాకుమారి, మే 31:** సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ప్రధాని మోడీ ప్రతిసారి నిర్వహించే ధ్యానముద్ర ఈసారి కన్యాకుమారిలోని స్వామి వివేకానంద స్మారక మందిరంలో నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకూ ప్రధాని ధ్యానంలోనే నిమగ్నం అయి ఉంటారు. స్వామి వివేకానంద విగ్రహం >>2

# రాష్ట్ర ఆర్థికానికి సుస్తీ!

### ఆర్థిక పరిస్థితి వివరాలు తెలియజేయాలని గవర్నర్ నజీర్‌ను కోరిన బిజెపి చీఫ్ పురందేశ్వరి

### రాష్ట్ర అప్పుల వివరాలు సిఎస్ ద్వారా ఇవ్వాలని విన్నపం

### మితిమీరిన నిధుల దుర్వినియోగం

### నిధులు కేంద్రానివి, ఆర్భాటం జగన్‌ది



శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన బిజెపి చీఫ్ పురందేశ్వరి

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఆర్థిక పరిస్థితిపై వివరాలను వెల్లడించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర గవర్నర్‌ను కోరారు. బిజెపి నాయకులు కాపు రామచంద్రారెడ్డి, సాదినేని యామిని శర్మ, బిట్ర సత్యనారాయణ, పాతూరి నాగభూషణం తదితరులతో కలిసి శుక్రవారం సాయంత్రం విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పురందేశ్వరి రాష్ట్రంలో రాష్ట్రంలో అప్పులు, ఆదాయాలు గురించి సమగ్ర సమాచారం కావాలంటూ లేఖను అందించారు. తాము అడిగిన వివరాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా వెల్లడింపచేయాలని కోరారు. మొత్తం అవుట్ స్టాండింగ్ ఆర్‌బిఐ లిస్టును అనుసరించి తెచ్చిన అప్పులు, కార్పోరేషన్లు వారిగా తెచ్చిన రుణాలు, కాంట్రాక్టర్లుకు చెల్లించాల్సిన బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వం ఆస్తులు తాకట్టు పెట్టి తెచ్చిన, రాష్ట్ర ప్రభుత్వ సావనీర్ గ్యారెంటీ ఇచ్చి తెచ్చిన,ఎన్నికల అనంతరం కాంట్రాక్టర్లుకు చెల్లించిన బిల్లుల వివరాలు తెలిపాలని పురందేశ్వరి లేఖలో కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇతర ప్రావిడెంట్ ఫండ్స్ నుండి, ఆర్థిక సంస్థల నుంచి తెచ్చిన అప్పుల వివరాలు కోరారు. ప్రభుత్వ ఉద్యోగులక టీఎ,డీఎ బకాయిలు ఎంత ఉంది, ప్రతి ఏడాది రీపేమెంట్‌కు అసలు ప్లస్ వడ్డీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఎంత కట్టవలసి ఉంది. సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్లు, డిస్కంలకు,పవర్ సప్లయిర్‌లకు చెల్లించాల్సిన బకాయిలు ఎంత ఉంది. నిధులు రిలీజ్ చేయాలిసి ఉన్నప్పటికి,అతి కొద్ది మాత్రమే ఇచ్చి మొత్తం రిలీజ్ చేసినట్లుగా ప్రకటనలు చేస్తూ.లబ్దిదారులకకు పాక్షికంగా చెల్లించిన విధానం,ఈ విధంగా సంక్షేమ పథకాలకు ఎంత నిధులు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వంపై ఎన్ని కేసులు ఉన్నాయి. కోర్టు తీర్పులు ఇచ్చినప్పటికి ప్రభుత్వం అమలు పరచకుండా కంటెంప్ట్ కేసులు ఉన్నవేన్ని వంటి వివరాలను ఆదమె లేఖలో అడిగారు.గవర్నర్‌ను కలిసిన అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ ఏపీలో నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. అందుకే ప్రభుత్వాన్ని లెక్కలు అడిగామన్నారు. ఏపీలో రూ.60 >>2

# పదవి.. విరమణ

### ఎట్టకేలకు ప్రింటింగ్, స్టేషనరీ కమిషనర్‌గా కీలక బాధ్యతలు చేపట్టిన ఎబివి

### అదే రోజున పదవీ విరమణ కూడా..

### సుదీర్ఘ న్యాయపోరాటంతో తిరిగి పదవి చేపట్టినా ఒక్క రోజులోనే ముగిసిన వైనం

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)ను రాష్ట్ర ప్రభుత్వం సర్వీసులోకి తీసుకుంది. ఆయనకు విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ,స్టోర్స్ పర్చేజ్ కమీషనర్‌గా డీజీ హోదాలో ఆయనకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.శుక్రవారం ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి విధుల్లో చేరిన ఏబీవీ,ఇదే రోజు పదవి విరమణ చేయనున్నారు.గతంలో ఆయనపై ఏపీ ప్రభుత్వం రెండవ సారి సస్పెన్షన్ వేటు వేసే నాటికి అవే బాధ్యతలను ఆయన నిర్వహిస్తున్నారు.పలు అవినీతి అభియోగాలపై ఏబీవీని ప్రభుత్వం గతంల సస్పెండ్ చేసింది.దాంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అయితే క్యాట్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్ధించింది.దాంతో ఏబీవీ హైకోర్టును ఆశ్రయించారు.హైకోర్టు ఆయన సస్పెన్షన్‌ను కొట్టివేసింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. అయితే హైకోర్ట్ నిర్ణయాన్ని సమర్ధిస్తూ ఆయన వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.సర్వీసులో ఉన్న ఉద్యోగిని రెండేళ్ళ కంటే ఎక్కువ సస్పెన్షన్‌లో ఉంచకూడదని సుప్రీం ఈఆదేశాల సందర్భంగా స్పష్టం చేసింది. ఈక్రమంలో ప్రభుత్వం ఆయనను విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమీషనర్‌గా నియమించింది.ఈ పోస్టులో ఆయన చేరిన కొద్ది కాలానికే ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో మరల సస్పెండ్ చేసింది.ఏబీవీ క్యాట్‌ను ఆశ్రయించగా ఒక అధికారిని ఒకే కారణంపై రెండు సార్లు సస్పెండ్ చేయడం సరికాదని తెల్చిచెప్పింది. ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది.అయితే ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని హైకోర్టులో సవాల్ చేసింది. గురువారం అక్కడ ఏబీవీకి అనుకూలతీర్పు వచ్చింది.ఆయనను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని ఆదేశించింది.దాంతో ఆయన ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి పోస్టింగ్ కోసం లేఖను ఇచ్చారు.పరిశీలిస్తామని సీఎస్ >>2



శుక్రవారం విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ,స్టోర్స్ పర్చే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎబి వెంకటేశ్వరరావు



శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి ప్రణమిల్లుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

## తిరుమలేశుని దర్శించిన అమిత్‌షా

### సకుటుంబంగా ఆలయంలో ప్రత్యేక పూజలు

### కొండపై భారీ భద్రతా ఏర్పాట్లు

**తిరుమల, మే 31ప్రభాతవార్తప్రతినిధి:** మరో నాలుగురోజుల్లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో కేంద్రహోమ్ శాఖామంత్రి అమిత్‌షా శుక్రవారం వేకువజామున ఏడు కొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సతీమణి సోనాల్ షాతో కలసి ఆయన వేకువ >>2

# పోలీసు దిగ్బంధంలో పల్నాడు



శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జగిరిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మల్లికా గార్గ్

### కౌంటింగ్ ప్రశాంతంగా జరగడానికి ఏర్పాట్లు

### జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు

### అల్లరిమూకలను గుర్తించడానికి డ్రోన్లు

### సిబ్బందితో సమీక్షలో జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్

**అమరావతి, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపుకేంద్రాలతోపాటు జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు,అల్లర్లు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయటమే మా లక్ష్యమని పల్నాడుజిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించబోతున్న రెవెన్యూ అధికారులు, ఇతర ప్రభుతన అధికారులు, జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమా వేశంలో ఎస్పీ మాట్లాడారు. కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా దగ్గర్లో ఉన్న పోలీసు వారికి తెలియజేయాలని, పోలీసువారు కౌంటింగ్ సిబ్బందికి రెవెన్యూ అధికారులకు అందుబాటులో ఉండి ఎలాంటి సాయం కావాలన్నా చేస్తారని తెలిపారు. అనంతరం జిల్లాలో కౌంటింగ్ బందోబస్తుకు వచ్చిన ఇతర జిల్లాల పోలీసు అధికారులు రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాల అధికారులు, ఆక్టోపస్ కమాండోలు, సాయుధ బలగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మల్లిక గార్గ్ మాట్లాడుతూ, జిల్లాకు సంబంధించిన అన్ని విషయాలను ప్రస్తుత రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా వివరించారు కొత్తగా బయట జిల్లాలనుంచి వచ్చిన అధికారులకు ఆ మండలం, గ్రామం జియో గ్రాఫికల్ మ్యాప్‌ను, అదేవిధంగా ఆయా మండలాల్లో ఎన్నికల సమయంలో జరిగిన నేరాలకు సంబంధించిన వివరాలు, >>2

### పోస్టల్ బ్యాలట్ ఇసి మార్గదర్శకాలపై

## హైకోర్టు తీర్పు రిజర్వు

**విజయవాడ, మే31,ప్రభాతవార్తప్రతినిధి:** పోస్టల్ బ్యాలెట్‌పై ఏపీ ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలు(మెమో)పై రాష్ట్ర హైకోర్టులో దాఖలైన లంచ్‌మోషన్ పిటిషన్‌పై శుక్రవారం వాదనలు ముగిసాయి.ఇరు పక్షాల వాదనలు ముగిసిన నేపథ్యంలో తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది.శనివారం సాయంత్రం ఈ తీర్పును వెల్లడిస్తామని స్పష్టం చేసింది.పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఏపీ సీఈవో నిబంధనలు కేంద్ర ఎన్నికల సంఘం విధివిధానాలకు భిన్నంగా ఉన్నాయని వైకాంగ్రెస్ పార్టీకి చెందిన >>2



## సజ్జలపై క్రిమినల్ కేసు

### టిడిపి ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమ ఫిర్యాదు

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది.తమ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లపైపరోక్షంగా అనుచిత వ్యాఖ్య >>2


### ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లపై

## బదలీ వేటు

### ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ఆరోపణ

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగంపై ఎన్నికల కమీషన్ సూచనల మేరకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లుపై బదిలీ వేటు పడింది.ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసారు.ఈ ఆదేశాలకు అనుసరణగా బదిలీ అయిన వారి స్దానంలో వేరొక చోటు నుంచి అధికారులను నియమించారు. ఒంగోలు పార్లమెంటు పరధిలోని ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు పి.శ్రీలేఖను బదిలి చేసారు.కర్నూలు డిప్యూటీ కలెక్టర్ ఏ.మురళీ,అనంతపురం డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డిలు కుడా ఎన్నికల విధుల్లో అశ్రద్ద వ్యవహరించారని బదిలి చేసారు.ఈ ముగ్గురు అధికారులు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సినల్ సెక్రటరీ వద్దకు తదుపరి ఉత్తర్వుల కోసం రిపోర్టు చేయాలని సీఎస్ తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు.బదిలి వేటుకు గురైన డిప్యూటీ కలెక్టర్లు స్దానంలో ఒంగోలు పార్లమెంటు పరిధిలో ఎం,వెంకట సత్యనారాయణ, కర్నూలు పార్లమెంటు పరిధిలో సి.విశ్వనాధ్,అనంతపురం పార్లమెంటు పరిధిలో జె.శిరీషలను నియమించారు. వీరు ఎన్నికల కౌంటింగ్‌తో పాటు తదనంతర ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.

# సిట్ కస్టడీకి రేవణ్ణ



ఎయిర్‌పోర్టునుంచి రేవణ్ణను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

### బెంగళూరు విమానాశ్రయంలో దిగగానే అరెస్టు చేసిన పోలీసులు

### పలు లైంగిక నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్ రేవణ్ణ

### హాసన్ నుంచి ఎంపి సీటుకు బరిలో ఉన్న ప్రజ్వల్

**బెంగళూరు, మే31:** పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడిఎస్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం అర్ధరాత్రి దాటాక అరెస్టు చేశారు. జర్మనీ నుంచి బయలుదేరిన ఆయన బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన వెంటనే సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను భారీ భద్రత మధ్య విచారణ నిమిత్తం సిఐడి కార్యాలయానికి తరలించారు. >>2




శుక్రవారం న్యూఢిల్లీలో 'ప్రపంచ పొగాకు నిర్మూలన దినం' కార్యక్రమానికి హాజరైన కేంద్ర హెల్త్ సర్వీసుల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్

# పోలీసు దిగ్బంధంలో పల్నాడు

>> ఆ కేసుల్లో ఉన్న నిందితుల వివరాలను , అరెస్టు అయిన వారి వివరాలు, ఆరెస్టు కావాల్సినవారి వివరాలు, బైండోవర్ అయ్యారా? అవ్వలేదా? అన్న వివరాలు, ట్రబుల్ మంగార్స్ వివరాలు, రౌడీషీటర్ల వివరాలు కలిగిన ఒక బుక్‌లెట్‌ను అందజేశారు. దీని ద్వారా కొత్తగా బందోబస్తుకు వచ్చిన అధికారులకు కూడా ఆయా మండలాల పరిస్థితి త్వరగా అర్థమవుతుందని అనాననరు. కౌంటింగ్ రోజున ముఖ్యమైన పట్టణాల్లోకి బయటి వ్యక్తులు రాకుండా టౌన్‌ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, చెక్ చేయాలని , అదే సమయంలో సామాన్య ప్రజలకు, మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చూడాలని అన్నారు. పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ ,30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నందున జూన్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఎలాంటి షాపులు తెరవకూడదని, ఎక్కడా కూడా ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది గుమికూడరాదన్నారు. అలా గుమిగూడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. జూన్ 2,3,4,5 తేదీల్లో ఇదే విధమైన కర్ఫ్యూ వాతావరణం ఉండబోతుందని, పోలీసు సిబ్బంది గట్టిగా అమలు చేయాలని ఆదేశించారు. 1వ తేదీ సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ అనంతరం రోడ్లపై ప్రజలు గుమిగూడి ఉండరాదని, పార్టీ కార్యాలయాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉండకూడదన్నారు. పార్టీల కార్యాలయాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.. .రౌడీషీటర్లను, ట్రబుల్ మంగార్స్‌ను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సిలింగ్ ఇవ్వాలని స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఎస్పీ ఆదేశించారు..

కౌంటింగ్ రోజు తదనంతరం ఏవైనా రాజకీయ పరమైన గొడవలు, ,అల్లర్లు చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్గించాలని చూస్తే వారు ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని వారిక ధీటుగానే సమాధానం చెప్పాలని, సిబ్బందికి అండగా ఉన్నానని ఎస్పీ అన్నారు. జిల్లాలో పట్టణ వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో సిసి టివి కెమేరాలు ఏర్పాటు చేశామని, ఎవరైనా అల్లర్లు చేయాలని చూస్తే వారి ఆటలు సాగవని ఎస్పీ హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో, సమస్యాత్మక గ్రామాల్లో అల్లరి మూకల కదలికలు గుర్తించటానికి డ్రోన్లను కూడా ఉపయోగించబోతున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం పిడుగురాళ్ల, జానపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తదనంతరం ఎలాంటి విజయోత్సవాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు.

అనంతరం దాచేపల్లి పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఎస్పీ మాట్లాడారు.



శుక్రవారం స్వామివారి చిత్రపటం అందుకుంటున్న అమిత్ షా దంపతులు

# తిరుమలేశుని దర్శించిన అమిత్‌షా

>> జామున ఆలయ మహాద్వారం మీదుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోపల ఆనందనిలయంలోని వేంకటేశ్వరస్వామి అభిషేకసేవలో పాల్గొన్నారు. స్వామివారి అభిషేకసేవ వీక్షించిన అనంతరం కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, శేషవస్త్రం బహుకరించారు. దేశంలోని ప్రజలందరికీ శుభాలు కలగాలని, మంచి జరగాలని ఆకాంక్షించారు. నాలుగురోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సమయంలో అమిత్‌షా కుటుంబంతో కలసి శ్రీవారి అభిషేకసేవలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు తిరుమలకు చేరుకుని ఇష్టదైవమ్ వెంకన్నను దర్శించుకుని ఆశీస్సులందుకుంటున్నారు. దర్శనానంతరం అమిత్‌షాకుటుంబంతో కలసి అతిథిగృహం చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గంలో బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం వెళ్ళారు. ఈ సందర్భంగా తిరుమలలో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

**ధ్వజస్తంభానికి సాష్టాంగనమస్కారం:** కేంద్రహోమ్ మంత్రి అమిత్‌షా శ్రీవారి దర్శనానంతరం వెండివాకిలికి ముందున్న ధ్వజస్తంభాన్ని తాకారు. అక్కడ నమస్కారం చేసి సాష్టాంగంగా పడుకుని నమస్కరించారు. పూర్తిగా భక్తివాతావరణంలో ఆలయంలోపల గడిపిన అమిత్‌షా దంపతులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి చిత్రపటం బహుకరించారు. కాగా ఆలయం వెలుపల క్యూలైన్లో ఉన్న భక్తులతో అమిత్‌షా ఆత్మీయ పలకరించారు.

# సూర్యునికి అర్ఘ్యం

>> ముందు ఆశీనులయి ధ్యానంచేస్తున్న ఫోటోలను పార్టీ విడుదలచేసింది. ధ్యాన మండపంలో ప్రధాని ధ్యానముద్రలో ఉన్న విడియోలు ఫోటోలు విడుదలయ్యాయి. భవిష్యత్ భారతావని కోసం ఆనాడు అంటే 1892లో స్వామి వివేకానంద ఇక్కడే మూడురోజులపాటు ధ్యానముద్రలోకి వెళ్లారు. ఈప్రాంతం హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, అరేబియా సముద్రం మూడు సముద్రాలు కలిసే కూడలిగా ఈ ప్రాంతానికి పేరు. కన్యా కుమారిలో మోడీ ధ్యానం చేసేందుకు ప్రధాన కారణం కూడా ఉందని, జాతీయ సమైక్యతకు చిహ్నంగానే స్వామి వివేకానంద రాక్‌మెమోరి యల్‌ను ఎంపికచేసుకున్నారన్నారు. సూర్యోదయాన్నే ప్రధాని ఆదిత్యునికి అంజలి ఘటించారు. కలశం చేతబూని పవిత్రజలాలను వదులుతున్న మోడీ తన జపమాలను కూడా చేతబట్టి ప్రార్థనలు చేసారు. మూడోసారి కూడా ఖచ్చితంగా విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్న మోడీ కన్యాకుమారికి గురువారం సాయంత్రమే చేరుకున్నారు. ఏడు దశల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విస్తృత ప్రచారం నిర్వహించిన మోడీ గతంలో వలే ఈసారి కూడా కన్యాకుమారిలోనే ధ్యానం చేయాలని నిర్ణయించుకుని అక్కడే గడిపేందుకు వచ్చారు. శనివారం సాయంత్రం తిరిగి ఢిల్లీకి వెళతారు. ఎన్నికలఫలితాలు వెలువడే ముందు ప్రధాని మోడీ 2014, 2019లలో కూడా ఇదేవిధంగా ఆధ్యాత్మికచింతనవైపు వెళ్లారు. 2019లో ఉత్తరాఖండ్, 2014లో ఉత్తరప్రదేశ్‌లలోని పవిత్ర మందిరాల్లో మోడీ ధ్యానంచేసారు. కేవలం ద్రవాహారం మాత్రమేస్వీకరిస్తున్నమోడీకి కొబ్బరి నీళ్ల, ద్రాక్షరసం సిద్ధం చేసారు. కాషాయ దుస్తులు ధరించి ధ్యానంలో కూర్చున్న ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

# హైకోర్టులో తీర్పు రిజర్వు

>> నాయకులు ఈ పిటిషన్ దాఖలు చేసారు. దీనిపై హైకోర్టు ప్రత్యేక సమ్మర్ వేకేషన్ కోర్టు విచారణ చేపట్టింది. పోస్టల్ బ్యాలెట్ ధృవీకరణపై డిక్లరేషన్ గెజిటెడ్ అధికారి సంతకం మాత్రమే ఉండి. సీల్, హోదా లేకపోయినా ఆ ఓటు చెల్లుతుందని సీఈవో మెమోలో పేర్కొన్నారని పిటిషనర్లు ఆరోపించారు. గతంలో ఇసి ఇచ్చిన మార్గదర్శకాలకు సీఈవో భిన్నంగా మార్గదర్శకాలు ఇచ్చారని వివరించింది. ఈ క్రమంలో హైకోర్టు విచారణ చేపట్టింది. కేసు న్యాయస్థానం విచారణలో ఉండగానే కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది ఏపీ సీఈవో ఇచ్చిన మెమోను వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించినట్లు సమాచారం!. ఈ అంశంపై హైకోర్టు విచారణ చేపట్టింది.

# రాష్ట్ర ఆర్థికానికి సుస్తీ!

>>వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రోడ్లు బాగుపడలేదు. కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలేదన్నారు. ఏపీలో సంక్షేమ పథకాల్లో అత్యాధికం ప్రధాని మోడీ వేనన్నారు. నిధులు కేంద్రానివి, సీఎం జగన్ ఆర్భాటం అధికంగా జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో మార్పు తప్పదన్నారు. బిజెపిలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. మోడీ అధికారంలోకి వస్తే రాబోయే అయిదేళ్ళలో దేశం ప్రపంచంలో మూడవ అగ్రరాజ్యంగా ఉంటుందన్నారు.

# నేడే ఎగ్జిట్‌పోల్స్

>> నసభ, పార్లమెంటు ఎన్నికలపై ఈ సారి సర్వత్రా ఉత్కంఠనెలకొంది. అలాగే ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికలపరంగాచూస్తే దేశ రాజధాని ఢిల్లీ, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. దక్షిణాదిపై ఎక్కువ ఫోకస్ పెంచిన బిజెపి ఈసారి దక్షిణాదిలో ఎక్కువ సీట్లు గెలుచుకునే ఏకైక లక్ష్యంతో బహుముఖ ప్రచారం నిర్వహించింది. పార్లమెంటు ఎన్నికలపైనే ఎక్కువ ఫోకస్ పెంచిన ఎన్డీయే కూటమి ఈసారి ఒడిశా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలపైనా దృష్టిపెట్టింది. గణనీయంగా సీట్లు పెంచుకోగలమని బిజెపి నేతలు ఘంటాపథంగా చెపుతున్నారు. దక్షిణాదిపరంగాచూస్తే ఇపుడు ఆంధ్రప్రదేశ్‌పైనే అన్నివర్గాల ఫోకస్ ఎక్కువగా ఉంది.

# నేడు రాష్ట్రానికి సిఎం జగన్ రాక

>> గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు.. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో తాడేపల్లి నివాస గృహానికి చేరుకుంటారు. ఆయన శుక్రవారం అర్ధరాత్రి సమయంలో లండన్ నుంచి బయలు దేరతారని సమాచారం., శనివారం సాయంత్రం ఆయన ముఖ్య కార్యకర్తలతో మాట్లాడే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో సీఎం జగన్ రాష్ట్రమంతటా బీజీ. బీజీగా పర్యటించారు. పోలింగ్ తరువాత ఓటింగ్ సరళి ఇతరంశాలపై సమీక్షలు నిర్వహించారు. ఈ నెల 16న ఆయన తిరిగి తాము 161 వరకు సీట్లు సాధించి అధికారంలోకి వస్తున్నామని ప్రకటించారు. మరుసటి రోజు విజయవాడ విమానాశ్రయం నుంచి ఆయన లండన్ వెళ్ళారు. అక్కడ నుంచి భార్య ,పిల్లలతో కలిసి స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లో పర్యటించారు. ఆయన విదేశీ పర్యటన నుంచి రాగానే ముఖ్యనాయకులతో కీలక సమావేశంలో పాల్గొంటారని సమాచారం.

# సజ్జలపై క్రిమినల్ కేసు

>>లు చేసారంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుడపాటి లక్ష్మీనారాయణ తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ఐపీసీ సెక్షన్లు 153,505,125 కింద సజ్జలపై కేసు నమోదైంది. దేవినేని ఉమా సజ్జలపై చేసిన ఫిర్యాదులో వైకాంగ్రెస్ పార్టీ చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు అవగాహన సదస్సులో సజ్జల ఇటీవల మాటాడారు. మన టార్గెట్‌ను దృష్టిలో పెట్టుకుని, దాని అవసరమైన విషయాలు తెలసుకోవాలన్నారు. అవతలి వారు అడ్డపడకుండా వారిని ఆపేందుకు ఎలాంటి నిబంధనలు ఉన్నాయో చూసుకోవాలి, మన ఓటు ఒక్కటి కుడా చెల్లనవిగా చేసే పరిస్థితి రాకుండాఅడ్డుకునేందుకు ఏం చేయాలో చూసుకోవాలలి, అంతే తప్ప రూల్ ఇలా ఉంది కాబట్టి దాని ప్రకారం పోదాం అని మనం కూర్చోకూడదని సజ్జల వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మనకు అనుకూల రీతిలో అవతలి వాళ్ళ సాగకుండా రూల్‌ని ఎలా చూసోవాలని ఆలోచించి, అవసరమైతే ఎంత వరకు ఫైట్ చేయాలనేది నేర్చుకుందామన్నారని ఫిర్యాదులో వివరించారు. సజ్జలపై ఇచ్చిన ఫిర్యాదును తాడేపల్లి పోలీసులు స్వీకరించి కేసు నమోదు చేసారు. ఈ కేసుకు సంబంధించి విచారణను నిర్వహించి అన్ని చర్యలు తీసుకుంటామని తాడేపల్లి పోలీసులు తెలిపారు.

# పదవి.. విరమణ

>> చెప్పడంతో ఏబీవీ లేఖ పత్రిని ఏపీ సీఈవోకు ఇచ్చారు. ఈ పరిణామాల నడుమ శుక్రవారం ప్రభు త్వం ఏబీ వెంకటేశ్వరరావుకు విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. వాటిని అనుసరించి ఏబీవీ ఈ రోజు ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్‌గా కీలక బాధ్యతలు స్వీకరించిన రోజే పదవీ విర మణ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా వివాదస్పద అంశాలపై మాట్లాడలేనన్నారు. ప్రస్తుతానికి ఇంతవరకే మాట్లాడగలను, ఇన్నాళ్లతోడుగా ఉండి ధైర్యం చెప్పిన శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటానన్నారు. రెండేళ్ళ కితం ఏ పోస్టులో అయితే అదే పోస్టులో జాయిన్ అయ్యాను. ఇదే రోజు రిటర్మెంట్ అనే విషయాన్ని పక్కనపెడితే, నా కల నేరవేరింది, పోలీసు ఉన్నతాధికారిగా, ఖాకీ దుస్తుల్లోనే పదవి విరమణ చేస్తున్నా అది సంతోషంగా ఉందన్నారు. ఈ పరిస్థితికి కారణాలు ఎన్నో ఉన్నాయి, అవన్ని ఇప్పుడు అప్రస్తుతమన్నారు.

**పదవి విరమణ చేసిన ఏబీ వెంకటేశ్వరరావు**

ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమీషనర్‌గా డీజీ హోదాలో ఈ ఉదయం బాధ్యతలు స్వీకరించి సీనియర్ ఐపీఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు ఈ సాయంత్రమే పదవి విరమణ చేసారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, మిత్రులు, రాజకీయ నాయకులు కలుసుకుని అభినందించారు. వారితో తాను ఉద్యోగ బాధ్యతల్లోనే రిటైర్ కావడం సంతోషంగా ఉందని ఏబీవీ వ్యాఖ్యానించారు. తనపై తీవ్ర ఆరోపణలతో నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసినా న్యాయపోరాటం చేసానన్నారు. తనది ధర్మపోరాటమన్నారు. అందుకే విజయం సాధించానన్నారు. ఇక ఎక్కడ అన్యాయం జరిగిందనుకున్నా, తాను బాధితుల పక్షాన ఉంటానన్నారు. తన పట్ల అభిమానం చూపించిన అందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సిట్ కస్టడీకి రేవణ్ణ

>> పూర్తి విచారణ తర్వాత ఆయన్ను కోర్టులో హాజరుపరిచేస్తే కోర్టు జూన్ ఆరవ తేదీవరకూ సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చింది. సిట్ అధికారులు 14 రోజులు కస్టడీ కోరగా ప్రస్తుతం కోర్టు ప్రజ్వల్‌కు ఏడురోజులు కస్టడీ ఇచ్చింది. మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు అయిన ప్రజ్వల్ రేవణ్ణ ఎన్డీయే కూటమి తరఫున హాసన నుంచి ఎంపిగా బరిలోకి దిగారు. పలువురు మహిళలపై ఆయన లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన గత ఏప్రిల్‌లో దేశం విడిచి పరారయ్యారు. ఇప్పటివరకు రేవణ్ణపై మూడు కేసులు నమోదు అయ్యాయి. ఆయన జాడకోసం బెంగళూరు పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఆయనపై నాలుగుసార్లు నోటీసులు, ఒక అరెస్టు వారెంటు, బ్లూ కార్నర్, రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. దౌత్య పాస్‌పోర్టు రద్దు చేసేందుకు కేంద్ర విదేశాంగశాఖ చర్యలు చేపట్టింది. విచారణకు హాజరు కావాలని ఆయన తండ్రి హెచ్‌డి రేవణ్ణ, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి, మాజీప్రధాని హెచ్‌డి దేవెగౌడ బహిరంగానే కోరారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసుల విచారణకు సహకరిస్తానని, మే 31న సిట్ ముందు హాజరవుతానని తొలిసారి వీడియో సందేశంలో రేవన్న పేర్కొన్నారు. మరో వైపు బెంగళూరు కోర్టులో రేవన్నకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది.

**మహిళా పోలీసుల చేతిలో ప్రజ్వల్ అరెస్టు..**

అనేకమంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జెడిఎస్ ఎంపి ప్రజ్వల్ రేవన్నను సిట్ అధికారులు అరెస్టు చేసినప్పటికీ ఆయనను అదుపులోకి తీసుకునేందుకు మహిళా పోలీస్ బృందం ఎయిర్‌పోర్టుకు వెళ్లింది. ఇద్దరు మహిళా ఐపిఎస్ అధికారిణులు దీనికి నేతృత్వం వహించారు. జర్మనీ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రజ్వల్‌ను మహిళా పోలీసులు చుట్టుముట్టారు. అరెస్టు వారెంట్ చూపించి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి మహిళా అధికారిణులే సిఐడి కార్యాలయానికి తరలించారు. ఐపిఎస్‌లు సుమన్ డీ పెన్నేకర్, సీమా లాట్కర్‌ల నేతృత్వంలో అరెస్టు జరిగింది. ఎంపి ప్రజ్వల్ పదవిని, పలుకుబడిని అడ్డం పెట్టుకుని మహిళలపై బెదిరింపులకు పాల్పడ్డాడు. అతన్ని అరెస్టు చేసేఅధికారం మహిళలకే ఉండాలని, మహిళా అధికారులు ఎవరికీభయపడరనే సందేశాన్ని బాధిత మహిళలకు భరోసా కల్పించేందుకు మహిళా పోలీసులు అధికారులను పంపామని సిట్ అధికారులు వెల్లడించారు. ప్రజ్వల్ అరెస్టులో దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు ఆయన తల్లి భవానీ రేవన్నను విచారించనున్నారు. బాధితురాలి కిడ్నాప్ కేసులో భాగంగా జూన్ 1న విచారించనున్నట్లు ఆమెకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. మహిళా పోలీసుల సమక్షంలోనే విచారణ ఉంటుందన్నారు. బాధిత మహిళపై ప్రజ్వల్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఉన్న వీడియోలో భవానీ రేవన్న కూడా కనిపించారు. ఈ వ్యవహారంపై బాధిత మహిళ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై కిడ్నాప్ కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆమెను విచారించేందుకు సిట్ సిద్ధమైంది. అయితే ముందస్తు బెయిల్ కోసం ప్రజ్వల్, భవానీలు ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు.

## వారం - వర్జ్యం

తేది : 01-06-2024, శనివారం,
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయనం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
నవమి ఉ.7.25, దశమి తె.5.04
వర్జ్యం ఉత్తరాభాద్ర రా.3.15,
దు.మ.1.46-3.16,
శుభసమయం ఉ.5.41-7.21
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటా బయటా ఎదురైన ఒత్తిడులు తొలగుతాయి. గృహనిర్మాణ ఆలోచనల్లో తొందరపాటు వద్దు.

**వృషభం :** నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక ప్రగతి సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందులు అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**కర్కాటకం :** నూతన ఉత్సాహంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో ఆదరణ పెరుగుతుంది.

**సింహం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

**కన్య :** వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కాంట్రాక్టులు పొందుతారు.

**ధనుస్సు:** దూరపు బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మకరం :** కొత్త వ్యాపారాలలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. వస్తులాభం.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.

**మీనం :** ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### SINGAM KUIL ORANGE FRIDAY
DrawDate on:31/05/24

DAY - SINGAM SERIES Dr No:241
1st Prize Rs.100000/- 067699
2nd Prize Rs.7000/- 59420
3rd Prize Rs.3500/-
00020 06275 17999 22288 24720
32686 47875 60490 84476 91360
4th Prize Rs.200/-
0385 0805 1858 2684 4164 5126 6624
7417 7463 9855
5th Prize Rs.100/-
0091 0706 1486 2068 3398 6665 7333
7435 8002 9767
6th Prize Rs.50/-
0118 1659 2518 4292 5768 7283 9243
0227 1709 2552 4498 6052 7677 9325
0467 1711 2878 4562 6426 7736 9383
0508 1823 2964 4574 6661 7740 9502
0556 1867 3177 4626 6682 8208 9559
0687 1992 3194 4678 6736 8221 9563
0702 2045 3260 4722 6786 8255 9714
0752 2066 3415 4753 6864 8294 9827
0788 2112 3530 5002 6877 8350 9887
0950 2143 3646 5248 6906 8686 9934
1063 2158 3694 5255 6957 8696
1168 2289 3807 5293 7003 8699
1216 2303 3894 5315 7052 8901
1221 2354 4185 5424 7130 9138
1282 2412 4197 5562 7203 9171

DAY - KUIL SERIES Dr No:241
1st Prize Rs.100000/- 627857
2nd Prize Rs.7000/- 05525
3rd Prize Rs.3500/-
02863 06506 20754 27163 43291
49149 53009 62484 76779 94946
4th Prize Rs.200/-
1834 3924 4470 4526 6178 8159 8397
8686 8981 9886
5th Prize Rs.100/-
1647 1780 1786 1824 2979 6525 7776
8278 8401 8697
6th Prize Rs.50/-
0026 1597 3053 4808 6078 7523 8670
0031 1715 3062 4854 6155 7552 8896
0274 1812 3324 4869 6199 7645 8953
0353 1837 3397 4882 6258 7690 9055
0386 2056 3399 4894 6417 7781 9072
0675 2259 3612 5010 6423 7816 9196
0888 2405 3720 5086 6643 7861 9222
0993 2442 4132 5275 6802 7891 9357
1107 2527 4162 5334 6936 7976 9519
1110 2586 4257 5607 7024 8045 9538
1241 2596 4267 5701 7135 8065
1336 2646 4335 5744 7196 8275
1342 2706 4478 5955 7384 8318
1348 2729 4571 5995 7417 8433
1573 2802 4736 6057 7431 8549

### ROSA DEAR GOLD FRIDAY
DrawDate on:31/05/24

DAY - ROSA SERIES Dr No:241
1st Prize Rs.100000/- 568544
2nd Prize Rs.7000/- 81840
3rd Prize Rs.3500/-
09490 15739 31646 36413 43166
45667 65275 80824 81526 94163
4th Prize Rs.200/-
1883 2642 3671 4927 5854 6661 7382
7527 9381 9442
5th Prize Rs.100/-
0838 1518 4157 4710 5958 6098 6111
6577 7398 9924
6th Prize Rs.50/-
0147 1349 3380 4967 6189 7675 9382
0229 1477 3443 5042 6338 7781 9388
0250 1568 3997 5050 6372 7859 9572
0377 1624 4136 5061 6379 7899 9624
0389 1765 4142 5372 6418 8069 9734
0730 1871 4245 5479 6470 8081 9771
0801 2048 4320 5571 6510 8140 9789
0815 2364 4445 5749 6600 8300 9928
0853 2606 4447 5776 6703 8464 9942
0940 2749 4508 5817 6745 8510 9949
1004 2849 4538 5885 6944 8597
1057 2907 4647 5895 6945 8712
1254 3054 4661 5909 7288 8956
1327 3088 4760 5917 7324 8970
1333 3141 4784 6182 7450 9333

DAY - DEAR SERIES Dr No:241
1st Prize Rs.100000/- 471102
2nd Prize Rs.7000/- 69172
3rd Prize Rs.3500/-
03765 10144 16658 30770 37465
44423 58528 59415 65020 96291
4th Prize Rs.200/-
0031 1510 1998 4304 4798 7342 7855
8551 8708 8878
5th Prize Rs.100/-
0618 0819 3002 4415 5286 5622 6041
6431 7369 8756
6th Prize Rs.50/-
0112 1883 3356 4919 6073 7394 8656
0122 1899 3364 4929 6117 7654 8712
0176 1919 3376 4940 6169 7656 8793
0347 1965 3420 5008 6361 7723 9107
0440 1978 3871 5054 6534 7781 9146
0494 2064 3903 5055 6626 7787 9210
0532 2163 4081 5127 6671 7899 9304
1008 2333 4248 5138 6802 7943 9746
1098 2371 4321 5407 6887 8009 9749
1104 2794 4333 5450 7090 8186 9797
1257 2923 4448 5651 7154 8197
1354 3051 4458 5744 7179 8214
1663 3092 4585 5782 7193 8367
1665 3167 4736 5794 7268 8421
1733 3278 4824 6064 7352 8513

### THANGAM VAIRAM CHARM FRIDAY
DrawDate on:31/05/24

DAY - THANGAM SERIES Dr No:241
1st Prize Rs.100000/- 783333
2nd Prize Rs.7000/- 27695
3rd Prize Rs.3500/-
04262 05336 16801 28889 38013
40724 47142 57774 59789 84574
4th Prize Rs.200/-
0892 1040 2330 2342 3893 3939 5130
7454 7465 8620
5th Prize Rs.100/-
0299 1249 2491 2704 2997 3169 5212
7055 7992 8480
6th Prize Rs.50/-
0016 1675 2952 4414 6032 6965 8545
0056 1713 3135 4442 6161 6966 8783
0234 1726 3142 4444 6252 7003 8931
0374 1784 3162 4492 6358 7090 8938
0446 1941 3304 4537 6377 7133 9015
0531 2098 3410 4728 6401 7267 9285
0532 2310 3534 4734 6453 7321 9460
0805 2396 3827 5013 6597 7342 9513
0817 2490 3890 5019 6606 7386 9622
0835 2527 4041 5051 6660 7585 9817
0891 2550 4067 5316 6763 7669
1149 2652 4072 5431 6835 7731
1337 2657 4251 5455 6877 7781
1480 2708 4278 5585 6925 8448
1584 2939 4347 5617 6934 8513

DAY - VAIRAM SERIES Dr No:100
1st Prize Rs.50000/- 153519
2nd Prize Rs.7000/- 88548
3rd Prize Rs.3500/-
06588 07449 10205 13782 18161
28107 63238 68624 94783 99178
4th Prize Rs.200/-
0676 1840 2065 2292 2903 3320 4393
5245 5653 7936
5th Prize Rs.100/-
0332 0517 2295 4194 4211 4394 5280
7284 8861 9547
6th Prize Rs.50/-
0094 1596 2947 4205 6170 7359 8898
0104 1826 2955 4247 6194 7378 8929
0317 2010 2998 4413 6214 7619 8962
0434 2014 3061 4415 6221 7645 8964
0515 2069 3179 4495 6254 7691 9082
0537 2105 3222 4578 6388 8193 9216
0604 2388 3311 4599 6795 8367 9259
0711 2470 3350 4784 6816 8392 9412
0771 2483 3571 4863 6836 8413 9736
0781 2502 3969 5013 6959 8507 9878
1120 2530 3994 5019 7039 8649
1175 2629 4006 5600 7058 8680
1286 2634 4101 5687 7159 8792
1302 2745 4109 5921 7179 8838
1439 2931 4133 5929 7188 8860

### NALLANERAM MANI CHARM FRIDAY
DrawDate on:31/05/24

DAY - NALLANERAM SERIES Dr No:241
1st Prize Rs.50000/- 635773
2nd Prize Rs.7000/- 56913
3rd Prize Rs.3500/-
01795 13207 15181 33930 41347
62250 62750 72138 90332 92904
4th Prize Rs.200/-
0752 1367 1656 3346 3637 4311 4600
4731 7645 9727
5th Prize Rs.100/-
0550 0968 5208 6802 7305 7435 7485
8039 9371 9448
6th Prize Rs.50/-
0077 1447 2846 4227 5532 7070 8651
0243 1484 2852 4388 5656 7135 8738
0460 1495 2907 4508 5761 7233 8857
0480 1506 3096 4536 6080 7316 9220
0531 1519 3152 4655 6102 7560 9284
0534 1805 3291 4786 6154 7610 9294
0698 1958 3313 4816 6189 7622 9387
0726 2003 3360 4929 6268 7840 9668
0765 2309 3427 4953 6554 7930 9714
0786 2413 3710 4978 6668 7944 9824
0942 2415 3713 5072 6690 8014
1110 2442 3799 5287 6707 8095
1152 2539 3983 5288 6898 8225
1191 2552 4166 5322 6950 8536
1230 2711 4177 5477 7034 8542

DAY - MANI SERIES Dr No:100
1st Prize Rs.50000/- 697807
2nd Prize Rs.7000/- 50583
3rd Prize Rs.3500/-
03089 19491 21113 37310 63413
87857 88033 92099 95093 96061
4th Prize Rs.200/-
0501 0696 0802 4247 5187 5318 5821
7004 7429 9877
5th Prize Rs.100/-
0096 6095 6524 6884 7278 7640 8487
8595 9660 9755
6th Prize Rs.50/-
0021 2178 3622 4977 6674 7607 9222
0088 2308 3758 4996 6824 7613 9244
0105 2422 3848 5212 6855 7688 9370
0214 2455 3910 5458 6962 8048 9451
0443 2526 4153 5466 7050 8310 9683
0854 2714 4246 5676 7167 8397 9697
0937 2764 4371 5708 7215 8504 9704
1139 2771 4442 5728 7216 8582 9738
1148 3012 4554 5880 7306 8587 9801
1403 3051 4644 5909 7381 8601 9881
1563 3093 4776 5997 7398 8674
1583 3132 4781 6091 7416 8700
1899 3225 4783 6100 7472 8848
2000 3260 4849 6149 7523 9066
2137 3495 4953 6604 7567 9090

### KUMARAN VISHNU STORM FRIDAY
DrawDate on:31/05/24

DAY - KUMARAN SERIES Dr No:241
1st Prize Rs.50000/- 465544
2nd Prize Rs.7000/- 35955
3rd Prize Rs.3500/-
03883 03999 14182 27437 31434
33454 58059 84262 85575 96124
4th Prize Rs.200/-
0200 0220 1933 5234 5427 5731 5824
6269 9935 9992
5th Prize Rs.100/-
1037 1430 2825 4321 5634 8061 8155
8298 8331 9823
6th Prize Rs.50/-
0037 1436 3288 4557 6297 7885 9463
0039 1576 3308 4576 6409 7897 9565
0278 1651 3373 4696 6481 8129 9607
0279 1666 3376 5080 6527 8519 9620
0412 1793 3833 5250 6538 8534 9681
0417 1803 4075 5419 6718 8549 9682
0670 1852 4170 5421 6735 8842 9724
0897 1892 4185 5446 6785 8893 9750
0924 2505 4270 5452 6931 8925 9979
1115 2522 4285 5485 7000 8953 9988
1132 2755 4313 5493 7097 8970
1134 2869 4326 5623 7110 8985
1159 2985 4471 5745 7522 9108
1215 2989 4503 6066 7806 9218
1253 3154 4554 6252 7853 9320

DAY - VISHNU SERIES Dr No:241
1st Prize Rs.50000/- 247979
2nd Prize Rs.7000/- 63160
3rd Prize Rs.3500/-
06277 12071 20440 20487 40916
43145 50222 53312 57303 92803
4th Prize Rs.200/-
0036 2478 2995 3514 4813 5296 6655
7793 8692 8937
5th Prize Rs.100/-
0138 1487 1574 2432 6339 8727 8954
9392 9399 9739
6th Prize Rs.50/-
0010 1692 2514 3988 5632 7285 9024
0087 1874 2797 4025 5675 7353 9138
0166 1928 2872 4418 5804 7359 9150
0239 1972 2963 4441 5950 7361 9174
0284 2026 2978 4472 6095 7464 9235
0293 2112 3068 4723 6183 7802 9286
0449 2128 3127 4828 6247 7856 9287
0727 2181 3207 4886 6266 7922 9406
0835 2245 3282 4991 6588 8048 9452
1093 2279 3326 5036 6891 8120 9623
1362 2282 3495 5128 6898 8153
1373 2327 3634 5248 6930 8495
1457 2369 3689 5329 6947 8539
1544 2371 3730 5438 6956 8558
1587 2457 3821 5618 7146 8595

### SWARNALAXMI LION DIAMOND FRIDAY
DrawDate on:31/05/24

SWARNALAXMI SERIES Dr No:241
1st Prize Rs.50000/- 965137
2nd Prize Rs.7000/- 87921
3rd Prize Rs.3500/-
19857 21869 32199 32663 43713
54496 65586 76377 87215 98629
4th Prize Rs.200/-
1065 1598 3048 3930 5580 6326 7855
8219 8387 9909
5th Prize Rs.100/-
0099 2487 2619 2881 3038 5412 5876
6893 9263 9461
6th Prize Rs.50/-
0028 0964 2778 4807 6399 7174 8645
0181 1112 2880 4813 6425 7190 8858
0207 1117 2976 5003 6441 7569 9007
0264 1295 3174 5326 6494 7620 9190
0283 1638 3629 5417 6548 7838 9306
0311 1864 3662 5615 6640 7915 9381
0322 1904 3702 5653 6694 7946 9603
0324 2239 3752 5737 6767 7972 9727
0337 2297 3808 5865 6870 8143 9741
0414 2336 3879 5888 6914 8199 9980
0498 2380 4009 5998 6986 8253
0666 2404 4164 6098 7046 8502
0841 2547 4254 6130 7069 8525
0913 2621 4383 6337 7077 8550
0928 2702 4656 6359 7105 8598

DAY - LION SERIES Dr No:100
1st Prize Rs.50000/- 831938
2nd Prize Rs.7000/- 86819
3rd Prize Rs.3500/-
18340 29276 31340 42353 53150
64308 75902 86515 97276 97628
4th Prize Rs.200/-
0959 2114 3868 3946 4702 4826 6298
7742 8470 9346
5th Prize Rs.100/-
0017 0349 1220 2667 3922 4485 4908
5266 7546 8052
6th Prize Rs.50/-
0060 1646 2111 3883 4965 6952 8586
0189 1678 2194 3912 5046 6963 8720
0313 1683 2287 4018 5317 6991 8799
0576 1691 2404 4035 5421 7006 9067
0698 1748 2611 4192 5507 7081 9285
0707 1772 2836 4202 5554 7189 9300
0743 1776 2867 4275 5633 7263 9372
0756 1785 2889 4353 5923 7278 9651
0902 1972 3008 4402 6042 7360 9800
1002 1991 3143 4550 6052 7554 9880
1075 2007 3169 4687 6211 7580
1338 2070 3374 4699 6336 7622
1555 2075 3469 4857 6369 7637
1584 2079 3656 4900 6590 7763
1599 2109 3804 4937 6606 7766



ఏవి శేషసాయి వీడ్కోలు సభలో ప్రసంగిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్

# పదవీ విరమణ చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవి శేషసాయి

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి శుక్రవారం పదవి విరమణ చేసారు.ఈ సందర్భంగా ఆయనకు హైకోర్టులోని మొదటి సమావేశ ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సభ జరిగింది.ఈ సభలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ జస్టిస్ ఏవీ శేషసాయిసేవలను కొనియాడారు. న్యాయమూర్తిగా శేషసాయి 23వేలకు పైగా కేసులు పరిష్కరించారన్నారు. న్యాయవ్యవస్థల్లో ఆయన అందించిన అమూల్యమైన సేవలు ప్రశంసనీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా,2014లో పదోన్నతి పొంది ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా న్యాయస్థానం అన్ని విభాగాల్లో ఆయన సేవలను అందించారన్నారు.శేషసాయి ఏపీ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగాను వ్యవహరించారు.విద్యావేత్తగాను,సాహిత్య,.సాంస్కృతిక రంగాల పట్ల అవగాహన వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది.బ్యాంకు రుణాలకు సంబంధించిన కేసులు ,మోటార్ వెహికల్ చట్టాలు. ఇతర సామాజిక చట్టాలు, మానవ హక్కులు తదితరంశాలపై జస్టిస్ ఏవీ శేషసాయి సింపోజియంలు,సెమినార్ల నిర్వహణ సందర్భంలో కీలకంశాలపై మార్గదర్శనం చేసారు.

కారాగారాల్లోను చట్టాలపై అక్కడి వారికి అవగాహన కల్పించారు.సభలో జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ తాను భౌతికంగా పదవి విరమణ చేస్తున్నా, మనస్సు అంతా న్యాయస్థానంపై ఉంటుందన్నారు.దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక బార్ అసోషియేషన్ మన ఏపీలో ఉండటం సంతోషదాయకమన్నారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి,హైకోర్టు బార్ అసోషియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం. ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకా నాధ్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి సత్యప్రభాకరరావు, హైకోర్టు రిజిస్ట్రార్ వై.లక్ష్మణరావు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారులు మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 31, ప్రభాతవార్త** : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ - మండపేట ఆర్‌అండ్‌బి రోడ్డుపై గుమ్మిలేరు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలమూరుకు చెందిన ఇద్దరు మత్స్యకారులు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఆలమూరు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు. ఆలమూరు గ్రామానికి చెందిన లంకె సూరిబాబు (49), మనాడి సాయి బాబు (62) మరికొందరు మత్స్యకారులతో కలిసి బొలెరో వాహనంలో తుంగపాడు చెరువులో చేపల వేటకు వెళ్ళుచుండగా స్థానిక జయలక్ష్మి రైస్‌మిల్ సమీపంలో పౌర సరఫరాల శాఖకు చెందిన ట్రాక్టర్ మండపేట నుండి ఆలమూరుకు వస్తుండగా బొలెరో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొనడంతో బొలెరో తొట్టెలో ఉన్న సూరిబాబు, సాయిబాబు సంఘటన స్థలంలోనే మృతి చెందగా డ్రైవర్ పక్కన కూర్చున్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలవ్వగా మరికొందరికి స్వల్ప గాయాలు అయినట్లు ఆయన తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీత రచన పోటీ, ఎంపికైన గీతానికి రూ.లక్ష

### - ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్



**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 10ఏళ్ళు పూర్తయి,ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తున్న సందర్భంలోను రాష్ట్ర గీత రచన పోటీని నిర్వహిస్తున్నట్లు ఏపీ సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మీడియాకు ఒక సమాచార పత్రంలోవివరించారు.రాష్ట్రం స్వయంగా అభివృద్ధి చాటుకుంటున్న దశలో కచ్చితంగా తన ప్రభావాన్ని వివరించే ఒక మహోత్తరగీతం అవసరమన్నారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం దాక శోభిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ భౌగోళిక, సాహితీ,సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పే గీతం అవసరం ఉందన్నారు.ఈ విషయాన్ని గుర్తించినందునే ఏపీ సారస్వత పరిషత్ సరి కొత్త రాష్ట్ర ప్రార్ధనా గీతం రూపొందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అందించాలని సంకల్పించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రగీతంగా ఉన్న "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" గీతాన్ని అపూర్వవైభవంగా గుర్తిస్తూ,. గౌరవ విస్తార్తమాన ఆంధ్ర ప్రాంత వైభవ స్వాభిమాన గీతాన్ని రూపొందించాలన్నారు. 30 జూన్ లోపున అయిదు నిమిషాలు నిడివి కలిగిన గీత రచన కోసం పోటీ నిర్వహిస్తున్నామన్నారు. అభిలాష కలిగిన కవులు వారు రాసిన గీతాన్ని కార్యదర్శి,ఆంధ్ర సారస్వత పరిషత్, అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రం, నరసాపురం, పశ్చిమగోదావరి జిల్లా చిరునామాకు పంపించాలన్నారు. జూలై15న ఎంపికైన గీతాన్ని ప్రకటిస్తామన్నారు. ఎంపికైన గీతానికి రూ.లక్ష బహుమతిగా అందిస్తామన్నారు. ప్రముఖ సంగీత విద్యాంసులచే గీతాన్ని స్వరబద్ధం చేయించి, ధ్వని ముద్రణ చేసి, అనంతరం ఆ గీతాన్ని ముఖ్యమంత్రికి సమర్పిస్తామన్నారు.

# తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తరాదికి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, మే 31 ప్రభాతవార్త** దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ నేటి నుంచి ( ఈ నెల 01 నుంచి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ముజఫర్ పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 05295 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 01న శనివారం బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి ముజఫర్ పూర్ వెళ్లే నెంబర్05296 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 03న సోమవారం సికింద్రాబాద్ నుంచి బయల్దేరుతుంది. అలాగే పాట్నా నుంచి మంగళూరు వెళ్లే నెంబర్ 03243 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 01న శనివారం పాట్నా నుంచి బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో మంగళూరు నుంచి పాట్నా వెళ్లే నెంబర్ 03244 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 04న మంగళశారం మంగళూరు నుంచి బయల్దేరుతుంది. ముజఫర్‌పూర్-సికింద్రాబాద్- ముజఫర్‌పూర్‌ల మధ్య తిరిగే నెంబర్ 05295/96 ప్రత్యేక రైళ్లు మార్గమధ్యంలో హాజీపూర్, పాటలీపుత్ర, దానాపూర్, అరా, బక్సర్, మొఘల్ సరాయ్, అలహాబాద్, సత్నా, కత్నీ, జాబ్బల్పూర్, ఇటార్సీ, నాగ్‌పూర్; బల్హార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, ఖాజీపేట స్టేషన్‌లలో నిలుస్తాయి.



గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

## 15 కిలోల గంజాయి పట్టివేత

**గూడూరు, మే 31, ప్రభాతవార్త:** గూడూరు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని వినాయకుని గుడి వద్ద అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఈబి కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈబి సిఐ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన పాపన్న అనే వ్యక్తి గంజాయిని చెన్నైకి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యంలో గూడూరు ఆర్టీసి సమీపంలోని వినాయకుని గుడి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతుండగా సాధారణ తనిఖీల్లో భాగంగా అరెస్టు చేశామన్నారు. అతని వద్ద 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. దీని విలువ సుమారు 75 వేల రూపాయిలు ఉంటుందన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మోసెస్, కిరణ్ సింగ్, ప్రసాద్, కృష్ణయ్య, గౌస్ భాషా, ఆనంద్ బాబు , రవి తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్ మెడిసిన్ విభాగంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

**తిరుపతి హెల్త్, మే 31, ప్రభాతవార్త** స్విమ్స్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్విమ్స్ ఓపిడి బ్లాక్ నందు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్, స్విమ్స్ డీన్ మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్, మెడిసిన్ విభాగపు వైద్యులు హరికృష్ణ, డా. మనోలాస్య, డా. సమీరజ, డా. భార్గవ్, డా. చంద్రశేఖర్, సైకియాట్రి విభాగం సహాయక ఆచార్యులు డా. గణేష్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆర్థికంగా బలమైన పొగాకు వ్యాపారమని, మనిషి జీవితంలో ఈ పొగాకు వాడకం మొదటి ఫ్యాషన్‌తో మొదలయ్యి తరువాత దలలేని మానసిక స్థితికి వచ్చి మానసికంగా కృంగిపోయి దీనికి బలౌతున్నారని పేర్కొన్నారు. అనంతరం స్విమ్స్ డీన్, మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం వారి సంయుక్త ఆదేశానుసారం 1987 సంవత్సరం నుంచి వరల్డ్ హెల్త్ అసెంబ్లీ డబ్ల్యూహెచ్ఏ 40.38 రిజల్యూషన్ ప్రకారం ఓరల్డ్ నో స్మోకింగ్ డేగా, 1988 సంవత్సరం డబ్ల్యూహెచ్ఏ 41.19 రిజల్యూషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మే 31 తేది ఓరల్డ్ నో టొబాకో డేగా జరుపుకుంటామని తెలిపారు. పొగ తాగడం, పొగ తాగే వారికి ఆరోగ్యహాని కలిగించడమే కాకుండా, పొగను పీలుస్తూ ఉన్న పక్క వారి ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని పొగాకు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా పర్యావరణం పై కూడా అనేక విధాలుగా చెడు ప్రభావం చూపుతుందని తెలియజేసారు. అనంతరం పొగాకు వినియోగం, దాని ఉత్పత్తికి సంబంధించిన ప్రమాదాల గురించి, కుటుంబం, సమాజం, పర్యావరణంపై దాని దుష్ప్రభావం గురించి అవగాహన కల్పించేందుకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కార్యక్రమానికి హాజరైన పేషంట్లకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడిసిన్ విభాగం వైద్యులు, నర్సింగ్ డిప్యూటి డైరెక్టర్ ప్రభావతి, అసిస్టెంట్ డైరెక్టర్ పిఆర్‌వి రాజశేఖర్, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్, ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్, తదితరులు

## శివయ్యకు నిత్యోత్సవం: జ్ఞానప్రసూనాంబకు ప్రత్యేకాలంకారాలు

**శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవునికి నిత్యపూజలు, అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అమ్మవారికి 116 బంగారు పుష్పాలతో అభిషేకించారు. అంతేకాక బంగారు చీరతో ముస్తాబు చేసి క్రికిరీటాన్ని అలంకరించారు. ఇటీవల ఆలయానికి అతిధుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచనలతో ఆలయ సిబ్బంది యుద్ద ప్రాతిపదికపై ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. మహిళా భక్తుల మనో భావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.శుక్రవారం ఆలయంలో వెలసిన దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితిగా ఉంది.ఈ సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి.

## దుర్గమ్మ ఆలయానికి రూ.38లక్షల ఆదాయం

**ఇంద్రకీలాద్రి, మే 31, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ ఆలయానికి శుక్రవారం రాత్రి 8 గంటల వరకు వచ్చిన ఆదాయాన్ని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇఒ కెఎస్ రామారావు వెల్లడించారు. వివిధ టికెట్ల ద్వారా రు.38,53,664లు లభించినట్లు తెలిపారు. రు.500 టికెట్లు 1965 ద్వారా రు.9,82,500, రు.300 టికెట్లు 1390 ద్వారా రు.4,17,000, రు.100 (6272) ద్వారా రు.6,26,200, కేశఖండన (3444) మంది భక్తులు, లడ్డూ ప్రసాదం (రు.15) ద్వారా రు.56,986లు, పులిహోర ద్వారా రు.27,683, విరాళాల ద్వారా రు.2,51,999లు లభించాయన్నారు. శుక్రవారం సందర్భంగా దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు నిత్యార్జిత సేవలైన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతికళ్యాణం, శ్రీచక్రనవార్చనపూజ, తదిత సేవల్లో విరివిగా పాల్గొన్నారు. భక్తులకు దర్శనపరంగా ఇబ్బందులు రాకుండా ఇఒ తగు చర్యలు తీసుకున్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం అనుబంధ ఆలయమైన సీతానగరంలోని శ్రీ మద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండ రామస్వామివార్ల దేవాలయం నందు కొనసాగుతున్న హనుమత్‌జయంతి వేడుకల్లో భాగంగా హనుమజ్జయంతి సందర్భంగా శనివారం ఉదయం 1100 మామిడి పండ్లతో చూత ఫలసహస్ర నామార్చన, మన్యుసూక్త హోమం అనంతరం పూర్ణాహుతి, సాయంత్రం 7 గంటలకు శ్రీ సువర్చలా సమేత శ్రీ వీరాంజనేయ స్వామివార్లకు శాంతికళ్యాణం నిర్వహిస్తామన్నారు. జూన్ 2 తేదీన ఉదయం 9 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు.

# అవ్వ ఇంట్లో బంగారానికి కన్నం వేసిన మనవడు

### - 3.84లక్షల విలువ చేసే బంగారం స్వాధీనం.. నిందితుడు అరెస్ట్ !

కుప్పం, మే 31 ప్రభాతవార్త : వరుసకు మనవడు అయిన ఓ యువకుడు అవ్వ ఇంట్లో బంగారానికి కన్నంవేశాడు. ఇంట్లో ఉన్న 3.84లక్షల విలువ చేసే బంగారు నగలను చోరీ చేశాడు. 24గంటల్లోనే బంగారంతో సహా పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి కుప్పం డిఎస్పీ బందారు శ్రీనాథ్ శుక్రవారం నిందితుడి అరెస్ట్ చేసి బంగారం స్వాధీనం చేసుకున్నారు. డిఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని ఊరినాయనపల్లి గ్రామానికి శిమ్మ అనే వృద్ధురాలు బెంగళూరులో కూలీ పనులు చేసి జీవనం సాగించేదన్నారు. రెండు నెలలకు ఒసారి స్వగ్రామానికి వచ్చి వెళ్లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 29 తేది ఆమె స్వగ్రామం వచ్చి ఇంటిని పరిశీలించిందన్నారు. ఇంట్లో ఉన్న సుమారు 64 గ్రాముల విలువ చేసే జత బంగారు గాజులు, బంగారు గొలుసు కన్పించకుండాపోయేసరికి తమకు ఫిర్యాదు చేసిందన్నారు. అదే రోజు కేసు నమోదు చేసి సిఐ రమణ, ఎస్సై సుబ్బారెడ్డి నేతృత్వంలో సిబ్బందితో కేసు దర్యాప్తు చేయించామన్నారు. అదే గ్రామానికి చెందిన శిమ్మకు మనవడి వరుస అయిన కదిరివేలు (23)ను విచారించగా అతనే చోరీకి పాల్పడి బంగారాన్ని తస్కరించినట్లు నేరం అంగీకరించాడన్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేయడంతో పాటు సుమారు 3.84లక్షల విలువ చేసే బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. చోరీ కేసును 24గంటల్లోనే ఛేదించిన అర్బన్ సిఐ రమణ, ఎస్సై సుబ్బారెడ్డి, సిబ్బంది శంకర్, ప్రభు, చంద్రలకు నగదు రివార్డును డిఎస్పీ అందజేశారు. గ్రామాల్లో చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాధ్యమైనంత మేర సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.



# తిరుమల సమాచారం



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు దాత భారీ విరాళమిచ్చాడు. తెలంగాణా హైదరాబాద్‌కు చెందిన అక్షక్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేతలు వివేక్‌కైలాస్, విక్రమ్ కైలాస్ 1.5కోట్ల రూపాయలు డిడిలను శుక్రవారం ఉదయం తిరుమలలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డికి అందజేశారు. స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మేనెలలోనూ వందకోట్లు దాటిన వెంకన్న హుండీ ఆదాయం !

### - కానుకల రాబడి రూ.108కోట్లు

**తిరుమల, మే 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు ఏడుకొండల శ్రీవెంకటేశ్వర స్వామిని సంతృప్తికరంగా దర్శించుకుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా,స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డుసృష్టిస్తోంది. మేనెలలో తిరుమలకు చేరుకున్న భక్తులు మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించిన కానుకలు 108కోట్లు రూపాయలుగా నమోదైంది. 2024 నూతన ఏడాది ఆరంభం నుండి టిటిడి చరిత్రలో నెలనెలకో ప్రత్యేకత సంతరించుకుంటోంది. కోట్లాది మంది హిందు భక్తులు దేశవిదేశాల్లో స్థిరపడి ఉన్నవాళ్ళంతా ఏడుకొండలకు చేరుకుని తమ ఇష్టదైవాన్ని, కులదైవాన్ని దర్శించుకోవడం జరుగుతోంది. ఈ ఏడాది జనవరిలో వెంకన్న హుండీద్వారా ఖజానాకు 116.46కోట్లు రూపాయలు ఆదాయం లభించగా, ఫిబ్రవరిలో 111.71కోట్లు, మార్చినెలలో 118.49కోట్లు, ఏప్రిల్‌నెలలో 101.63కోట్లు రూపాయలు,

జూన్‌నెలలో 108.36కోట్లు రూపాయలు ఇలా వరుసగా ఐదునెలలు వంద కోట్లు రూపాయలు పైగానే దాటి రికార్డుస్థాయిలో నమోదైంది. మేనెలలో కూడా 18.80లక్షల మంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుని వెంకన్నను దర్శించుకోగా కానుకల ద్వారా హుండీకి ఆదాయం 108 కోట్లు రూపాయలు లభించడం ప్రత్యేకత.

# అంజనాద్రిలో నేడు హనుమజ్జయంతి

### - ఉదయం బాలాంజనేయునికి ప్రత్యేకాభిషేకం



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల ఆకాశగంగ అంజనాద్రిలోని బాలాంజనేయస్వామికి శనివారం (నేడు) హనుమజ్జయంతి వేడుకలు జరుగుతాయి. జూన్ 1 తేదీ నుండి 5 వరకు పలు రకాల విశేష ఉత్సవాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించనున్నారు. అంజనాద్రిలోని ఆకాశగంగ ఆలయం, జపాలి తీర్థంలోని హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. నేడు హనుమజ్జయంతి సందర్భంగా అంజనాదేవి, బాలాంజనేయస్వామికి ఐదురోజులు ఉదయం 8.30గంటల నుండి 10గంటల వరకు అభిషేకం చేస్తారు. నేడు మొదటిరోజు మల్లెపూలు, 2న తమలపాకులు, 3న ఎర్ర గన్నేరు, కనకాంబరాలు, 4న చామంతి పూలు, జూన్ 5 తేదీ బుధవారం సింధూరంతో అభిషేకం చేస్తారు. వేదపండితులు ఆంజనేయసహస్రనామార్చన, మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి, అంజనాదేవికి అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 10గంటలకు ఆకాశగంగ వద్ద ఆంజనేయ జన్మవృత్తాంతంపై ప్రవచన కార్యక్రమం ఉంటుంది. అంజనాద్రిని టిటిడి సర్వాంగసుందరంగా ముస్తాబుచేసింది, భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు.

# తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి

### -మాజీ మంత్రి శిద్దారాఘ రావు



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలకు శుభాలు కలగాలని ,అందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు మాజీ మంత్రి శిద్దారాఘ రావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన దంపతులు వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,మే 31ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ , సినీ నటి డింపుల్‌హాతియ, సినీ దర్శకుడు శ్రీకాంత్‌ఓడెల,నటుడు తేజ, పాండిచ్చేరి మాజీ మంత్రి చంద్రప్రియాంక వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆతరువాత స్వామివారి మూలవిరాట్టును దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు.

# వరుస సెలవులతో ఏడుకొండలు కిటకిట

### -వెంకన్న సర్వదర్శనానికి 30గంటలు



**తిరుమల,మే 31 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ...ఆపై త్వరలో ఓట్ల లెక్కింపు జరగనుండటం... వారాంతంతో శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు. శుక్రవారం ఉదయానికి కొండ భక్తజనంతో కిటకిట లాడుతోంది. ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆక్టోపస్ భవనం వరకు చేరాయి. వెలుపల లైన్లలో భక్తులు వేలాది మంది బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. మధ్యాహ్నానికి 30గంటలు సమయం నిరీక్షించాల్సిన పరిస్థితి. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు సేవలందిస్తున్నారు. సాయంత్రం వరకు 55వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

-ఫిలప్‌మాసింగర్

# తెలుగుకు అన్యాయం చేయొద్దు

తెలుగు భాష విషయంలో పాలకులు వ్యవహరిస్తున్న తీరు కడుపుచించుకుంటే కాళ్లమీదపడ్డట్టుగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయం, అందువల్ల సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుంటే ఆవేదన కలగక తప్పదు. తెలుగుప్రజల ప్రతినిధులమని గొప్పచెప్పుకుంటున్న నేతలు తెలుగు రాష్ట్రాల్లోనే తెలుభాష నిరాదరణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఎక్కడో ఉన్న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తెలుగుభాషను గుర్తించి రాష్ట్రంలో తెలుగువారిని భాషాపరమైన మైనార్టీలుగా గుర్తిస్తున్నట్లు ఆ ప్రభుత్వం మూడేళ్లక్రితమే ప్రకటించి ప్రోత్సహిస్తున్నది. ఇలా చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయనే విమర్శలు ఉన్నా తెలుగు భాషకు ఇంతటి గుర్తింపు ఇవ్వడం ప్రతి తెలుగువారు సంతోషించదగ్గ పరిణామం. దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది తెలుగువారు ఉన్నారు. కానీ తెలుగు భాషప్రాముఖ్యత, మాట్లాడేవారి సంఖ్య రానురాను తగ్గిపోతుందేమోననిపిస్తున్నది. దేశభాషల్లో ప్రథమ స్థానం హిందీదే. రెండో స్థానంలో బెంగాల్ ఉంది. 2001లో 8.1 శాతం ప్రజలు బెంగాలీ మాట్లాడుతుండగా 2011 నాటికి 8.3 శాతానికి ఎగబాకి దేశంలో రెండోస్థానాన్ని ప్రకటించుకున్నది. అప్పట్లో 7.19 శాతం మంది ప్రజలు మాట్లాడే తెలుగు భాష మూడుస్థానంలో ఉండేది. కానీ 2011 నాటికి తెలుగు మాట్లాడేవారి సంఖ్య 6.3శాతానికి పడిపోవడంతోమూడో స్థానాన్ని మరాఠి భాష దక్కించుకున్నది. 2001లో6.99శాతంతో ఉన్న మరాఠిభాష 2011 నాటికి7.09 శాతానికి చేరింది. దీంతో తెలుగు నాలుగో స్థానానికి చేరుకున్నది. ఇతర భాషలు పెరుగుతుంటే తెలుగు మాత్రం తగ్గిపోతున్నది. అసలు తెలుగు భాషకు పుట్టినిల్లు అయిన తెలుగురాష్ట్రాల్లోనే తెలుగును ఏమాత్రం అమలు చేస్తున్నారో పరిశీలిస్తే నేతల త్రికరణ శుద్ధి స్పష్టమవుతుంది. ప్రపంచమే గ్లోబల్ విలేజ్‌గా మారిందని, సాంకేతికంగా ఎంతో అభివృద్ధిచెందుతుంటే తెలుగు తెలుగుఅంటూ పరిమితులు గీసుకుంటే ఎలా అని ప్రశ్నించేవారు లేకపోలేదు. అభివృద్ధివైపు పరుగులీడాల్సిందే. అందుకు అనుకూలమైన, అవసరమైన భాషలు నేర్చుకోవాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అన్యభాషలను ఉద్దేశించమని చెప్పడంలేదు. కానీ మాతృభాషపై అభిమానం చంపుకోవడం ఏమాత్రం మంచిది కాదు. మాతృభాషగా విశేష స్థానం కలిగిన తెలుగును బలిపెట్టి మరో భాషకు అగ్రపీఠంవేయడం మాత్రం నిజంగా క్షమించరాని నేరం. తెలుగు రాష్ట్రాల్లో ఇదే జరుగుతు న్నది. ఇంగ్లీషులో చదివించడం ఒక స్టేటస్ సింబల్‌గా మారి పోయింది. తెలుగు మాట్లాడేవారిని ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచూపు చూడడం పరిపాటి అయింది. కొందరు తెలుగులో తమ భావాలను స్పష్టంగా వ్యక్తం చేయగలిగినా ఆంగ్లంలో వ్యక్తం చేసేంత పరిజ్ఞానం లేకపోయినా వచ్చీరాని మాటలతో ప్రయత్నిస్తున్నారే తప్ప స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడటానికి నామూషిగా భావించే దురదృష్టపురోజులు దాపురించాయి. తెలుగుభాష అమలుకు ఎన్నో చట్టాలు చేశారు. మరెన్నో నిబంధనలు విధించారు. వాటి అమలు గూర్చి పట్టించుకోవడం లేదు. పేరుకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ రెండు అధికార భాషా సంఘాలు ఏర్పడ్డాయి. తెలుగు రాష్ట్రాల్లో తెలుగును నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకునే అధికారం కట్టబెట్టలేదు. తెలుగు భాషకు సుదీర్ఘమైన చరిత్రఉంది. క్రీ.పూ. నాటికి తెలుగు భాష ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి. క్రీ.పూ 200 సంవత్సరాల నుంచి తెలుగు ఉనికిని చాటే శాసనాలు ఎన్నో ఉన్నాయి. కడపజిల్లా కులమల్లా ఎర్రగూడి పాడువద్ద లభించిన శాసనాలు క్రీ.శ 575కు సంబంధించినవి. వీటిని రేనాటి చోళ్లవంశానికి చెందిన రాజు ఎరికల్ ముత్తురాజ్ ధనుంజేయుడు చెక్కించినట్లు చరిత్ర చెబుతున్నది. ఏకోణంలో చూసినా తెలుగుభాషకు రెండు వేల ఏళ్లకుపైగా చరిత్రఉంది. భారతదేశం నుంచి అరబ్‌లు, ఫ్రెంచ్, డచ్, బ్రిటిష్ తదితర విదేశీయుల ద్వారా అనంతమైన భారతీయ సంస్కృతి విదేశాలకు తరలిపోయింది. ఈ సంపదతోపాటు సాహిత్యానికి సంబంధించిన అనేక విషయాలు మరుగునపడిపోయాయి. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తెలుగుభాషకు సముచిత ప్రాధాన్యతఇవ్వ లేదనే చెప్పొచ్చు. అలాని ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నామని పదేపదే చెప్పుకుంటున్నారు. సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలను కూడా ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు అమలులో జరుగుతున్న నిర్లక్ష్యానికి సామాన్యులు సైతంఎంతటి ఇబ్బందులకు గురవుతున్నారోపట్టించుకోవడం లేదు. ఇటు అభివృద్ధి అటు శాంతి భద్రతలపైన ఈ ప్రభావం పడుతుందంటే ఆశ్చర్యం కలగకమానదు. పోలీసు స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల్లో న్యాయ స్థానంలో వాద నలు, ప్రతివాదనలు చివరకు తీర్పులు కూడా ఆంగ్లంలో ఉండడంతో అర్థంకాక ఎన్నోకేసులు వీగిపోతున్నాయి. రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు దేశంలోనే మొట్ట మొదటిసారిగా తెలుగులో రాజ్యాంగంపై రెండేళ్ల ఎల్ఎల్ఎం, మూడేళ్ల లా డిగ్రీ ఏర్పాటు చేసేందుకు నల్సార్ విశ్వవిద్యాలయం ప్రయత్నాలు ప్రారంభించడం ఎంతో హర్షించదగ్గ పరిణామం. ఇకప్రభుత్వ విభాగాల్లో ఇంగ్లీషు వాడడం వల్ల ఎన్నో వైఫల్యాలు గురవుతున్నాయి. కనీసం ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ తెలుగు అమలుకు కృషి చేస్తే సామాన్యులకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

పది రూపాయల ఆదాయానికి వంద రూపాయలు ఖర్చు చేస్తే జీవితాంతం కష్టాలు తప్పవు.



బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### మార్కెటింగ్ అవసరమా?

ప్రధాని మోడీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'గాంధీ గురించి కాంగ్రెస్‌పార్టీ గట్టిగాప్రపంచానికి చాటి చెప్పలేదు. ఆయనపై సినిమావచ్చేవరకూ ప్రపంచానికి తెలియలేదు అన్నారని వార్త. ఆవ్యాఖ్య సత్యదూరం. గాంధీ పేరుని ఇంటిపేరుగా వాడుకుని కాంగ్రెస్ అధిష్టానం అరవై యేళ్లైనాఇప్పటికీ రాజకీయ లాభం పొందుతుందని, అసలుఆయనకీ, ఆకుటుంబానికీ సంబంధంలేదన్నది కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలన్నింటిదీ ప్రధాన ఆరోపణ. బిజెపి ది కూడా అదే అభిప్రాయం. అయినా ప్రభుత్వాలు ప్రచారం చేస్తేతప్ప ప్రపంచానికి తెలియని పేరాఆయనది? అక్షరాస్యత, సాంకేతికత తక్కువగా ఉన్నరోజుల్లో ఆయన పిలుపుకి దేశమంతా స్పందన ఎలా సాధ్యమయ్యేది అని. కాబట్టి ఏరకంగా చూసినా ప్రధాని చెప్పిన విషయం అదే సినిమా వచ్చాక తెలిసింది అన్నది అతిశయోక్తి.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

### పునరావృతం కాకూడదు

పోలింగ్ సందర్భంగానూ, ఆతరువాత రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో చెలరేగిన హింస, ఘర్షణలు ప్రజాస్వామ్య ప్రక్రియకు సవాల్ విసురుతున్నాయి. పోలింగ్ జరిగి వారాలు గడుస్తున్నా రాష్ట్రవ్యాప్తంగాపలుప్రాంతాలు పోలీసు పహారాలోనే కొనసాగుతున్నాయి. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాలతోపాటుమరికొన్ని చోట్లకౌంటింగ్ తరువాత కూడా 25రోజులపాటు భద్రతా దళాలను మోహరించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయంతీసుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రాజ్యాంగ సవరణ అవసరం

వృద్ధులకు సామాజికపెన్షన్‌ను పెంచడంపెద్దకష్టమైన పని కాదు. ఉద్యోగులు, రాజకీయ నాయకులు ప్రజలకు మోయలేని భారంగామారారు. వీరినిర్వహణ ఖర్చు తగ్గించుకుంటే మంచిది. పదవులు పొందిన రాజకీయనాయకులు ఎవరైనా ఇకపైవాళ్ల ఐదేళ్లకాలంలో ఒక్క రూపాయి ఆదాయం కూడా పెంచుకోకుండా, వాళ్లకి ఇచ్చిన పెన్షన్ జీత భత్యాల లెక్కలు పాన్‌కార్డు ఆధార్‌కార్డు లింకులతో చెప్పేటటువంటి రాజ్యాంగ సవరణజరగాలి. వృద్ధులకు పెన్షన్ పెంచడంపై దృష్టిసారించాలి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

### మిగతా కోర్సులపై దృష్టి ఏది?

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులలో ఎక్కువ మంది తమ పిల్లలు ఇంజనీరింగ్ పూర్తి చేసిన వెంటనే అమెరికా వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడాలని కోరుకుంటున్నారు. అలాకోరుకోవడంలో తప్పులేదు. కానీ పరిస్థితులు ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. కొంతకాలం నుంచి అమెరికాలో ఆర్థిక మాంద్యం నడుస్తోంది. స్థానికంగా ఉండే అమెరికన్స్‌కే సరిగ్గా ఉద్యోగాలు దొరకడంలేదు. పైగా గత కొన్నిసంవత్సరాలుగా మనదేశం నుండి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు అక్కడ చదువుకోవడానికి వెళుతుంటే మరికొందరు ఉద్యోగాలు చేయడానికి వెళుతున్నారు. అమెరికాలో ఉన్న విద్యార్థుల సంఖ్యలో వీరు 25శాతంగా ఉన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. చదువు అంటే కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమేకాదు. చాలా కోర్సులున్నాయి. విద్యార్థులు పరిశోధనారంగంపై కూడా దృష్టిపెట్టవచ్చు. ప్రభుత్వాలు కూడా ఇటువంటి వాటిపై దృష్టి సారించి అవగాహన కల్పించాలి.

-యం.రాంప్రదీప్, తిరువూరు

### సోలార్ విద్యుత్‌పై అవగాహన అవసరం

నిజమే ప్రపంచం ఇప్పుడు శిలాజ ఇంధనాలకు బదులుగా సూర్యరశ్మివైపు దృష్టిమళ్లించింది. దానిలో భాగంగానే ఇంటర్నేషనల్ సోలార్ అలియన్స్ భారత్ ప్రారంభించిన ప్రధాన మంత్రి సూర్యోదయ యోజనను అర్థంచేసుకోవాలి. భారత్ కోటి ఇండ్లకు సూర్యరశ్మి ద్వారా కరెంట్అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టుని ప్రారంభించింది. దాని ద్వారా సోలార్ పలకల పరిశ్రమ అభివృద్ధి చెందడమే కాకుండా కొన్ని లక్షల మందికి ఉద్యోగాల కల్పన కూడా జరుగుతుంది. ఎందుకంటే ఇప్పటివరకు సేవా రంగంమీదనే ఆధారపడి వృద్ధిని కొనసాగించిన భారత్ కేవలం 17 శాతం మాత్రమే తమవంతు పాత్ర వహించిన పారిశ్రామిక రంగం ఇకనైనా కుదుటపడి తేరుకుంటుందేమో చూద్దాం.

-భారత అవినాష్, జనగామ

### నీటి వృధాను అరికట్టాలి

ఈ వేసవికాలం నీటి కొరతతో ప్రజానీకం ఇబ్బంది పడుతుంది. ప్రస్తుతం ఎండలు తీవ్రతరం కావడంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. దీంతో గ్రామీణ, పట్టణప్రాంతాలలో నీటి సమస్య ఏర్పడింది. భూగర్భజలాలు రోజురోజుకి అడుగంటిపోతున్నాయి. ఇలాంటి సమస్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలి. అందరూ నీటి వృధాను అరికట్టాలి.

-కె.రామకృష్ణ, నాగర్ కర్నూల్‌జిల్లా

# బాలకార్మికుల వెట్టికి మూలం పేదరికమే

**తల్లిదండ్రులకు దూరమైన వారి ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు, ఇటు ఇష్టంలేని వ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. ఇందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్ర్యమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకాని మూలాలు వదిలి చట్టాలు తెచ్చుకున్నాం, నిర్ణయాలు తీసుకుంటున్నాం, సమావేశాలు, సమీక్షలు చేస్తున్నాం అంతా సజావుగా జరిగిపోతున్నట్లుగా ప్రకటనలు ఇచ్చుకోవడం అంటే మనలను మనం మోసం చేసుకోవడమే.**

దామెర్ల సాయిబాబ

చేసింది చెప్పుకోవడం సులభం. కానీ చెప్పింది చేయడం మాత్రం ఎంతో కష్టతరం. అలా హామీలు ఇచ్చి ప్రజల ముందు ప్రమాణాలు చేసి, ఆ తర్వాత మాట మార్చిన నేతలెందరో కాలగర్భంలో కలిసిపోయారు. కేవలం కొందరు మాత్రమే ఇచ్చినమాట నిలబెట్టుకొని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకొని చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మాట ఇచ్చేముందు అన్ని కోణాల్లో ఆలోచించి ఆచరణయోగ్యమా? కాదా?అందుకు తగిన వనరులు ఉన్నాయా? తదితర అంశాలు అన్ని పరిశీలించుకొని మాట ఇవ్వాలి. బాల కార్మికవ్యవస్థ నిర్మూలన విషయంలో పాలకులు మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. చట్టాల మీద చట్టాలు చేశారు, చేస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. అవేమీ ఆశించిన ప్రయోజనాలు చేకూర్చడం లేదు. అందుకు ప్రధాన కారణం అమలులో త్రికరణశుద్ధి లేకపోవడమనేది కాదనలేని వాస్తవం. చట్టాలు చేసేటప్పుడు ఉన్నశ్రద్ధ ఆచరణకు వచ్చేసరికి ఉండడం లేదు. అందుకే ఈ వ్యవస్థ చాపకిందనీరులా విస్తరిస్తున్నది. ప్రధానంగా కరోనా రక్కసి ప్రభావం విద్యారంగంపై ముఖ్యంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలపై తీవ్రంగా చూపింది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది విద్యార్థులు మరీ నిరుపేదల పిల్లలు బడిబాట మానేసి బాలకార్మికుల అవతారం ఎత్తారు. ఆర్థిక వసతులు లేకపోవడం, కంప్యూటర్, వాట్సాప్ ఫోన్‌లు కొనలేక, కొన్నా సాంకేతిక పరిజ్ఞానం లేకఇవన్నీ ఉంటే అక్కడ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువులకు స్వస్తిచెప్పారనే చెప్పొచ్చు. ఆ తర్వాత పాఠశాలలు తెరిచినా ఆవైపు చూడలేదు. వ్యవసాయ పనుల్లోనూ, పరిశ్రమల్లో కార్మికులుగా ఏదో చిన్నాచితక జీవనోపాధి చూసుకొని కాలం గడుపుతున్నారు. దీంతో బాలకార్మికవ్యవస్థ మళ్లీ బాగాపుంజుకున్నది. అప్పటి నుంచి యేడాదియేడాదికి పెరుగుతూ వస్తున్నదే తప్ప తగ్గడంలేదు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చట్టాలు చేయడం, ప్రకటనలు హర్షధ్వానాలు వ్యక్తం చేయడం, ఆ తర్వాత ఆచరణ గురించి పట్టించుకోకపోవడంతో ప్రయోజనాలు చేకూరలేదు. ఫలితంగా ఆటపాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన కోట్లాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి కొత్త చట్టాలు తీసుకొచ్చామని ఎన్నిసార్లు నేతలు ప్రకటించుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో మార్గంలో ఏదో ఒక రూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. అన్నింటికంటే ప్రధానంగా ఈ కూపం నుంచి బయటకు తీసుకువచ్చిన బాలకార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలు పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్నా ఇటీవల పెరిగినా చాలామంది అధికారులకు తెలిసినా పాలకులను నమ్మించేందుకు కాగితాల మీద ఏదో రాసుకొని కాలం గడుపుతున్నారు. మన రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో అప్పట్లోనే ప్రత్యేక శ్రద్ధతీసుకున్నారు. రాజ్యాంగంలోని 24వ అధికరణ బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. పద్నాలుగు సంవత్సరాల వయసుగల పిల్లలను, వ్యక్తులు కానీ, సంస్థలుకానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ) అధికరణ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రులు

## ఒక్క మాట

కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించిన భారం పనుల్లో నియమించరాదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. మరోపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమల్లో గనుల వంటి ప్రదేశాల్లో బాలకార్మికులను నియమించరాదని మరో చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. అయినా ఫలితం లేకుండాపోయింది. 1986లో పదమూడు రకాల వృత్తులకు సంబంధించి యాభైఏడురకాల పనులను బాలలతో చేయించరాదని మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. ఆ చట్టప్రకారం బాలకార్మికులను పనుల్లో నియమించుకునే వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అయినా లక్ష్యానికి చేరువ కాలేకపోయారు. 1994లో ఆందోళన చెందిన కేంద్రపాలకులు పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. రెండు వేల సంవత్సరం నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని అధికారికంగానే ప్రకటించారు. మరొక పక్క రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మికుల సంఖ్యను, పరిస్థితులను చూసి ఆందోళన చెందిన దేశ అత్యున్నత న్యాయస్థానం పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టాల్సిందిగా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. 2006లో మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఇళ్లల్లో పనిచేసే కోట్లాదిమంది బాలకార్మికులకు భరోసా కల్పించి వారికి అక్షరాలు నేర్పించి చైతన్యవంతులుగా చేయాలనే దిశగా నడుం బిగించింది. ఈ చట్టప్రకారం హోటళ్లలోనూ, ఇళ్లలోనూ రెస్టారెంట్లలోనూ, బార్లలోనూ తదితర చోట్ల పనిచేసే బాలకార్మికులందరికి విముక్తి కల్పించి ప్రత్యామ్నాయం చూపాలని నిర్దేశించారు. అలాగే బాలలను పనుల్లో నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని, జరిమానాలతోపాటు జైలుశిక్ష కూడా విధించేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. వెట్టిచాకిరిలో మగ్గిపోతున్న బాలబాలికలను ఎందరినో బయటకు తీసుకువచ్చి వారి వారి రాష్ట్రాలకు పంపారు. ఇందులో ఆనాటి పోలీసులు చేసిన కృషి అభినందనీయం. కానీ అలా వెళ్లినవారు తిరిగి పాతపనుల్లో ఏదోమార్గం ద్వారా వచ్చి చేరిపోయారు. ఇందుకు ముఖ్యంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేవు. బాలకార్మికులను కూపం నుంచి బయటకు తీసుకువచ్చామని పునరావాసం కల్పించామని చేస్తున్న ప్రకటనలు, ప్రచార్భాటాలుగానే మిగిలిపోతున్నాయి. అధికశాతం అలాంటి పిల్లలు తమతమ పాత పనులకే వెళ్తున్నారు. చట్టాలు తెచ్చామని సంబరపడితే సరిపోదు. అవి అమలుకు అవసరమైన సిబ్బందిని, వాతావరణ పరిస్థితులను కల్పించాలి. మరొకపక్క కొన్ని ముఠాలు దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్న కుటుంబాలను మాయమాటలతో గ్యాలం వేసి అంతోఇంతో డబ్బు ముట్టచెప్పి వారి పిల్లలను తీసుకువచ్చి చెరపట్టి, వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఇటుక బట్టీలు, హోటళ్లు, గాజుల తయారీ, తదితర పరిశ్రమల్లో బలవంతంగా పనిచేయిస్తున్న ఉదంతాలెన్నో బయటకు వచ్చాయి. ఈ రాక్షసముఠాలకు చిక్కిన ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన కొందరు బాలలను మొన్నమధ్య కాజీపేట రైల్వేస్టేషన్‌లో అధికారులు గుర్తించారు. తల్లిదండ్రులే తమ పిల్లలను నాలుగు డబ్బుల కోసం ఇలాంటి పనుల్లో చేరుస్తున్నారనే వాదనను కూడా తోసిపుచ్చలేం. పాలకులు మనసుపెట్టి ఒక విషయాన్ని ఆలోచించాలి. లేత వయసులో చదువుసంధ్యలతో ఆడుతూపాడుతూకళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించనిప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతుంటారో వేరే చెప్పక్కర్లేదు. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆవయసులో ఆ పనులకు పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలు పదిరాళ్లకోసం పరాయిపంచకు పంపడానికి కేవలం వారి ఆర్థిక పరిస్థితేనన్నది సత్యం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులు ఎన్నో చేస్తూ ఇంకెన్ని బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియందికాదు. అయినా వారి ఆర్థికపరిస్థితులు నోరు విప్పనీయడంలేదు. తల్లిదండ్రులకు దూరమైన వారి ప్రేమ వాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు, ఇటు ఇష్టంలేని వ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. ఇందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్ర్యమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకాని మూలాలు వదిలి చట్టాలు తెచ్చుకున్నాం, నిర్ణయాలు తీసుకుంటున్నాం, సమావేశాలు, సమీక్షలు చేస్తున్నాం, అంతా సజావుగా జరిగిపోతున్నట్లుగా ప్రకటనలు ఇచ్చుకోవడం అంటే మనలను మనం మోసం చేసుకోవడమే. ●

# భ్రూణహత్యల దశ దాటలేమా?

బి.మధుపాళి

నేటి ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాలలో రాణిస్తున్నా ఇంకా పుత్రుడు కావాలనే భావజాలం నుంచి తల్లిదండ్రులు బయటపడలేకపోవడం అత్యంత దురదృష్టకరమైన అంశం. ఈ మధ్యకాలంలో కర్ణాటక ప్రభుత్వం అల్ట్రా స్కానింగ్ గదిలోకి గర్భిణులతోపాటు వచ్చే అటెండర్స్‌ను నిషేధిస్తూ సర్క్యూలర్ జారీ చేయడం ఎంతైనా శుభపరిణామం. ఎందుకంటే అటెండర్స్ రూపంలో అల్ట్రాస్కానింగ్ గదిలోకి వచ్చి వీడియో తీసి మరీ లింగ నిర్ధారణ చేయడమే కాదు తద్వారా మహిళ కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తేలితే నిర్దాక్షిణ్యంగా అబార్షన్ చేయిస్తుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఇక 2011 లెక్కల ప్రకారం కశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాలలో 120 మంది అబ్బాయిలకు కేవలం 100 మందే అమ్మాయిలు ఉన్నారు. ఇలాంటి దారుణ పరిస్థితి ప్రస్తుత సమాజంలో ఉన్న నేటికీ ఒడిశా, కర్ణాటక, రాష్ట్రాలలోని లింగ నిర్ధారణ జరిపించి మరీ ఆడపిల్లలను ఏ మాత్రం జాలి, దయ, కరుణ లేకుండా వారిని మహిళ కడుపులోనే ఛిద్రం చేస్తున్న కడు దయనీయ పరిస్థితిని చూస్తే మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరి హృదయాలు తీవ్రంగా గాయపడటం, క్షోభించడం తథ్యం. అయితే సింగపూర్, థాయిలాండ్, దుబాయ్ దేశాలలో లింగ నిర్ధారణ చేయడం నేరం కాకపోవడంతో తీరా ఈ బలహీనతను ఆధారంగా చేసుకొని పైశాచిక, రాక్షస దుర్మార్గపు ప్రవృత్తిగల కొందరు ఒక రాకెట్‌లాగా ఏర్పడి ఆ వీడియోలను ఈ దేశాలలోని వైద్యులకు పంపించి మరీ లింగ నిర్ధారణ చేయించి ఆ తర్వాత అబార్షన్ చేయిస్తున్నారు. అంటే ఎంతటి వికృత, అమానుష చేష్టలు ప్రస్తుత సమాజంలో పొడచూపుతున్నాయో ఒక్కసారి మనం వింటేనే మనం ఒళ్లు తీవ్ర గగుర్పాటుకు, మానసిక వేదనకు గురవ్వడం తథ్యం. తాగాజా మాండ్యాలో ఇలాంటి అపాయకరమైన, అనారోగ్యకరమైన, అనాగరికమైన రాకెట్‌ను పోలీసులు ఛేధించి పట్టుకోవడంతో తీగ లాగితే డొంకంత కదిలినట్లు ఈ విషయంలో పోలీసు డిపార్ట్‌మెంట్ వారు దేశవ్యాప్తంగా కూడా గట్టి నిఘా ఉంచడంతో ఇక చేసేదేమీలేక సమస్య అత్యంత జటిలం కావడంతో కర్ణాటక ప్రభుత్వం సత్వరమే ఈ అంశంపై కొత్త సర్క్యూలర్ జారీ చేసింది. కోరడా ఝుళిపించింది. ఏదిఏమైనా ఆడపిల్లలు చదువులో అద్భుతంగా రాణిస్తున్నా, ఉపాధి అవకాశాలు పొందుతున్నా, క్రీడల్లో పథకాలతో మెరుస్తున్నా, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నా ఇంకా జ్ఞానోదయం కాని కొంతమంది తల్లిదండ్రులు అవివేకంతో, మూర్ఖత్వంతో, మూఢనమ్మకాలతో వితండవాద వైఖరితో సుపుత్రుడే కావాలని పగటి కలలు కనడం అత్యంత దౌర్భాగ్యం. పైగా ఇది కొంత మంది మానవాళి ఉన్మాదంతో కూడుకున్న వైఖరి కూడా. ఏమైనా ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్-యాక్ట్ 1994 కింద లింగ నిర్ధారణ చేయించేవారికి గరిష్టంగా ఐదు సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష జరిమానా ఉన్నప్పటికీ లెక్కబెట్టని కొందరు ప్రబుద్ధులు దొంగచాటున ఈ అత్యంగ జుగుప్సాకరమైన తంతు కార్యక్రమాన్ని ఇంకను నిర్వహిస్తుండడం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత ఆక్షేపణీయం. ఈ అప్రజాస్వామిక దుందుడుగు వైఖరిని శాశ్వతంగా నిర్మూలించడానికి కర్ణాటక ప్రభుత్వం తీవ్ర కసరత్తు జరుపుతుండటం ఎంతైనా అభినందనీయం. ఇలాంటి అత్యంత క్లిష్టమైన బాధ్యతను భుజస్కంధాలకు ఎత్తుకోవాల్సిన గురుత బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ●

# దశాబ్దాల కల సాకారమైన వేళ

డాక్టర్ తిరునాహరి శేషు

దేశానికి స్వాతంత్య్రం వచ్చిన రోజు రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు తెలంగాణ ప్రజల కల నిజమైన రోజు రాష్ట్ర అవతరణ జరిగిన రోజు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకి పండుగ రోజుగానే చెప్పాలి. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినం దశాబ్దాల పోరాటం ఫలించిన రోజు ఆత్మగౌరవ స్వయం పాలన బావుటా ఎగురవేసి మోముపై చిరునవ్వు ఆవిష్కరించిన రోజు. తెలంగాణ ప్రజల ఉద్యమకారుల ఆకాంక్ష నెరవేరి తెలంగాణ ఉద్యమ నేలపది వసంతాలు పూర్తి చేసుకున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని నాటి ఉద్యమానికి, ఉద్యమకారులకి సమున్నత గౌరవం ఇవ్వాలని నిర్ణయించడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. భాషాప్రయుక్త రాష్ట్రంగా సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కి బీజాలు పడ్డాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం కోసం అమరులైన వారు చేసిన పోరాట తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను దేశం ముందు పెడితే మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ప్రాణత్యాగాలు అంతిమ లక్ష్యాన్ని ముద్దాడి రాష్ట్రాన్ని సాధించిన ఘట్టం అపురూపం రాష్ట్రం ఆవిర్భావం అజరామరం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రజల బలమైన ఆకాంక్ష మాత్రమే కాదు. త్యాగాల పునాది కూడా రాష్ట్ర ఏర్పాటు కోసం 1969లో 369మందిని ప్రభుత్వం బలి తీసుకుంటే మలిదశ ఉద్యమంలో 1200 మంది తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేశారు. తెలంగాణలోని సబ్బండ వర్గాల ప్రజలు మొక్కవోని దీక్ష దక్షతతో ఆరు దశాబ్దాలకుపైగా ఉద్యమించి రాష్ట్రం సాధించుకున్నారు. ఉద్యమాన్ని అణచడానికి రాజకీయ కుట్రలు జరిగినా, ప్రభుత్వ నిర్బంధాలు పెరిగినా ప్రజల ఆకాంక్షల ముందు, పోరాటాల ముందు త్యాగాల ముందు రాష్ట్ర సాధన ప్రక్రియలో ఎదురైన అవరోధాలు ఏవి నిలబడలేదనే చెప్పాలి. 1969 తెలంగాణ ఉద్యమంలో పోలీసు తూటాలకు ఎదురు నిలిచి ప్రాణాలను బలిఇచ్చినా మలిదశ ఉద్యమంలో రాష్ట్రం కోసం ప్రాణాలను లెక్కచేయని తెగింపు తెరువలాంటి ఒక అరుదైన సంఘటనలు ఒక్క తెలంగాణ ఉద్యమంలోనే కనపడతాయి. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను త్యాగాలను గుర్తించి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కి దేశవ్యాప్తంగా మద్దతు దొరకడంతో రాష్ట్రం ఇవ్వవలసిన అనివార్యత ఏర్పడిందనే చెప్పాలి. తెలంగాణ ఉద్యమం 1971లో 5వ లోక్‌సభకి జరిగిన ఎన్నికల నుండి మొదటిసారిగా రాజకీయ రూపం తీసుకుందనే చెప్పాలి. ఆ లోక్‌సభఎన్నికలలో తెలంగాణ ప్రజాసమితి నుండి14మంది పోటీచేస్తే 11 ఎంపిస్థానాలలో తెలంగాణ ప్రజాసమితిని గెలిపించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ఎంత బలమైనదో కాంగ్రెస్ అధిష్టానానికి ముఖ్యంగా ఇందిరాగాంధీకి తెలిసివచ్చేలా ప్రజలు తీర్పు ఇచ్చారనే చెప్పాలి. కానీ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తెలంగాణ ప్రజాసమితి నుండి గెలిచిన ఎంపిలు మర్రి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో




కాంగ్రెస్‌లో చేరిపోవడంతోపాటు 1972లో తెలంగాణ ప్రాంతానికి చెందిన పివి నరసింహారావుని సమైక్య ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేయడంతో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణఉద్యమం తాత్కాలికంగా సద్దుమణిగిందనే చెప్పాలి. కానీ రాజకీయంగా ఇబ్బందులు ఎదురైనా ప్రజాసంఘాలు విప్లవ సంఘాలు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా ఉంచే బాధ్యతను భుజాలకి ఎత్తుకున్నాయి. మళ్లీ 2001లో కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటైన తర్వాత తెలంగాణ ఉద్యమం బలమైన రాజకీయ రూపం తీసుకుందనే చెప్పాలి. 2001 తరువాత ప్రత్యక్షంగానూ అయిష్టంగానూ తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇవ్వవలసిన అనివార్య పరిస్థితి అన్ని పార్టీలకి ఏర్పడింది కాబట్టే 2004లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యూపిఏ ప్రభుత్వం తన కామన్ మినిమం ప్రోగ్రాంలో ఏకాభిప్రాయంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఒక అంశంగా పెట్టింది. టిఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరి ఊదితే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమమా- సంకల్పమమా! ఆరు దశాబ్దాలకుపైగా తెలంగాణ ఉద్యమం అవిశ్రాతంగా కొనసాగిందనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమం ఎంతటి కీలకపాత్రను పోషించిందో కాంగ్రెస్‌పార్టీ సంకల్పం కూడా ఉద్యమానికి తోడై ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష, సఫలీకృతమైందనే చెప్పాలి. ఉద్యమకాంక్షతోపాటు కాంగ్రెస్‌పార్టీ సంకల్పబలం తోడైంది కాబట్టే తెలంగాణప్రత్యేక రాష్ట్ర కల సాకారమైంది. 1999 జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఏర్పాటైనా నాటిబిజెపి పార్టీ సంకల్పించకపోవడం వలనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాలేదనేది నిజం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా విదర్భ, గుర్ఖాల్యాండ్, బుందేల్ఖండ్, పూర్వాంచల్, సౌరాష్ట్ర, బోడోలాండ్, కొంగునాడు, తులనాడు, సింధురాష్ట్రం, హరిత ప్రదేశ్, వింధ్యప్రదేశ్ లాంటి సమాంతర ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు జరిగాయి. కానీ ఏ ఒక్క రాష్ట్రం ఏర్పడకపోయినా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని కాంగ్రెస్ పార్టీ బలంగా సంకల్పించడంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందనే విషయాన్ని మర్చిపోకూడదు. ఒకనాడు ఆంధ్ర లాబీయింగ్‌కి తలొగ్గి రాష్ట్ర ఏర్పాటును ఆలస్యం చేసినా కాంగ్రెస్ పార్టీ మరొకసారి ఆంధ్ర లాబీయింగ్‌కి వెరువక రాష్ట్ర ఏర్పాటుకే ముందడుగు వేసింది. రాష్ట్ర విభజన చేస్తే కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందనే అభిప్రాయం కలిగినా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియని కాంగ్రెస్ పార్టీ పూర్తి చేసింది. కాబట్టే దక్షిణాదిలో అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ బలంగా ఉన్నా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తన ఉనికినే కోల్పోయిందనేది వాస్తవ రాజకీయ ముఖచిత్రంగా కనపడుతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంచేర్చటంలో యూపిఏ ఛైర్‌పర్సన్‌గా జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా సోనియా గాంధీ చొరవ మరువలేనిది. 2009లో అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి పి.చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందనే ప్రకటనకి కట్టుబడిన సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారంగా అటుపార్టీని ఇటుప్రభుత్వాన్ని భాగస్వామ్యపక్షాలను ఒప్పించి తెలంగాణ రాష్ట్రఏర్పాటులో సోనియాగాంధీ తనదైన ముద్ర వేసుకున్నారు. సోనియాగాంధీ చొరవతోనే క్రియాశీలతతోనే రాష్ట్రం ఏర్పాటుకి ఉన్న అన్నిఅడ్డంకులు తొలగాయనేది జగద్విదితం. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ఒక అత్యున్నత రాష్ట్రంగా నిలబెట్టినప్పుడే ప్రజలు ఆకాంక్షలు ఉద్యమ లక్ష్యాలు నెరవేరి తెలంగాణ అమరులకు నిజమైన నివాళి రాష్ట్ర సాధకులకు గౌరవం దక్కుతుంది. ●

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు e-mail: editpage@vaartha.com

# రఫాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు



**రఫా, మే 31:** అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, అగ్రరాజ్యం అమెరికా మొత్తుకుంటున్నా ఇజ్రాయెల్ మాత్రం వెనకడుగు వేయడం లేదు. హమాస్ నిర్మూలనే ధ్యేయంగా మొండిగా ముందుకెళ్తోంది. దాడులను తక్షణమే ఆపాలన్న అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను పెడచెవిన పెట్టి రఫా నగరంపై లాంఛర్లు, బాంబులతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో ఉగ్రవాదుల మాట అటుంచింతే.. సాధారణ పౌరులే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు.

## మరో 11మంది పౌరులు మృతి

హమాస్ ఉగ్రవాదులే లక్ష్యంగా శుక్రవారం రఫాలోని రెండు వేర్వేరు ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 11 మందికి పైగా పౌరులు మృత్యువాత పడ్డారు. ఆ దేశం వైమానిక దాడులకు పాల్పడుతుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని పాలస్తీనియన్లు బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు సెంట్రల్ గాజాలోని ఓ శరణార్థి శిబిరంపై జరిగిన వైమానిక దాడిలో పదులు సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రఫా ప్రాంతంలో ఆపరేషన్ ఇకముందూ కొనసాగుతుందని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. సులభంగా దాడులు చేసేందుకు వీలుగా నగరంలోనే పలు రాకెట్ లాంఛర్లు, సొరంగాలను ధ్వంసం చేసే ప్రత్యేక ఆయుధాలను సిద్ధం చేసుకుంది. గతేడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేసినప్పటి నుంచి ఆ దేశం ప్రతీకారంతో రగిలిపోతోంది.

ఐదు రోజుల క్రితం రఫాపై ఇజ్రాయెల్ చేసిన భీకర వైమానిక దాడిలో ఏకంగా 45 మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. 60 మందికి గాయాలయ్యాయి. ప్రాణాలు కోల్పోయిన వారిలో సగం మంది మహిళలు, చిన్నారులే. ఇప్పటివరకు గాజా పోరులో అత్యంత పాశవికమైన దాడుల్లో ఒకటిగా దీన్ని పేర్కొంటున్నారు. గుడారాలు తగలబడుతున్న దృశ్యాలు, మంటల్లో కాలిపోతున్న మృతదేహాలు, అవయవాలను కోల్పోయిన చిన్నారులకు సంబంధించిన విడియోలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఇంత జరిగినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా దాడులను ఉధృతం చేస్తామని ఆ దేశం చెబుతుండటంతో.. ఇంకా ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

# జూలై 11న ట్రంప్‌కు శిక్ష ఖరారు!

## శృంగార తార కేసులో దోషిగా తేలిన మాజీ అధ్యక్షుడు



**న్యూయార్క్, మే 31:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దోషిగా తేలారు. శృంగార తార స్టార్మీ డేనియల్‌తో అక్రమ సంబంధం కేసులో ఆయనపై నమోదైన అన్ని ఆరోపణలు రుజువైనట్లు న్యూయార్క్ కోర్టు తేల్చింది. దాదాపు 34 అంశాల్లో ఆయనను దోషిగా నిర్ధారించింది. ఇలా ఓ కేసులో దోషిగా తేలిన అమెరికా తొలి మాజీ అధ్యక్షుడు ట్రంపే కావడం గమనార్హం. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన బైడెన్‌తో తలపడనున్న విషయం తెలిసిందే. మరో ఐదు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ తీర్పువెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఆరోపణలేమిటి?:** స్టార్మీ డేనియల్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ట్రంప్ పెద్ద మొత్తంలో డబ్బు ముట్టజెప్పారని అభియోగాల్లో పేర్కొన్నారు. తన న్యాయవాది ద్వారా ఆమెకు సొమ్ము ఇప్పించారని తెలిపారు. 34 అంశాల్లో ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. సుదీర్ఘ విచారణ అనంతరం అవన్నీ నిజమేనని తాజాగా కోర్టు తేల్చింది. ట్రంప్‌తో అక్రమ సంబంధం వాస్తవమేనని స్టార్మీ డేనియల్స్ స్వయంగా కోర్టులో వాంగ్మూలం ఇచ్చిన సంగతి తెలిసిందే.

దోషిగా తేలడంతో ట్రంప్ జైలుకెళ్లాల్సిందేనా అనే ప్రశ్న అందరిలో తలెత్తుతోంది. జూలై 11న ఆయనకు కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. బిజినెస్ రికార్డులు తారుమారు చేయడమనేది న్యూయార్క్‌లో తక్కువ తీవ్రత ఉన్న నేరంగా పరిగణిస్తారు. గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. దీనిపై పూర్తి విచక్షణాధికారం న్యాయమూర్తిదే. ఒకవేళ జైలుశిక్ష కాకపోతే జరిమానా కూడా విధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**ఎన్నికల్లో పోటీ పరిస్థితేమిటి?:** తాజా కోర్టు తీర్పుతో ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఎలాంటి ప్రభావం ఉండదని న్యాయనిపుణులు తెలిపారు. నేరారోపణలు రుజువైతే ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలగాలనే నిబంధనేమీ లేదని వెల్లడించారు. 1920లో ఓ సోషలిస్టు నేత జైలులో ఉండే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారని కొందరు గుర్తు చేశారు. తాజాగా ట్రంప్ సైతం యథావిధిగా ప్రచారం కొనసాగించొచ్చని వెల్లడించారు. ఇప్పటికీ బైడెన్‌ను ఓడించే సత్తా ట్రంప్‌నకు ఉందని అక్కడి ప్రముఖ రాజకీయ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నారు.

# వడగాడ్పులను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

## రాజస్థాన్ హైకోర్టు ప్రభుత్వానికి సూచన



**జైపూర్, మే 31:** వేసవి వడగాడ్పులను జాతీయ విపత్తుగా పరిగణించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచనలు చేసింది. వడగాడ్పులను జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించాలని, గత కొద్దివారాలుగా దేశవ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతల తాపానికి అనేకమంది చనిపోతున్నారని హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. కఠిన కార్యాచరణ అమలుచేయకపోతే మన భావి తరాలు కూడా మనం నష్టపోయే ప్రమాదం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఒక్క రాజస్థాన్‌లోనే వేసవి వడగాడ్పులకు ఐదుగురు చనిపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే చెపుతున్నాయని న్యాయమూర్తులు అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ధండ్ మాట్లాడుతూ మృతులు కుటుంబాలకు తక్షణమే పరిహారం అందచేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించారు. వేసవి వేడి నివారణ తక్షణ కార్యాచణకు ప్రణాళిక రూపొందించాలని రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. హీట్ యాక్షన్ ప్లాన్ అమలుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, రాజస్థాన్ వాతావరణ మార్పుల ప్రాజెక్టుప్రణాళిక కింద తక్షణ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. తీవ్రస్థాయికి చేరిన వేసవి వడగాడ్పులనుంచి ప్రజలను రక్షించే సంక్షేమ కార్యాచరణ అమలుచేయడంలో ప్రభుత్వం కొంత వెనుకబడే ఉందని ప్రణాళికలు ఉన్నా అమలులో జాప్యం ఉందని న్యాయమూర్తి ధండ్ అన్నారు. అలాగే అధికారులు కూడా ఈ వడగాడ్పుల సమయంలో ఎస్ఎంఎస్‌లు, ఎఫ్ఎం రేడియో టెలివిజన్, మొబైల్ యాప్స్, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలద్వారా విస్తృత అవగాహన కల్పించే ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా కల్తీ ఆహారాన్ని సేవించకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, వాతావరణ కాలుష్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని అందుకుగాను ప్రత్యేక చట్టం చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఈతీర్పును ఈ భూగోళాన్ని రక్షించండి, ప్రపంచ భావితరాన్ని పరిరక్షించండి అన్నశీర్షికతో తీర్పును వెలువరించారు.

# విమానానికి బాంబు బెదరింపు

## శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్



**శ్రీనగర్, మే 31:** హగాల్లో ఉన్న విమానానికి బాంబు బెదిరింపు ఘటన కలకలం రేపింది. ఇది కాస్తా శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. ఎయిర్ విస్తారాకు చెందిన ఒక విమానం178మంది ప్రయాణీకులతో ఢిల్లీనుంచి శ్రీనగర్‌కు బయలుదేరింది. అయితే ఆ విమానంలో బాంబు ఉందంటూ శ్రీనగర్ ఎయిర్ పోర్టులోని ఎటిసికి సమాచారం అందింది. దీనితో అధికారులు భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తం అయ్యారు. ఆవిమానం ఎయిర్ పోర్టులో సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణీకులను సిబ్బందిని కిందికి దించి వేసారు. అనంతరం దాన్ని ఖాళీప్రదేశానికి తరలించి బాంబు స్క్వాడ్ బృందాలు జాగిలాల సాయంతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. పేలుడు పదార్థాలేమీ లభించకపోవడంతో అంతా ఊపిరి తీసుకున్నారు. ఈ పరిణామాలతో ఎయిర్ పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు గంటపాటు కార్యకలాపాలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభించామని ఎయిర్ పోర్టు, డిజిసిఎ అధికారులు తెలిపారు.

# జూన్ 2న లొంగిపోతా..నా తల్లిదండ్రులు జాగ్రత్త

## ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉద్వేగం



**న్యూఢిల్లీ, మే 31:** ఎన్నికల ప్రచారం నిమిత్తం మధ్యంతర బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ జూన్ రెండున తిరిగి లొంగిపోనున్నారు. శుక్రవారం మీడియాలో సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జైల్లో తనను ఎన్ని వేధింపులకు గురిచేసినా తలవంచనని తన మద్దతుదారులకు వెల్లడించారు. జూన్ రెండున నేను లొంగిపోవాల్సి ఉంది. ఈసారి ఎంతకాలం జైలులో ఉంటానో తెలియదు. నియంతృత్వం నుంచి ఈ దేశాన్ని కాపాడేందుకు నేను జైలు వెళుతున్నాను. అందుకు గర్వంగా ఉంది. వారు నన్ను అణచివేయడానికి ప్రయత్నించారు. జైల్లో ఉన్నప్పుడు మెడిసిన్ అందకుండా అడ్డుకున్నారు. అరెస్టయినప్పుడు 70 కేజీలు ఉన్నాను. అక్కడున్న సమయంలో ఆరు కేజీలు తగ్గిపోయాను. బయటకు వచ్చిన తర్వాత ముందులాగా బరువు పెరగలేదు. దాంతో కొన్ని పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అంతర్గతంగా ఉన్న ఆరోగ్యపరిస్థితికి ఇది ఒక సంకేతం కావచ్చని వారు అనుమానిస్తున్నారు అని వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటినుంచి బయలుదేరి పోలీసుల ముందు లొంగిపోతానని కేజ్రీవాల్ చెప్పారు. ఈసారి తనను ఇంకా వేధింపులకు గురిచేసేలా ప్రయత్నాలు జరగవచ్చు. నేను జైలుకెళ్లిన తర్వాత ప్రజల గురించే ఎక్కువ ఆలోచిస్తాను. ఈ సమయంలో మీకు ఒక హామీ ఇస్తున్నాను. మీకు అందుతున్న సేవల్లో ఎలాంటి మార్పు ఉండదు. త్వరలో నా తల్లులు, సోదరీమణులకు రూ.1000 అందుతాయి. ఒక కుమారుడిలా నేను మీ కోసం పనిచేశాను. ఈ రోజు మీకొక అభ్యర్థన చేస్తున్నాను. అనారోగ్యంతో ఉన్న నా తల్లిదండ్రుల్ని జాగ్రత్తగా చేసుకోండి అని కోరారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజులపాటు పొడిగించాలని కేజ్రీవాల్ ఇటీవల సుప్రీంను ఆశ్రయించారు. జూన్ 9న జైలుకు వెళ్లి లొంగిపోతానని పేర్కొన్నారు. అయితే దానిపై ట్రయల్ కోర్టుకు వెళ్లాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ప్రస్తుతం ఢిల్లీ కోర్టులో, రెగ్యులర్, మధ్యంతర బెయిల్ కోసం ఆయన వేసిన పిటిషన్లు విచారణ దశలో ఉన్నాయి.

# కర్ణాటక సిఎం, డిప్యూటీ సీఎంకు చేతబడి..!



**బెంగళూరు, మే 31:** కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. రాజకీయ ప్రత్యర్థులు తనకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా కేరళలోని ఓ దేవాలయంలో అఘోరాలు, తాంత్రికుల ద్వారా చేతబడి చేయిస్తున్నారని చెప్పడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఇదంతా తమ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు చేస్తున్నారన్నారు. కేరళలోని రాజరాజేశ్వరి ఆలయానికి సమీపంలో ఏకాంత ప్రదేశంలో అఘోరాలతో ప్రత్యేకయాగం నిర్వహిస్తున్నట్లు తనకు పక్కా సమాచారం అందిందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రత్యర్థులు తమపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండి పడ్డారు. శత్రువులను నిర్మూలించే 'రాజకంటక', 'మరణ మోహన స్తంభన' యాగాలు చేయిస్తున్నారని, పూజలో పాల్గొన్నవారే దీని గురించి తమకు తెలిపారని సంచలన విషయాలు వెల్లడించారు. అఘోరాల ద్వారా 21 ఎర్రమేకలు, మూడు గేదెలు, 21 నల్లగొర్రెలు, 5 పందులు చేత బడిలో బలిఇస్తున్నారని తెలిపారు. బీజేపీ, జేడీ-ఎస్ నాయకులు చేతబడి చేయిస్తున్నారా అని పలువురు ప్రశ్నించినపుడు .. కర్ణాటకకు చెందిన రాజకీయ నాయకులే అంటూ శివకుమార్ బదులిచ్చారు. 'దీన్ని ఎవరు చేయిస్తున్నారో నాకు తెలుసు, వారు తమ ప్రయత్నాలను కొనసాగించనివ్వండి, నేను ఇబ్బంది పడను, అది వారి విశ్వాసానికే వదిలేస్తున్నా. నేను నమ్మిన శక్తి నన్ను రక్షిస్తుంది' అని శివకుమార్ చెప్పారు. ఎవరు నిర్వహిస్తున్నారో చెప్పమంటూ మీడియా ప్రతినిధులు ఒత్తిడి చేయగా అందుకు ఆయన నిరాకరించారు. దీనిపై మీడియా దర్యాప్తు చేయాలంటూ బదులిచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం శివకుమార్ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలపై స్పందించారు.

జూన్ 2న బెంగళూరులో శాసనసభ్యుల సమావేశం ఉంటుందని ప్రకటించారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలందరినీ ఆహ్వానించామన్నారు. ఈ సమావేశంలో పార్టీ వ్యవహారాలు, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి '300 మంది అభ్యర్థుల్లో 65 మందిని షార్ట్‌లిస్ట్ చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు కుమారుడు డాక్టర్ యతీంద్ర తన తండ్రికోసం ఎమ్మెల్యే సీటు వదులుకున్నప్పటి నుంచి ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే నిబద్ధతతో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పరాజయం పాలైన వారితోపాటు ప్రముఖ నేతలు టికెట్లు కోరుతున్నారని, ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన అభ్యర్థులను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు.

# 90 సెకన్లలో 29 పదాలు

## అమెరికా 'స్పెల్లింగ్ బీ' విజేతగా తెలుగు సంతతి బాలుడు!



**వాషింగ్టన్, మే 31:** అగ్రరాజ్యం అమెరికాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్పెల్లింగ్ బీ పోటీల్లో ఈ ఏడాది కూడా భారత అమెరికన్ విద్యార్థుల హవా కొనసాగింది. 2024 స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీల్లో తెలుగు సంతతికి చెందిన 12 ఏళ్ల బృహత్ సోమ విజేతగా నిలిచాడు. 90 సెకన్లలో .. సహా 29 పదాల స్పెల్లింగ్‌లను తప్పు లేకుండా చెప్పి.. కప్‌తో పాటు 50 వేల డాలర్ల నగదు బహుమతి గెలుచుకున్నాడు. ఫ్లోరిడాకు చెందిన బృహత్ ప్రస్తుతం ఏడో గ్రేడ్ చదువుతున్నాడు. అతడి తండ్రి శ్రీనివాస్ సోమ స్వస్థలం తెలంగాణలోని నల్గొండ. ఈ ఏడాది స్పెల్లింగ్ పోటల్లో 245 మంది విద్యార్థులు పాల్గొనగా.. వీరిలో 8 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. ఇందులో బృహత్, ఫైన్ జాకీ మధ్య టై అయ్యింది. టై బ్రేకర్‌గా ఇద్దరికీ 90 సెకన్ల సమయం ఇచ్చారు. ఇందులో జాకీ పదాలను సరిగ్గా చెప్పగా.. బృహత్ 29 పదాల స్పెల్లింగ్‌లను తప్పుల్లేకుండా చెప్పి టైటిల్ గెల్చుకున్నాడు.

# 'పోల్' పదనిసలు



చివరి విడత లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ సామాగ్రితో బయలుదేరిన సిబ్బంది

# ఏడో విడత పోలింగ్ నేడే

## 57 నియోజకవర్గాల్లో 904 మంది పోటీ

### బరిలో కాశీ నుంచి మోడీ, హిమాచల్ నుంచి కంగనారనౌత్



**న్యూఢిల్లీ, మే 31:** సార్వత్రిక ఎన్నికల్లో చిట్ట చివరి అంకానికి తెరలేచింది. ఏడో విడత పోలింగ్‌కు ఎన్నికల సంఘం అధికారులు సర్వం సిద్ధంచేసారు. శనివారం దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లోని 57 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ చివరి అంకం అటు జాతీయ పార్టీలకు, ఇటు ప్రాంతీయ పార్టీలకు కూడా కీలకంగా నిలిచింది. మొత్తం 904 మంది అభ్యర్థులు ఈ దశలో పోటీచేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు అన్ని దశలతోపాటే జూన్ నాల్గవ తేదీ విడుదలవుతాయి. ఏప్రిల్ 19వ తేదీ ప్రారంభం అయిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జూన్ 1వ తేదీతో ముగుస్తోంది. బీహార్‌లో ఎనిమిది స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నలందా, పాట్నాసాహిబ్, పాటలీపుత్ర, ఆర్రా, బుక్సర్; ససారాం, కారాకత్, జహనాబాద్‌లలో పోలింగ్ జరుగుతుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో నాలుగుస్థానాలు అంటే కాంగ్రా, మండి, హమీర్‌ఫూర్, సిమ్లాలకు ఎన్నికలు జరుగతాయి. ఒడిశాలో ఆరు స్థానాలకు ఏడోదశలో పోలింగ్ జరుగుతోంది. మయూర్‌బంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపారా, జగత్‌సింగ్‌పూర్‌లలోపోలింగ్ జరుగుతుంది. పంజాబ్‌లో 13స్థానాలు ఏడోదశ పోలింగ్‌కు వస్తున్నాయి. గురుదాస్‌పూర్, అమృత్‌సర్; ఖాదూర్‌సాహిబ్, జలంధర్ ఎస్సీ, హోషియార్‌పూర్‌ఎస్సీ, ఫిరోజ్‌పూర్, భటిండా, సంగ్రూర్, పాటియాలా స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఏడో విడతలో మహరాజ్‌గంజ్, గోరఖ్‌పూర్, కిషన్‌నగర్, డియోరాయి, బాంగ్స్‌న్, ఘోసి, సలేమ్‌పూర్, బల్లియా, ఘాజిపూర్, చందౌలి, వారణాసి, మీర్జాపూర్; రాబర్ట్స్ గంజ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో తొమ్మిది స్థానాలు అంటే దమదమ్, బరసాత్, బసీర్హాట్, జయ్‌నగర్, మథురాపూర్, డైమండ్ హార్బర్; జాదవ్‌పూర్, కోల్‌కత్తా దక్షిన్, కోల్‌కత్తా ఉత్తర్ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుంది. జార్ఖండ్‌లోకూడా మూడుస్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. రాజ్‌మహల్, దుంకా, గొడ్డా స్థానాలుంటే కేంద్రపాలితప్రాంతం చండీఘర్‌లో కూడా ఏడోదశలోనే ఎన్నికలు జరుగుతాయి. ఈదశలో వారణాసినుంచి ప్రధాని మోడీ పోటీలో ఉంటే హిమాచల్‌ప్రదేశ్‌నుంచి బాలివుడ్‌నటి కంగనారనౌత్ మండి స్థానం నుంచి పోటీలో ఉన్నారు.

# ప్రధానిగా రాహుల్ గాంధీయే బెస్ట్!

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే




**న్యూఢిల్లీ, మే 31:** సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రధాని స్థానంలో రాహుల్‌గాంధీయే బెస్ట్ అని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ప్రకటించారు. కూటమి బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయేను ఓడించి అధికారంచేపట్టడం ఖాయమని, తమ కూటమి ప్రభుత్వంలో రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్న నాయకుడని ఆయన అన్నారు. అలాగే ప్రియాంక గాంధీ వాద్రా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం అన్న అంశంపై స్పందిస్తూ ఆమె పోటీచేయాల్సి ఉండాల్సిందని, అయితే కుటుంబ పార్టీ అన్న అపవాదును రానీయకుండా ఉండేందుకే ఆమె ఎన్నికల్లో పోటీకి వెనుకాడారన్నారు. ప్రియాంక తన సోదరుడికి మద్దతుగా రాయ్‌బరేలి, అమేథిల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికలకు ముందు భారత్‌జోడో యాత్రలు నిర్వహించి ప్రజల మనస్సుల్లో రాహుల్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. అంతేకాకుండా మిత్రపక్షాలతో కలిసి కొన్ని సందర్భాల్లో వేదికలు కూడా పంచుకున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీపై నేరుగా విమర్శలు చేసే సత్తా ఉన్న నాయకుడని అన్నారు. తనవరకూ నాఛాయిస్ ఎవరని అడిగితే ప్రధాని పదవికి రాహుల్ గాంధీయేనని ఖర్గే చెప్పారు. యువతకుప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ దేశం మొత్తం పర్యటించి అవగాహన పెంచుకున్న నాయకుడని అన్నారు. అయితే గతంలో ఎఐసిసి అధ్యక్షుడిగానే ఖర్గే మాట్లాడుతూ కూటమి ఎన్నికల్లో సంఘటితంగా పోటీచేస్తుందని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రధాని అభ్యర్థి ఎవరన్నది కూటమి నిర్ణయిస్తుందన్నారు. ఢిల్లీసీఎం అరవింద్‌కేజ్రీవాల్‌కూడా కూటమి నేతలు ఎన్నికలు ఫలితాలు వెల్లడి అయిన తర్వాత నాయకుడు ఎవరన్నది నిర్ణయిస్తారని చెప్పారు. ఖర్గేపరంగాచూస్తే ఇటీవలే పిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై వ్యాఖ్యానించేందుకు తిరస్కరించారు. ఇండియా కూటమి విజయం సాధించిన తర్వాతనే ప్రధాని అభ్యర్థి ఎవరన్నది తెరపైకి వస్తుందని అంతవరకూ ఉమ్మడిగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. పిఎం అభ్యర్థి రేసులో తాను కూడా ఉన్నట్లువస్తున్న వార్తలను ఖర్గే ఖండించారు. ప్రధాని అభ్యర్థిగా నేనెలా ప్రతిపాదించుకుంటానని, కూటమి పార్టీలు నిర్ణయించాల్సి ఉంటుందని, అయినా తాను రేసులో లేనని స్పష్టంచేసారు. తనవరకూ తాను ప్రియాంక పోటీచేయాలనే భావించానని, అయితే రాహుల్ జీ తన ప్రచారానికి ఒకరు ఉండాల్సి ఉంటుందని, తాను దేశవ్యాప్త ప్రచారానికి వెళితే తాను పోటీచేసే నియోజకవర్గాల్లో ప్రియాంక ఉంటారన్న ఉద్దేశ్యంతోనే ఆమె ఎన్నికల్లో పోటీచేయలేదని అన్నారు. పోలింగ్ అనంతర పరిణామాలను చర్చించుకునేందుకే ఈనెల ఒకటవ తేదీ కూటమి నేతలు అందరూ సమావేశం అవుతున్నామన్నారు.

# బిగ్‌స్క్రీన్‌పై ఎన్నికల ఫలితాలు

## మహారాష్ట్రలో థియేటర్లు హౌస్‌ఫుల్

### ప్రత్యేక రేట్లతో టికెట్లు జారీ



**న్యూఢిల్లీ,మే 31:** సార్వత్రిక ఎన్నికల సందడి ముగింపుదశకు చేరుకుంది. శనివారం అంటే జూన్ ఒకటవ తేదీ చివరి విడతపోలింగ్ జరుగుతుంది. దేశప్రజల కళ్లన్నీ ఎన్నికల ఫలితాలపైనే రేపు ఓ టింగ్‌ముగిసిన వెంటనే మీడియా సోషల్‌మీడియాలో ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు కూడా మారుమోగుతాయి. జూన్ 4నాటి ఓట్లలెక్కింపుపై ఉత్కంఠ మరింతపెరిగే అవకాశం ఈ ఎగ్జిట్‌పోల్స్ కల్పిస్తున్నాయి. ఆరోజు దేశం మొత్తం టివిలు ఫోన్లకు అతుక్కుపోతుంది. ఇపుడు మరో కొత్త ఒరవడి తెరపైకి వచ్చింది. ఎన్నికల ఫలితాలు థియేటర్ స్క్రీన్స్‌పై కనిపించనున్నాయి. మహారాష్ట్రలోని కొన్ని థియేటర్లు ఈఫలితాలను ప్రత్యక్షప్రసారం చేసేందుకు సిద్ధం అయ్యాయి. ముంబయిలోని ఎస్ఎం5 కల్యాణ్, సియాన్, కంజూర్‌మార్గ్‌లోని మూవీ మ్యాక్స్ థియేటర్లు థాణెలోని ఎటర్నిటీ మాల్, వండర్‌మాల్, నాగ్‌పూర్ లోని మూవీమ్యాక్స్ ఎటర్నిటీ, పూణెలోని మూవీ మ్యాక్స్ తదితర థియేటర్లు జూన్ 4న ఎన్నికల ఫలితాలను పెద్దస్క్రీన్‌పై ప్రసారంచేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పేటిఎం వంటి వేదికల్లో బుకింగ్స్‌ను ప్రారంభించారు. ఆరుగంటలపాటు ఫలితాలను థియేటర్లలో ప్రత్యక్షప్రసారం చేస్తారు. ఇందుకోసం టికెట్‌ధరలు రూ. 99 నుంచి రూ.300వరకూ ఉన్నాయి. ఇప్పటికే అన్ని థియేటర్లలో ఫలితాలప్రదర్శనకు హౌస్‌ఫుల్ అయినట్లు తెలుస్తోంది. టికెట్ బుకింగ్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్లను కొందరు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో ప్రస్తుతం ఇవి వైరల్ అయ్యాయి.

# పోస్టల్ బ్యాలట్‌పై వైఎస్సార్సీ నేతల ఆందోళన

## ప్రజలకు వాస్తవాలు తెలియాలి :టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు



**అమరావతి, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** పోస్టల్ బ్యాలట్ అంటే వైఎస్సార్సీ నేతలు ఎందుకు అంతగా భయపడుతున్నారో అర్థం కావటం లేదని టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాజాగా హైకోర్టులో వైఎస్సార్సీ పార్టీ తరపున సిఇఒ ఇచ్చిన ఒక వివరణ మీద వైఎస్సార్సీ నేతలు రిట్ ఫైల్ చేశారన్నారు. వైఎస్సార్సీ నేతలు ఆ కేసులు విత్‌డ్రా చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అది చెప్పకుండా సిఇఒ , మేం ఒక మెమోని విత్ డ్రా చేసుకుంటున్నామని చెప్పారన్నారు. వైఎస్సార్సీ దాన్ని హైలెట్ చేస్తోందన్నారు. అదేదో పెద్ద విజయం సాధించినట్టు చెప్పుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర సిఇఒ టిడిపికి ఫేవర్‌గా చేసినట్టు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇలా వివిధ రకాలుగా వారి నీలి మీడియాలో రాసుకున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ పోస్టల్ బ్యాలట్‌లో ఓటేసినపుడు 13ఏ డిక్లరేషన్ ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చిందన్నారు. అందులో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం పెట్టాలని,ఆయనే సంతకం పెట్టి సీల్ వేసి ఇవ్వాలన్నారు. ఇది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఎక్కడైనా పొరపాటున స్టాంప్, సీల్ లేకపోయినా, ..అలాంటి బ్యాలట్స్‌ను తిరస్కరించొద్దని వ్యాలిడ్‌లోకి తీసుకుని కౌంట్ చేయాలని 2023లోనే కేంద్ర ఎన్నికల కమిషన్ సర్క్యులర్ జారీ చేసిందని తెలిపారు. నేడు దాన్ని ఉటంకిస్తూ, 27.5.24 తేదీన ఎపి సిఇఒ పోస్టల్ బ్యాలట్‌ను మేం రిజెక్ట్ చేయము.. అని స్పష్టంగా సర్క్యులర్ ఇచ్చిందన్నారు. టిడిపి మొదటి నుంచి పోస్టల్ బ్యాలట్‌పై అనుమానులున్నా... మార్పులు, చేర్పులు చేయాలన్నా.. సిఇఒను కలుస్తున్నారన్నారు. కొన్నిచోట్ల ఆర్వో సంతకం లేదని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ సర్క్యులర్ ప్రకారం వీటన్నింటికని వ్యాలిడ్ చేయమని ఉందన్నారు. రూల్ ఉన్నప్పటికీ , కూడా ప్రస్తుత అధికారులు మళ్లీ స్పష్టంగా సర్క్యులర్ ఇస్తే తప్ప పరిసినతి చక్కబడదు అని అన్నారు. లేకుంటే పోస్టల్ బ్యాలట్ పనిచేయకుండా పోయే పరిస్థితి నెలకొని ఉందని అడిగామని అన్నారు.. పోస్టల్ బ్యాలెట్ విషయంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ ఇచ్చినదాన్ని యదాతథంగా వివరిస్తూ ఆయన 25.7.24న సర్క్యులర్ ఇచ్చారని గుర్తుచేశారు. గత ఏడాది 2 లక్షల 68వేల పోస్టల్ బ్యాలట్స్‌లో అనేక కారణాలతో దాదాపు 56 వేల పోస్టల్ బ్యాలట్స్ ఇన్‌వాల్యూడ్ అయ్యాయని తెలిపారు.. ఇన్ వాల్యూడ్ అనేది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి చిన్న చిన్న వాటిని సర్దుబాటు చేయమని మేంఅడిగామని తెలిపారు. దాన్ని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఇంత జరిగాక కూడా..ఎందుకు వైఎస్సార్సీ పార్టీ గోల చేస్తుందో అర్థం కావటం లేదన్నారు. వైఎస్సార్సీ దుష్ప్రచారం వారి దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. ఏది ఏమైనా స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది ఉంటే కచ్చితంగా దీనిపై మళ్లీ మేం కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి ఎన్నికల కమిషన్ ఏదైతే వివరణ ఇచ్చిందో ఆ వివరణను అమలు చేయాలని కోరతామని అశోక్ బాబు తెలిపారు. వైఎస్సార్సీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఉద్యోగ సంగాలు కూడా ఆలోచించాలని కోరారు.. ఇది కేవలం ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాలకు సంబంధించిన అంశమని, పౌరులందరికీ అప్లై కాదని అన్నారు.




శుక్రవారం గుంటూరులో పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపుపై ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్ రెడ్డి

# ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపు

## - అవగాహన సమావేశంలో గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

**అమరావతి, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టర్ బ్యాలట్ ఓట్లు ఈసిఐ మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా లెక్కింపు చేయాలని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపుపై విధులు కేటాయించిన అదనపు సహాయక రిటర్నింగ్ అధికారులు, వారికి సహాయకంగా నియమించిన ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలట్ ఓట్ల వ్యాలిడేషన్‌కు సంబంధించి ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూరినత అవగాహన కలిగి ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపు సక్రమంగా సత్వరమే లెక్కింపు కోసం సహాయకంగా నియమించిన ఉద్యోగులు బాధ్యతగా పనిచేయా లన్నారు. పోస్టల్ బ్యాలట్ ఓట్ల లెక్కింపుపై శనివారం రెవెన్యూ కళ్యాణ మండపంలో మరోసారి హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ కూడా ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు, ఐటి నోడల్ అధికారి రఘు, అదనపు సహాయక రిటర్నింగ్ అధికారులు, సహాయక విధులు కేటాయించిన ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# టిడిపి గెలవాలని కనకదుర్గమ్మ సన్నిధికి పాదయాత్ర చేసిన గల్లీ బాయ్స్



**జగ్గయ్యపేట, మే 31, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి విజయదుందుభి మ్రోగించాలని ధ్యానిస్తూ ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన గల్లీ బాయ్స్ (టిడిపి యువకులు) పట్టణంలోని వినాయకుడి గుడి వద్ద పూజలుచేసి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి శుక్రవారం పాదయాత్ర చేశారు. మొక్కు తీర్చుకున్న అనంతరం అమ్మవారి ప్రసాదాలను రాజగోపాల్‌కు అందించారు. పాదయాత్రలో గల్లీ బాయ్స్ పవన్, బాజీ, నజీర్, శ్రీహరి, గోపాల్, రవీంద్ర, సుధీర్, వినయ్, జాన్‌బాబు, నాగులు, నన్నేసా పాల్గొన్నారు.

**స్పోర్ట్స్ మీట్‌లో విజయం సాధించిన క్రీడాకారునకు అభినందన:** పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మే 22 నుండి 24 జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో జగ్గయ్యపేట రామ్–కో సిమెంట్స్‌నకు చెందిన రామిశెట్టి నరసింహారావు 55 ఏండ్ల వయసు విభాగంలో 5 కి.మీ. వాక్‌లో, ట్రిపుల్ జంప్‌లలో తృతీయస్థానాన్ని సాధించారు. శుక్రవారం రాజగోపాల్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్న సందర్భంలో రాజగోపాల్ నరసింహారావును అభినందించారు.

# కౌంటింగ్ రోజున అప్రమత్తం

## - చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు అవగాహనలో టిడిపి నేతలు



శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న టిడిపి నేతలు యనమల, పల్లె రఘునాథరెడ్డి తదితరులు

అమరావతి, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి: ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టిడిపి చీఫ్‌ఎలక్షన్ ఏజెంట్ల సమావేశంలో సమీక్ష నిర్వహించింది. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, పట్టాభి, పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ, కౌంటింగ్ రోజైన జూన్ 4వ తేదీన గొడవలు జరిగే అవకాశం ఉందని ఇప్పటికే వైఎస్సార్సీ నేతల వ్యాఖ్యల ద్వారా తెలుస్తోందన్నారు. వారు ఓటమి భయంతో ఘర్షణలకు దిగబోతున్నారని తెలుస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ హాలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సి అంశాలపై పార్టీ సీనియర్ నేతలు ఏజెంట్లకు సలహాలు, సూచనలు అందజేశారు.

కౌంటింగ్ రోజున ఏ విధంగా వ్యవహరించాలి, ఆ ప్రక్రియ ఎలా ఉండబోతుంది.. తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ నిచ్చారు.

# చింతవానిపాలెంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## లోయలోకి దూసుకెళ్లిన బైక్

### తండ్రి కొడుకులు మృతి.. గాయాల పాలైన తల్లి కూతుళ్లు

**కొయ్యూరు, మే 31, ప్రభాతవార్త** బంధువుల ఇంటికి చుట్టపు చూపుకని వెళ్లి వారితో రెండు రోజుల పాటు ఆనందంగా గడిపి స్వగ్రామం వెళ్లేందుకు తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులు మృతి చెందగా తల్లి కూతుళ్ల తీవ్రగాయాలపాలయ్యారు. జిల్లాలోని అడ్డతీగల మండలం వీరవరం పంచాయితీ సీతవరం గ్రామానికి చెందిన వెలమ రాంబాబు, వెలమ కాసులమ్మ తమ పిల్లలతో బాల్ రేవుల గ్రామినిక దంపతులు బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో చింతవానిపాలెం దాటాక ఘాట్‌రోడ్డులో బైకు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెలమ రాంబాబు, వెలమ ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందగా వెలమ కాసులమ్మ, కుమార్తె మీనాక్షి తీవ్రగాయాల పాలయ్యారు. వారిని రాజేంద్ర పాలెం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్తు వినియోగం

## - రోజు వారి 260 మిలియన్లు విద్యుత్తు వాడకం

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎండల తీవ్రత నేపథ్యంలో గత మూడు రోజులుగా విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగిందని ఇంధనశాఖాధికారులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.గతంలో రాష్ట్రంలో ఇంత భారీ స్థాయిలో విద్యుత్తు వినియోగం జరుగలేదని వారు వివరించారు.ఎండలు అధికంగా ఉండటంతో ప్రజలు కరెంటును ఎక్కువగా వినియోగిస్తున్నారని వారు తెలిపారు.ఫ్యాన్లు,కూలర్లు,ఏసీలు అధిక వినియోగంలో ఉన్నాయంటున్నారు. ఏపీ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో బుధవారం 253 మిలియన్ యూనిట్లు,గురువారం 259 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం జరిగిందని ఇంధనశాఖాధికారులు వివరిం చారు. శుక్రవారం అంటే ఈ రోజు విద్యుత్తు వినియోగం 260 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం ఇప్పటికే జరిగినట్లు గుర్తించామన్నారు.గత ఏడాది ఇదే రోజుల్లో గరిష్టంగా 219 మిలియన్ యూనిట్లు విద్యుత్తు మాత్రమే జరిగిందన్నారు.గత ఎనిమిదేళ్ళలో మే నెలలో రికార్డు స్థాయిలో విద్యుత్తు వినియోగం జరుగడం ఇదేనని ఇంధనశాఖ అధికారులు వివరించారు.గత ఏడాది కంటే 26శాతం విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉందన్నారు.ఈ డిమాండ్ మరింత పెరిగిన విద్యుత్తు వినియోగదారులకు ఇబ్బంది ఉండదన్నారు.

# వైఎస్సార్సీ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు, చర్యలు తీసుకోండి

## - ఎన్నికల ప్రధానాధికారికి టిడిపి నేతల ఫిర్యాదు

**అమరావతి, మే 31, ప్రభాతవార్త ప్రతినిధి:** పల్నాడు జిల్లా ఎన్నికల విధుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ కొందరు అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ విజయభాస్కరరరెడ్డి, వినాయక్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డిపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు టిడిపి నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పల్నాడుజిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వినాయక్‌రెడ్డి, 'పుడా' డిప్యూటీ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల విధుల నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. వైఎస్సార్సీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ ముగ్గురు అధికారులు కౌంటింగ్ సిబ్బందిని నియమించటం, ఇతర అనుమతులు, తదితర విషయాల్లో వైఎస్సార్సీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. డిపిఓగా పనిచేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్, వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ అధికారిగా నియమించారని, వీరు సుదీర్ఘకాలంగా పల్నాడు ప్రాంతంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిఫార్సుల మేరకు ఆయనకు ఎన్నికల విధుల్లో అత్యంత కీలమైన పోస్టుల్లో నియమించారన్నారు. ఈ సమాచారాన్ని ఏప్రిల్ 15న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేయటం జరిగిందని గుర్తుచేశారు. సదరు ఫిర్యాదుపై విచారణ కోసం పల్నాడు జిల్లా కలెక్టర్‌కు పంపించారని గుర్తుచేశారు. విచారణ అధికారిగా డిఆర్వో వినాయక్‌రెడ్డిని నియమించారి, కేసును నీరుగార్చటానికి వినాయక్‌రెడ్డికి విచారణ బాధ్యతలు అప్పగించారన్నారు. ఆయన తప్పుడు నివేదిక ఇవ్వడంతో విజయభాస్కర్‌రెడ్డిని అక్కడే కొనసాగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల విదులన సచివాలయ సిబ్బంది, విఆర్వోలు, విఏలోలు తదితర విభాగాల్లోని సిబ్బందిని ఈ ముగ్గురు అధికారులు నియమించారని తెలిపారు. ఉద్దేశ్యపూర్వకంగా సదరు సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించారని అన్నారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ సమయంలో వీరు వైఎస్సార్సీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించేఅవకాశం ఉందని తెలిపారు. మాచర్లలో ఈవిఎంను పగులగొట్టిన సంఘటన వారం రోజుల పాటు వెలుగులోకి రాకుండా దాచిపెట్టంలో , పోలింగ్ బూత్‌ల్ల దౌర్జన్యంగా ప్రవేశించి పోలింగ్ ఏజెంట్లను వైఎస్సార్సీ నేతలు భయభ్రాంతులకు గురిచేయటంలో, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కల్గించటంలో పూర్తిబాధ్యత విజయభాస్కర్‌రెడ్డి, వినాయన్‌రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డిలదే అని స్పష్టమవుతోందన్నారు. కౌంటింగ్ రోజున పెద్దఎత్తున హింసాత్మక ఘటనలకు వైఎస్సార్సీ పాల్పడే అవకాశం ఉందని, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసునతన్న ఈ ముగ్గురు అధికారులపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నామని టిడిపి నేతలు పేర్కొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలపాల కట్టడే లక్ష్యం :డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలపాల కట్టడే లక్ష్యంగా రాష్ట్రంలో పోలీసు కార్యకలపాలు నిర్వహిస్తున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్ తెలిపారు.అందులో భాగంగా గత అయిదు రోజులుగా కార్డన్ అండ్ సేర్చ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ నెల 27వ తేది నుంచి నేటి వరకు నిర్వహించిన 579 ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 3524 సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.16 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.307 లీటర్లు మద్యం,67 లీటర్లు ఎన్‌డిపిఎల్ లిక్కర్,1400 లీటర్లు ఎఫ్‌జె (పులియబెట్టిన బెల్లం) స్వాధీనం చేసుకున్నారు. కార్డన్ అండ్ సేర్చ్‌ను గ్రామాల శివారుల్లో చేసామన్నారు.అనుమానిత వ్యక్తులు,నాత నేరస్తుల ఇళ్ళు,పలు షాపులు, గడ్డివాములు,ఇతర ప్రాంతాల్లో అక్రమ మద్యం,ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు,రికార్డులేని వస్తువులు,వాహనాలు మొదలైన వాటని గుర్తించేందుకు క్షుణంగా తనిఖీలు



నిర్వహించామన్నారు.రాష్ట్రంలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు,రౌడీ షీటర్లు,అనుమానితులపై నిఘా పెట్టామని,అనుమానితులను బైండోవరు చేసినట్లు తెలిపారు.ప్రతి స్టేషను పరిధిలోను గత సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నేరాలకు పాల్పడిన వారిని విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.ఈ విషయంలో తమ పోలీసు గట్టిగా స్పందించి చర్యలు తీసుకుందన్నారు,అంతేకాకుండా ఎక్కడైనా ప్రజలను రెచ్చగొట్టెరీతిలో వ్యవహరిస్తున్నారనే అభియోగాలు వస్తే,వారిపై కేసులు నమోదు చేసారన్నారు. తమ మాటలు,రాతలు,ప్రసంగాల ద్వారా సామాజికంగా సున్నిత పరిస్థితులకు కారణమవుతారనుకుంటే వారిని గృహనిర్భందం చేయాలని ఆదేశించామన్నారు.కౌంటింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు.దీంతో పాటుగా ఇతర ప్రాంతాల్లోను ఎక్కడా గుంపులు,గుంపులు జనం కూడి వున్న అక్కడి నుంచి వారిని పంపించి వేయాలని ఆదేశించారు.నగరాలు,పట్టణాల్లో రద్దీగా ఉండే ప్రాంతాలు,శివారు ప్రాంతాల్లో కొత్త వ్యక్తులను చూసినా,,అనుమానస్పద ప్రవర్తన కలిగిన వారు కన్పిస్తే వారిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలున్నాయన్నారు. 31, సరిహద్దుల్లో 150 తనిఖీ కేంద్రాల్లో పోలీసు,సెబ్,వాణిజ్యపన్నుల శాఖ, రవాణా,రెవెన్యూ విభాగాల సిబ్బందితో పటిష్ట నిఘా పెట్టినట్లు డీజీపీ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో మండుతున్న ఎండలు, వడ దెబ్బకు ముగ్గురు మృతి



ఎండలో పాదచారుల ఇబ్బందులు

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎండలు మండుతున్నాయి.రోహిణీ కార్తె ప్రభావం తీవ్రస్థాయిలో కన్పిస్తోంది.ఏపీలో గత మూడు రోజులుగా ఎండలు అదురుతున్నాయి.వడదెబ్బకు ముగ్గురు వృద్దులు మరణించారు.వారిలో ఇద్దరు వృద్దులు.ఒకరు యువకుడు ఇటీవల కాలంలో బంగాళా ఖాతంలో వాయుగుండం ,రేమాల్ తుపాన్ ప్రభావంతో వానలు పడి,వాతావరణం చల్లబడింది. ఆ పరిస్థితుల్లోను ఉక్కపోత జనాన్ని ఇబ్బంది పెట్టింది.ఈ లోగా ఎండలు తీవ్రమయ్యాయి,లభించిన సమాచారాన్ని అనుసరించి గత మూడు రోజులుగా ఏపీలో దాదాపు అన్ని ప్రాంతాల్లో సగటున 45,3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత ఉంటే శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలనుంచి 47.2 డిగ్రీల వరకు నమోదయ్యాయి. విజయవాడలో గరిష్టంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది.ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరు.శ్రీకాకుళం జిల్లాలో ఒకరు వడదెబ్బతో మరణించినట్లు సమాచారం.ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలను ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు ఇంటిపట్టునే ఉండాలని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో 145 మండలాల్లో తీవ్రవడగాల్పులు వీచాయని ప్రకృతి విపత్తుల నిర్వహణాధికారులు వెల్లడించారు. వాతావరణశాఖ అధికారుల హెచ్చరికల మాట ఎలా ఉన్న ప్రజలు గడపదాటడానికి భయపడుతున్నారు. జనం బయటకు రాకపోవడంతో ఉదయం 8 దాటితే కీలక నగరాలన్నింటిలో రోడ్లు అన్ని నిర్మానుష్యంగా ఉంటున్నాయి.వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు,ఏసీలు ఎక్కువగా వాడటంతో విద్యుత్తు వినియోగం పెరుగుతుంది.శీతల పానీయాలు,చెరుకు రసం,మజ్జిగలకు మంచి డిమాండ్ పెరిగింది. ప్రజలు తప్పని సరి పరిస్థితుల్లో గొడుగులు పట్టుకుని టోపీలు ధరించి,వస్త్రాలు కప్పుకుని బయటకు వెళ్తున్నారు.ఎండలు చిరు వ్యాపారులు. కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.ఎండల్లో బయటకు వచ్చిన వారు దాహార్తితో అల్లాడుతున్నారు.సోడాలకు,ఇతర డ్రింకులకు ఎగబడుతున్నారు.ఎక్కడ నీరు దొరికితే అక్కడ సేద తీరుతున్న పరిస్థితులున్నాయి. ఎండలకు పక్షులు,ఇతర జంతువులు అల్లాడుతున్నాయి.

# కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఎసిబి దాడులు

## రూ. మూడు లక్షలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఇన్‌స్పెకర్ వీరాస్వామి, ఎస్ఐ షఫీ



ఎసిబి అధికారులు అరెస్టు చేసిన ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి, సబ్ఇన్‌స్పెక్టర్ షఫీ, మధ్యవర్తి ఉపేందర్.

**హైదరాబాద్ (కుషాయిగూడ), మే 31, ప్రభాతవార్త:** రెండేళ్లుగా కుషాయిగూడ పరిధిలోని బాధితుల నుంచి అక్రమార్జనకు అలవాటుపడిన ఎస్ఐ షఫీ రూ. 3 లక్షల లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే సింగిరెడ్డి భరత్‌రెడ్డి క్షత్రిపురంలోని 199 సర్వే నెంబర్లు తన భూమి పక్కనే ఉన్నవారి భూమిని కబ్జాచేయడమేకాక బాధితులను వేధింపులు గురిచేయడంతో వాని ఫిర్యాదు మేరకు, కాప్రా మండల తహశీల్దార్ ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదయ్యాయి. అయితే ఈ రెండు కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఓ మాజీ కార్పొరేటర్ వెంట ఉండే ఉపేందర్ అనే మధ్యవర్తికి పోలీసులతో చనువు ఉంది. ఆ నమ్మకంతో భరత్ రెడ్డిపై ఉన్న రెండు కేసులు మాఫీ చేయడానికి అంగీకారం కుదుర్చుకున్నాడు. భరత్‌రెడ్డికి నమ్మకం కలిగించడానికి సబ్‌ఇన్‌స్పెక్టర్ షఫీ, ఇన్‌స్పెక్టర్ వీరా స్వామిని ఓ ప్రైవేటు ఆఫీసులో మధ్యవర్తి ఉపేందర్ కల్పించాడు. అయితే రెండు కేసుల్లో ఒక్కటే కొట్టి వేయిస్తానని సబ్ ఇన్‌స్పెక్టర్ షఫీ, ఇన్‌స్పెక్టర్ వీరాస్వామితో మాట్లాడి మూడు లక్షల రూపాయలు లంచం తీసుకోవడానికి భరత్‌రెడ్డితో అంగీకారం కుదుర్చుకున్నాడు. ఇందుకు సంబంధించి విడియో, ఆడియో ఆధారాలు సైతం ఫిర్యాదుదారు సేకరించి పెట్టుకుని వాటిని ఎసిబి అధికారులకు అందించాడు. కాగా శుక్రవారం 12 గంటల ప్రాంతంలో మధ్యాహ్నం ఎస్ఐ షఫీకి రూ. 3 లక్షలు అంది స్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వీరాస్వామితోపాటు బ్రోకర్‌గా వ్యవహరించిన ఉపేందర్‌ను అరెస్టుచేసి కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏడు గంటలపాటు సోదాలు నిర్వహించి వివరాలు సేకరిస్తున్నారు. కాగా రెండు నెలల క్రితం ఎలక్షన్ కోడ్‌లో బదలీపై వచ్చిన వీరస్వామి, ఎస్ఐ ప్రలోభాలకు లోనైన ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి ఎసిబికి చిక్కాడు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు జరుగుతున్న క్రమంలోనే ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి నివాసముంటున్న గుర్రం గూడాలో సైతం ఏసీబీ ఇన్ స్పెక్టర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఎస్ఐ షఫీ నివాసం ఉంటున్న దమ్మాయిగూడలో నివాసాన్ని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పక్కా వీడియో ఆడియో ఆధారాలను సేకరించామని డిఎస్‌పి ఆనంద్ తెలిపారు. ఈ మేరకు కుషాయిగూడ మొదటి నిందితుడు సబ్ ఇన్‌స్పెక్టర్ షఫీ, రెండవ నిందితుడు ఇన్‌స్పెక్టర్ వీరాస్వామి, మూడవ నింది తుడు మధ్యవర్తి ఉపేందర్‌లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో 7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ప్రపంచ వరి సదస్సు ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ పంటల సంస్థ డైర్టర్ మెర్సిడెజ్ జోన్స్ శుక్రవారం మంత్రితో భేటీ అయి సదస్సు నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సదస్సుకు దాదాపు 150 మంది విదేశీ ధాన్యం ఎగుమతి, దిగుమతి దారులు, వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలతో పాటు, ఇతర రాష్ట్రాల నుండి మరో 150 మంది వరి విత్తన సంస్థల ప్రతినిధులు, సైంటిస్టులు, రైస్ మిల్లర్లు పాల్గొంటారని వివరించారు. ఈ సదస్సులో వరి ఎగుమతులపై నేరుగా సంప్రదింపులు చేసే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా తెలంగాణలో దిగుబడి అవుతున్న ధాన్యం ఇతర దేశాలకు అనువైనవిగా ఉన్నాయా లేదా అనేది తెలుస్తుందని చెప్పారు. తద్వారా ఎగుమతికి అనుకూలమైన వరిని పండిచొచ్చని తెలిపారు. రాష్ట్రంలో విత్తనాలకు సంబంధించి రైతులకు ఎటువంటి కొరత, ఇబ్బందులు లేవని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు విత్తన సరఫరాపై పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది ఇదే సమయానికి 26,997 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు ఉన్నాయన్నారు.

# ఆంధ్ర పదంతో విషం కక్కుతున్న కెసిఆర్ కుటుంబం



శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

## అధికారముద్రలో అమరవీరుల చిహ్నం ఎందుకు పెట్టకూడదు?

## కీరవాణి ఎంపిక అందెశ్రీదే.. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఆంధ్ర అనే పదంతో విషం కక్కుతూ సెంటిమెంట్ రాజేసి రాజకీయ ప్రయోజనాలు కెసిఆర్ కుటుంబం పొందుతున్నదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సోనియమ్మ తెలంగాణ ఇచ్చిన తరువాత ఆ సెంటిమెంట్‌ను తమ స్వలాభం కోసం వాడుకొని అన్నిటిని మరి పించిన ఘనత కల్వకుంట్ల కుటుంబానిదే అని ఆయన అన్నారు. నాలుగు నెలలుగా కాంగ్రెస్ పార్టీ వేస్తున్న ప్రతి అడుగు, ప్రతి కార్యక్రమం నిజమైన తెలంగాణ వాదులు కోరుకుంటున్న దిశలోనే ఉన్నాయని, కానీ కెసిఆర్ కుటుంబం దానిని చూసి జీర్ణించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాజముద్రలో ఉద్యమకారుల అభిప్రాయం మేరకు అమరవీరుల స్తూపం పెడితే మీకున్న కడుపునొప్పి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ ఏ త్యాగం చేయకున్నా చేసినట్లు నటించారని ఆయన ఆరోపించారు. 2014 నుంచి చినజీయర్‌స్వామిని మీ పక్కనే కూర్చొబెట్టుకున్నప్పుడు ఏ తెలంగాణ సెంటిమెంట్ ఎందుకు మీలో ప్రేరేపించలేదని ఆయన ప్రశ్నించారు. అందెశ్రీపాటను మీరు ఎందుకు ఆంధ్ర వ్యక్తి రామకృష్ణతో పాడిం చారని ఆయన నిలదీశారు. కీరణవానిని సంగీత దర్శకుడిగా ఎంపిక చేసింది జయజయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ మాత్రమేనని, ఆ ఎంపికకు ప్రభుత్వానికి సంబంధం లేదని మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యాదగిరి గుట్ట యాదాద్రిగా మార్చింది ఆనందసాయి అనే ఆంధ్ర వ్యక్తి కాదా అని అడిగారు. కిరవాణి ఆస్కార్ అవార్డు గెల్చినప్పుడు కెసిఆర్, కెటిఆర్ ట్వీట్ చేయలేదా అని మహేశ్‌కుమార్ ప్రశ్నించారు. శారదా పీఠానికి భూములు ఇచ్చినప్పుడు, పెద్దపెద్ద కాంట్రాక్టు కంపెనీలను ప్రోత్సహించినప్పుడు మీకు ఆంధ్రా వారు గుర్తుకురాలేదు అని ఎద్దేవా చేశారు. కవులు, కళాకారులు, నిజమైన ఉద్యమకారుల అభి ప్రాయాలకు అనుగుణంగా రాష్ట్రీయ గీతం రాజ ముద్రను కొత్తగా నవీకరిస్తున్నామని తెలిపారు.

**ప్రజాపాలన దర్పం పట్టేందుకు చిహ్నంలో మార్పు: మల్లు రవి**

ప్రభుత్వ అధికార ముద్ర అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకొనేలా ప్రజా చిహ్నంగా ఉండటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్పుచేయాలని చూస్తున్నా రని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ ఎంపి అభ్యర్థి మల్లు రవి అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాచరిక పాలన తీసేసి ప్రజాపాలన తీసుకొస్తామని టిపిసిసి అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఒక ఎజెండాను ప్రజల ముందు పెట్టారని దానికి అనుగుణంగానే సంస్కరణ చేపడుతున్నారని ఆయన అన్నారు. ఇది కాంగ్రెస్ కార్యక్రమం కాదు, ప్రభుత్వ కార్యక్రమమని మల్లు రవి అన్నారు.

# బిషప్ తుమ్మ బాల సేవలు ఎనలేనివి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘననివాళి



సెయింట్ మేరీ చర్చి బిషప్ తుమ్మ బాల పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, జంపన ప్రతాప్ తదితరులు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మే 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ అర్చ్‌బిషప్ ఎమిరటస్ తుమ్మ బాల ఈ నెల 30న వరంగల్‌లో మృతి చెందారు. ఆయన పార్థివదేహాన్ని సికిందరాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసలికాకు తీసుకువచ్చారు. ఆ తర్వాత రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్కూల్ ఆవరణలో ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. కార్డినల్, హైదరాబాద్ ఆర్చ్‌బిషప్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో సామూహిక పార్థనలు నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బిషప్ తుమ్మ బాల మరణవార్త తెలుసుకొని ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎకె ఖాన్, బిషప్‌లు, రెవరెండ్ థమన్‌కుమార్, రెవరెండ్ ప్రకాశం, రెవరెండ్ బాల, డాక్టర్ జయరామ్‌లతోపాటు ఫాదర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో బిషప్ తుమ్మబాల సేవలు ఎనలేనివని, ఆయన మృతి చెందడంతో సమాజానికి, క్రిస్టియన్ సోదరులకు తీరనిలోటు ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2019 ఎంపీ ఎన్నికల్లో, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మమ్మల్ని మంచి మనసుతో ఆశీర్వదించారన్నారు.

వారి ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఆయన మృతి చెందడం పట్ల క్రైస్తవ సమాజంతో పాటు అభిమానులకు తీరని దుఖ:న్ని మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌లతోపాటు వివిధ చర్చిలకు చెందిన బిషప్‌లు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

**సెయింట్ మేరీ చర్చిలో అంత్యక్రియలు**

ఆర్చ్‌బిషప్ తుమ్మబాల అంత్యక్రియలు సికిందరఆబాద్ సెయింట్ మేరీస్ బసలికా చర్చి ఆవరణలో ఖననం చేశారు. తుమ్మబాల వీలునామాలో తన మరణాంతరం చర్చి ఆవరణలోనే ఖననం చేయాలని కోరడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐకి అప్పగించాలి

## దోషులకు శిక్షపడే దాకా పోరాటం ఆగదు : రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్

## ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బిజెపి ధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 31, ప్రభాతవార్త:** ఫోన్ ట్యాపింగ్ కేసును తక్షణమే సీబీఐకి అప్పగించి, దోషులను చట్టప్రకారం శిక్షించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వ హించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన వెంటనే ఫలితాలు రాకముందే ప్రజాక్షేత్రంలో ప్రజాసమస్యలపై ఏవిధంగా పాటుపడుతుందో ఈ ధర్నానే నిదర్శనం అన్నారు. ఆనాడు ఒక నియంతగా, అవినీతిలో కూరుకుపోయి, మొత్తం నల్లధనాన్ని సొమ్ముగా చేసుకుని, తెలంగాణ ఆస్తులను, సంపదను కొల్లగొట్టి ఆ కుటుంబం రాచరిక వ్యవస్థగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ చేసిన పోరాట ఫలితంగా ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ అవినీతిని పదేపదే ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అవినీతి కుంభకోణాలపై నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వేరు కాదని, ఈ రెండు పార్టీల డీఎన్ఏ ఒక్కటేనని, త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందని జోస్యం చెప్పారు. లిక్కర్ కేసులో కవితను గట్టెక్కించేందుకు ఎమ్మెల్యేల కేసు బయటకు తీసుకువచ్చారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేవలం రాజకీయ అంశం కాదని, అది దేశభద్రతకు సంబంధించిన అంశమని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీజేపీ రాజీపడేది లేదని, దోషులకు శిక్షపడేవరకు బీజేపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

మాజీ ఎంపీ బూర నరసయ్యగౌడ్ మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ అనేది ఒక మాఫియా వంటిదని, ప్రస్తుత పరిస్థితి చూస్తూ ఉంటే ల్యాండ్ మాఫియా నయీం గుర్తుకు వస్తున్నాడని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఒక్క రాజకీయాలకే పరిమితం కాలేదన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మా ట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే, కేవలం ప్రజలను నమ్మించటానికి ఎన్నికల సమయంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటారు.

మాజీ ఎమ్మెల్యే కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం ఈరోజుది కాదని, అది 2017 ముందు నుండే జరుగుతోందని, ఫోన్ ట్యాపింగ్ ద్వారానే బీఆర్ఎస్ రెండవసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంటేశ్వర్లు, పెద్దపల్లి పార్ల మెంట్ అభ్యర్థులు శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ అభ్యర్థి భరత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గౌతంరావు హాజరయ్యారు.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్

# రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ల రాజీనామా

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు (టెస్కాబ్) ఛైర్మన్ కె రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి రాజీనామా చేశారు. అధ్యక్షునిగా ఉన్న సహకార బ్యాంకులోని కొంత మంది పాలకవర్గ సభ్యులు (డైరక్టర్లు) కాంగ్రెస్‌లో చేరడం వల్ల మెజార్టీ లేక పోవడంతో ఇంక ఛైర్మన్ పదవిలో కొనసాగడం సాధ్యం కాని పరిస్థితుల్లో ఆయన ఈ నిర్ణం తీసుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర సహకార బ్యాంకు వైస్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా రాజీనామా చేయడం విశేషం. ఈ సందర్భంగా రవీందర్‌రావు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సహకార బ్యాంకులో డైరక్టర్లు పార్టీలు మారారన్నారు. విశ్వాసం కోల్పోయిన చోట ఉండకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తనతోపాటు సహకార బ్యాకు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మహేందర్‌రెడ్డి కూడా రాజీనామ చేసినట్లు పేర్కొన్నారు.

# టిఎస్‌నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య పదవీవిరమణ

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టిఎస్ నాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య శుక్రవారం పదవీవిరమణ చేశారు. 1993 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన సందీప్ శాండిల్య ఉమ్మడి ఎపి కేడర్ అధికారి. దక్షిణ మండల డిసిపిగా, ఇంటెలిజెన్స్ విభాగం డిఐజిగా, క్రైం అంట్ సిట్ అ దనపు సిపిగా, ఉమ్మడి సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్నికల సంఘం హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమించగా ఆ పోస్టులో ఆయన రెండు నెలల పాటు కొనసాగారు. అనంతరం కొత్త సర్కారు సందీప్ శాండిల్యను టిఎస్.నాబ్ డైరక్టర్‌గా నియమించింది. ఈ పోస్టులో ఆయన ఆరు నెలల తక్కువకాలం పాటే పనిచేసినా మాదకద్రవ్యాల కట్టడి, డ్రగ్స్ స్మగ్లర్ల అరెస్టు, వారి ఆస్తుల జప్తు విష యంలో కొత్త ఒరవడికి నాంది పలికారు. వరుసగా మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతు న్న నేరగాళ్ల ఆస్తుల జప్తుకు ఆయన హయాంలోనే శ్రీకారం చుట్టారు. దీంతో పాటు తెలంగాణలో కల్తీ కల్లు తయారీకి వాడే ఆ ల్ప్రాజోలంను వందల కిలోలను పట్టుకోవడంలో టిఎస్ నాబ్ పోలీసులు సఫలమయ్యారు. మెదక్‌లో రెండు చోట్ల ఆల్ప్రాజోలం తయారీకి ఏకంగా ఫ్యాక్టరీలు స్థాపించిన స్మగ్లర్లను పెద్ద సంఖ్యలో పట్టుకోవడం ఇదే తొలిసారి. ఇక మాదకద్రవ్యాల కట్టడికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పోలీసులకు టి.ఎస్ నాబ్‌లో భిన్న పద్ధతుల్లో శిక్షణ మొదలైంది కూడా సందీప్ శాండిల్య హయాంలోనే కావడం గమనార్హం. కాగా పదవీ విరమణ రోజున సందీప్ శాండిల్యా డిజిపి రవి గుప్తాను మర్యాద పూర్వకం గా కలిశారు. కాగా పదవీ విరమణ చేసిన సందీప్ శాండిల్యాకు టి.ఎస్ నాబ్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.



సందీప్ శాండిల్య (ఫైల్)

# నేడు కొండగట్టు అంజన్న పెద్దజయంతి

## స్వామివారికి పంచామృత అభిషేకాలు, యాగశాలలో హోమాలు

## దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి



**మల్యాల (జగిత్యాల జిల్లా), ప్రభాతవార్త:** కొలిచే భక్తులకు కొంగు బంగారం కొండగట్టు అంజన్న క్షేత్రానికి పెద్ద జయంతి సందర్భంగా భగభగ మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా అంజన్న భక్తులు తమ దీక్ష విరమణలకై కొండగట్టుకు భారీగా చేరుకుంటున్నారు. రెండు రోజుల క్రితమే ఉత్సవాలు ప్రారంభం కాగా నేడు జరిగే పెద్ద జయంతికి తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ నుంచి అంజన్న భక్తులు తమ మొక్కులు చెల్లించుకునేందుకు దీక్షలు విరమణకు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. కాగా జయంతి ఉత్సవాల రెండవ రోజైనా శుక్రవారం శ్రీ ఆంజనేయ స్వామి వారికి అరటి పండ్లతో అలంకరణతో పాటు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు, మహా నివేదన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ శ్రీ అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర నామార్చన పుష్పాలతో ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా స్థాపిత దేవత ఆరాధన తో పాటు బలిహరణం, మహా నివేదన కార్యక్రమాలను యాగశాలలో హోమాలతో వేద పండితులు, అర్చకులు వైభవంగా నిర్వహించారు.

**మాల విరమణకు తరలివస్తున్న దీక్షస్వాములు**

తమ కోరికలను నేరవేరాలని తపస్సు చేపట్టిన మాల స్వీకరించి తమ దీక్షలు విరమిం చుకునేందుకు అంజన్న ఆలయానికి భక్తులు తరలివచ్చి మాల విరమణ కేంద్రంలో దీక్షలు విర మించు కుంటున్నారు. అనంతరం శ్రీ స్వామివారి ఆలయంలో దర్శనానికి క్యూలైన్‌లో భారీ ఎత్తున బారులు తీరుతున్నారు. అంజన్న ఆలయ క్షేత్రపాలకుడైన బేతాళ స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. 47 డిగ్రీలతో ఎండలు మండుతుండగా దీక్షస్వాములు లెక్కచేయకుండా వందలాది కిలోమీటర్ల నుండి కాలికి గుడ్డలు చుట్టుకోని పాదయాత్రల ద్వారా జైశ్రీరామ్.. జైహనుమాన్ నినాదాలతో కొండపైకి చేరుకుంటున్నారు.

**ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

ఆలయంలో ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక డప్పు, ఒగ్గు కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారితో పాటు శ్రీరాముడు లక్ష్మణుల వేషధారణతో సందడి చేశారు. శుక్రవారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శ్రీ స్వామివారి ఆలయానికి వచ్చి దర్శించుకున్నారు. కాగా జయంతి ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సాఫీగా స్వామివారి దర్శనం, మాల విరమణ జరిగేటట్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో రూ.6 కోట్ల స్క్రాప్ మాయం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇనుము, అల్యూమినియం, ఇతర స్క్రాప్స్ మాయమైనట్లు తెలియవచ్చింది. వీటి విలువ దాదాపు 6 కోట్ల రూపాయలుగా ఉంటుందని అంచనా. తొలుత వీటిని మినీ వ్యాన్‌లను, తదుపరి లారీని తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా తరలించినట్లు చెబుతున్నారు. దీని వెనక ఒక అధికారి సహకారం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇందులో ప్లాంట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు తదితరులు ఉన్నట్లు సమాచారం. కాగా అధికారుల ఫిర్యాదు మేరకు దీనిపై విచారణ జరుగుతున్నట్లు సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

# రాష్ట్రంలో కొత్తగా లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగు చేయాలనే లక్ష్యాన్ని కలిగి ఉంది. దీనికి సంబంధించి ఉద్యాన శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో పామాయిల్ సాగు నిమిత్తం 67,500 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు దరఖాస్తులు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలియచేశారు.

ఇందుకు గాను 18 వేల మంది రైతులు తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. వర్షాలు ప్రారంభం కాగానే దరఖాస్తు చేసుకున్న రైతులకు పామాయిల్ మొక్కలు ఇచ్చేందుకు ఉద్యాన శాఖ ఏర్పాట్లు చేస్తోంది. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 2.03 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది.

# మరో గ్రంథాలయ ఉద్యమయాత్ర




ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న వేదకుమార్. చిత్రంలో చినవీరభద్రుడు, యాకూబ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 31, ప్రభాతవార్త:** రేపటి తరం కోసం చేపట్టిన 'మరో గ్రంథాలయ ఉద్యమ యాత్ర' శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని అక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో స్కూల్‌లో ముగిసింది. ఈ నెల 26న వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి ఉద్యమ యాత్ర ప్రారంభమైంది. ముగింపు సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త వాడ్రేపు చినవీరభద్రుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 19 కోట్ల మంది తెలుగు ప్రజలు ఉన్నారని, వారిలో రచయితలు, కవులు, కళాకారులు ఎంతోమంది ఉన్నారని కాని పుస్తకాలు, గ్రంథాయాల గురించి పట్టించుకోవాల్సిన అవసరాన్ని మరో గ్రంధాయల ఉద్యమం గుర్తించి ఈ ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ ఉద్యమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత తమ పిల్లలకు పుస్తకాలు చదవడం గురించి అలవాటు చేయాల్సిన అవసరం ఉందని, ఈ ఉద్యమానికి తన తోడ్పాటు ఉంటుందని, ఒక కార్యకర్తగా పనిచేస్తానని చెప్పారు. మంచికంటి రవికుమార్ వ్యక్తులుగా కాక శక్తులుగా పనిచేస్తున్నారని అభినందించారు. 'బాల చెలిమి' మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ ఈ ఉద్యమం సమాజానికి అవసరమైనదని అందరూ పాల్గొనాలని, ఒక్క రాష్ట్రలోనే కాకుండా దేశంలోని అనేక రాష్ట్రాలలో ఉన్న తెలుగు వారిని కూడా ఉద్యమంలోకి ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వానికి కూడా గ్రంథాలయాల అవశ్యకతను తెలియజేసి విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ ఉద్యమాన్ని రూపుదిద్దాలన్నారు. తమ వంతుగా బాలచెలిమి గ్రంథాలయాల ఏర్పాటు చేయడం మొదలు పెట్టామని, ఈ గ్రంథాలయాలను ప్రతి జిల్లాలో ఏర్పాటుచేసి ఉద్యమానికి చేయూతనిస్తామని వేదకుమార్ చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫేయిర్ అధ్యక్షునిగా ఎన్నికైన కవి యాకూబ్ మాట్లాడుతూ మరో గ్రంథాలయం ఉద్యమం చాలా స్ఫూర్తిదాయకమని, పుస్తక సంస్కృతిని పెంపొందించడం కన్నా పెద్ద వేడుక ఉండదన్నారు. పిల్లల కోసం పనిచేస్తున్న అన్ని సమూహాలను ఒకే వేదిక మీదికి తీసుకు వచ్చిన మరో గ్రంథాలయ ఉద్యమం భవిష్యత్తు తరాలకు ఒక గోప్ప వెలుగు బాట కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన కూరగాయల ధరలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణలో కూరగాయల ధరలు మండుతున్నాయి. మొన్నటి వరూ కిలో 10 రూపాయల కంటే తక్కువగా పలికిన టమాటా రేటు ఇప్పుడు 30 రూపాయలు దాటింది. బయట మార్కెట్‌లో అయితే ఈ రేటు 40 నుండి 50 రూపాయల వరకూ పలుకుతోంది. పచ్చిమిర్చి సెంచరీ కొట్టింది. కేజీ 100 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. అదే షాపింగ్ మాల్స్‌లో అయితే 114 రూపాయల పలుకుతోంది. బీటూరూట్ 50 నుండి 60 రూపాయలు, బంగాళాదుంపలు 40 నుండి 56 రూపాయలు, క్యాప్సికమ్ 60 నుండి 80 రూపాయలు, కాకరకాయల 60 నుండి 80 రూపాయలు, బట్టర్ బీన్స్ 60 నుండి 85 రూపాయలు, బ్రాడ్ బీన్స్ 85 నుండి 112 రూపాయలు, క్యాబేజీ 40 నుండి 55 రూపాయలు, క్యారెట్ 55 నుండి 70 రూపాయలు, వంకాయలు 40 నుండి 55 రూపాయలు, అల్లం 170 నుండి 215 రూపాయలు చొప్పున మార్కెట్లల్లోను, షాపింగ్ మాల్స్‌లోను విక్రయిస్తున్నారు. కాగా అత్యధిక ఉష్ణోగ్రతలు, భగ్గుమంటున్న ఎండలకు తోడు, అకాల వర్షాలు సైతం కూరగాయల తోటలను దెబ్బతీశాయి. దీంతో కూరగాయల సాగు తగ్గి వాటి ధరలు పెరిగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ముందస్తుగా కూరగాయల సాగును చేపట్టినప్పటికీ నీటి ఎద్దడి కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గాయి.

# కాకతీయ థర్మల్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ)లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఈ థర్మల్ పవర్ ప్లాంట్‌లోని 500 మెగావాట్ల యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ప్రధానంగా ఈ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడం వల్లనే విద్యుత్ ఉత్పత్తికి సమస్యలు ఏర్పడ్డాయి. ప్లాంటు బాయిలర్ ట్యూబులలో లీకేజీ కావడతో ఉత్పత్తి నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కోకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారురు.

# గ్రూప్స్ సర్వీస్‌ల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు సక్రమంగా లెక్కించి భర్తీ చేయాలి

## టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ మహేందర్‌రెడ్డితో ఎంపి ఆర్.కృష్ణయ్య చర్చలు



టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 31, ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డి ఒకేదఫా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమని అయితే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా కింద గ్రూపు–1, గ్రూపు–2 సర్వీస్‌లో పోస్టులను కరెక్ట్‌గా లెక్కించి భర్తీ చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్.కృష్ణయ్య శుక్రవారం కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించి చర్చలు జరిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతమంది అధికారులు డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోటా కింద భర్తీ చేయాల్సిన గ్రూపు–1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా లెక్కించడం లేదని ఆరోపించారు. గ్రూపు–1 కింద పదేళ్లుగా పోస్టులు భర్తీ చేయలేదని, అలాగే గ్రూపు–2 కింద ఆరేళ్లుగా నోటిఫికేషన్ విడుదల చేయలేదని, నామమాత్రంగా భర్తీ చేశారని ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ప్రస్తుతం గ్రూపు–1 కింద 503 పోస్టులు ప్రకటించారని, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులు కరెక్టుగా లెక్కిస్తే 1600లకుపైగా వస్తాయని, గ్రూపు–2 రెండు వేలకుపైగా వస్తాయని, గ్రూపు–3 కింద మూడు వేలకుపైగా, గ్రూపు–4 కింద కరెక్టుగా లెక్కతీస్తే 25 వేలకుపైగా ఉంటాయని, తక్షణమే ఛైర్మన్ జోక్యం చేసుకుని పోస్టులను కరెక్టగా లెక్కించి భర్తీ చేయాలని ఆయన కోరారు. ఆర్.కృష్ణయ్యతోపాటు ఛైర్మన్‌తో చర్చలలో పాల్గొన్న వారిలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, గోరిగె మల్లేష్‌యాదవ్, వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, నంద గోపాల్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## 'మనమే' నుంచి టప్పా టప్పా పాట విడుదల

రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో శర్వానంద్ 'మనమే' మేకర్స్ ప్రమోషన్స్ డోస్ పెంచారు. మ్యూజికల్ ప్రమోషన్స్ కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి రెండు పాటలు ఇప్పటికే చార్ట్ బస్టర్స్ అయ్యాయి. మేకర్స్ మూడు సింగిల్ టప్పా టప్పా పాటని విడుదల చేశారు. ఈ పాటను ఈ సంవత్సరం పెళ్లిపాటగా ప్రమోట్ చేస్తున్నారు. ఈ అందమైన పాటను విని, కలర్ విజువల్స్ చూసిన తర్వాత అందరూ దీనిని అంగీకరిస్తున్నారు. హేషమ్ అబ్దుల్‌వహాబ్ అందరూ ఎంజాయ్ చేసే పర్ఫెక్ట్ వెడ్డింగ్ సాంగ్‌ని అందించారు. ప్రోగ్రామింగ్, ఆర్కేస్ట్రేషన్ అద్భుతంగా ఉన్నాయి. రామ్‌మిరియాల, హేశం తమ వోకల్స్‌తో మెస్మరైజ్ చేయగా, కాసర్లశ్యామ్ సాహిత్యం గుర్తుండిపోతుంది. శర్వానంద్ ఈ పాటల్లో లవ్లీగా కనిపించారు. అతని స్టైలింగ్, డ్యాన్స్ అలరించాయి. పాటలో గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ మూమెంట్స్ చేస్తూ కనిపించారు. ఇందులో కృతిశెట్టి, కిడ్ విక్రమ్‌ఆదిత్య కూడా కనిపిస్తాడు. శివకందుకూరి, అయేషాఖాన్ పెళ్లి జంటగా కనిపించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై రామేసే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో నిర్మాత టిజి విశ్వప్రసాద్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. విష్ణుశర్మ, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫరు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా. కృతిప్రసాద్, ఫణివర్మ ఎగ్జిక్యూటివ్‌నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ టెక్నీషియన్ ప్రవీణ్‌పూడి ఎడిటర్, జానీషేక్ ఆర్ట్ డైరెక్టర్. ఈ చిత్రానికి డైలాగ్స్‌ని అర్జున్‌కార్తీక్, ఠాగూర్, వెంకీ అందించారు. 'మనమే' జూన్ 7న థియేటర్లలో విడుదల కానుంది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీరామ్ ఆదిత్య, నిర్మాత: టీజీ విశ్వ ప్రసాద్.



## పవర్ ఫుల్ ట్రైలర్ 'హరోం హర'

విభిన్న కథలని ఎంచుకుంటూ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపుని సంపాదించుకుంటున్న హీరో సుధీర్ బాబు తన అప్ కమింగ్ మూవీ 'హరోం హర' లో మరొక కొత్త ప్రయత్నం చేస్తున్నారు. ఎస్ఎస్ఇ బ్యానర్‌పై సుమంత్ జి.నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌కి సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేసిన మేకర్స్, సూపర్ స్టార్ కృష్ణ జయంతి మే 31 సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ట్రైలర్ గురించి సూపర్‌స్టార్ మహేష్ బాబు తన సోషల్ మీడియా ద్వారా మాట్లాడుతూ, హరోం హర స్క్రీన్ పైకి ఏం తీసుకువస్తుందో చూడాలని ఎందురు చూస్తున్నాను. ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. సుధీర్‌బాబు అండ్ టీమ్‌కు శుభాకాంక్షలు తెలియచేశారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర బ్యానర్, ఇందులో హీరో పాత్ర పేరు సుబ్రహ్మణ్యం, హరోం హర స్వామి వారిని కొలిచే పదం అన్నారు. డైరెక్టర్ సంపత్ నంది మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా ట్రైలర్ చూసిన తర్వాత టెర్రిఫిక్‌గా అనిపించింది అన్నారు. హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ, కృష్ణ గారి జయంతి సందర్భంగా ట్రైలర్ లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా చాలా స్పెషల్. యాక్షన్ సినిమా చేయమని కృష్ణగారు చాలా సార్లు చెబుతుండేవారు. ఈ సినిమా విషయంలో ఆయన చాలా ఆనందపడతారని నమ్ముతున్నాను అన్నారు. చిత్ర దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక మాట్లాడుతూ, ఈ వేడుకకు విచ్చేసిన అనిల్ రావిపూడి గారికి, సంపద్ నందిగానికి, అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. హరోం హర చాలా ఇష్టంగారాసుకుని ఎంజాయ్ చేస్తూ చేసిన సినిమా అన్నారు. హీరోయిన్ మాళవిక శర్మ మాట్లాడుతూ, ఈ సినిమాలో నేను చేసిన పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇప్పటి వరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. ఇలాంటి మంచి పాత్ర ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు అన్నారు. నిర్మాణ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకకు విచ్చేసిన అనిల్ రావిపూడి గారికి, సంపత్ నంది గారికి, దాము గారికి, సుధీర్ బాబు గారి అభిమానులకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కెవిల్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, సుబ్రహ్మణ్యం ఐదేళ్లుగా పరిచయం. చాలా ఫ్యాషన్‌తో సినిమాల్లోకి వచ్చారు అన్నారు. బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ, సుబ్రహ్మణ్యం చాలా పాషన్ ఉన్న నిర్మాత.



## 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఎమోషనల్ మూవీ

'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' శ్రీకరస్టూడియోస్ సమర్పణలో సితారఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నుమూరి సహ నిర్మాతలు. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈసినిమాలో నేహాశెట్టి, అంజలి కథానాయికలుగా నటించారు. ప్రముఖ స్వరకర్త యువన్ శంకర్‌రాజా సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలకు, ప్రచార చిత్రాలకు విశేష స్పందనలభించింది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయకుడు విశ్వక్ సేన్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకోవడంతో కాదు, సినిమా పట్ల తమకున్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**ట్రైలర్‌లో కొన్ని ఇబ్బందికర సంభాషణలు ఉన్నాయి కదా?** విశ్వక్‌సేన్: మా సినిమాలో కేవలం రెండు, మూడు మాత్రమే అటువంటి సంభాషణలు ఉన్నాయి. అవి కూడా ట్రైలర్‌కే పరిమితం. సినిమాలో మ్యూట్ చేయబడ్డాయి. అందుకే మా సినిమాకి సెన్సార్ వారు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చారు. ట్రైలర్ లో కూడా ఆ సంభాషణలు ఎందుకు పెట్టామంటే, ఆ పాత్రలలోని భావోద్వేగాలను ప్రేక్షకులకు నిజాయితీగా పరిచయం చేయడం కోసమే. నిజానికి నేను ఈ సినిమా చేస్తున్న సమయంలో ఇది యువతకి మాత్రమే నచ్చేలా ఉంటుంది అనుకున్నాను. కానీ మొత్తం సినిమా పూర్తై ఫైనల్ కాపీ చూసిన తరువాత నాకు ఈ సినిమా విలువ తెలిసింది. నాగవంశీ: కొందరు ట్రైలర్‌లోని కేవలం ఆ రెండు సంభాషణలను ఎందుకు పట్టించుకుంటున్నారో అర్థం కావడం లేదు. సినిమాల పట్ల ఎంతో అవగాహన ఉన్న అన్నపూర్ణ సుప్రియాగారు ఫోన్‌చేసి ట్రైలర్ బాగుంది అన్నారు.

**'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా ఎలా ఉండబోతుంది?** విశ్వక్‌సేన్ : కమర్షియల్ అంశాలు ఉంటూనే కొత్తగా ఉంటుంది. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. నాగవంశీ : గోదా వరి ప్రాంతానికి చెందిన లంకల రత్న అనే స్లమ్‌కుర్రాడు. రాజకీయాలను వాడు కొని ఎలా ఎదిగాడు అనేది ఈ సినిమా కథ. కమర్షియల్ అంశాలు ఉంటూనే.. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేలా సినిమా ఉంటుంది.

**సినిమాలో గోదావరి యాసలో మాట్లాడుతారా.. ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నారు?** విశ్వక్‌సేన్: యాస విషయంలో నన్ను ఎవరూ వేలు పెట్టి చూపించకూడదు అని ముందే అనుకు న్నాను. ఒకటికి పదిసార్లు జాగ్రత్తగా చూసుకొని సంభాషణలు చెప్పాను. యాస విషయంలో ఒక్కశాతం అనుమానం వచ్చినా, దర్శకుడిని, దర్శక విభాగాన్ని అడిగితెలుసుకునే వాడిని.

**'గ్యాంగ్ ఆఫ్ గోదావరి' కథమీ దగ్గరకు ఎలా వచ్చింది?** నాగవంశీ: మొదట కృష్ణ చైతన్య ఈ కథని వేరే హీరోతో అనుకున్నాను. కానీ ఏవో కారణాల వల్ల ఆసినిమా ఆగిపోయింది. అప్పుడు చైతన్య వచ్చి త్రివిక్రమ్‌ని కలిశారు. అలా కథ వినమని నాకు చెప్పారు. వినగానే చాలా నచ్చింది.

**విశ్వక్‌సేన్ గురించి?** నాగవంశీ:ఇప్పటిదాకా చేసిన సినిమాల్లో విశ్వస్‌సేన్ నటన ఒకెత్తు యితే, ఈ సినిమా నటన ఒకెత్తు.



## 'సత్యభామ' నా కెరీర్‌లో కొత్త ప్రయత్నం

**-కాజల్ అగర్వాల్**

'క్వీన్ ఆఫ్ మాసెస్' కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న సినిమా 'సత్యభామ'. నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడుశశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. జూన్ 7న 'సత్యభామ' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సినిమా ప్రెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్‌గా సుమన్ చిక్కాల బాగుంటాడు అనిపించింది. అందుకే అతని బాధ్యతలు అప్పగించారు. గూఢాచారి సినిమా చేస్తున్న టైమ్‌లో నా ఫ్రెండ్ రమేష్ ప్రశాంత్ ఈ కథను చెప్పారు. ఆ తర్వాత నేను మేజర్ సినిమా కోసం ఎంగేజ్ అయ్యాను. అది పూర్తయ్యాక 'సత్యభామ' సినిమా స్క్రిప్ట్ బెటర్‌మెంట్ చేస్తూ వచ్చాం. ప్రొడ్యూసర్ బాబీ తిక్క మాట్లాడుతూ, క్రైమ్‌థ్రిల్లర్ కథతో మా 'సత్యభామ' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా రూపొందింది. జూన్ 7న థియేటర్స్‌లోకి తీసుకొస్తున్నాం. మా మూవీకి మీ సపోర్ట్ అందిస్తామని ఆశిస్తున్నాం అన్నారు. దర్శకుడు సుమన్ చిక్కాల మాట్లాడుతూ, 'సత్యభామ' కథలో యాక్షన్‌తో పాటు ఎమోషన్ ఉంటుంది. పోలీస్ ఆఫీసర్ అంటే కేవలం ఒక యూనిఫామ్ వేసు కుని యాక్షన్ చేయడంకాదు కాజల్ క్యారెక్టర్‌లో ఎమోషన్ ఉంటుంది. క్వీన్ ఆఫ్ మాసెస్ కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ, 'సత్యభామ' సినిమాతో నాకెరీర్‌లో కొత్త ప్రయత్నం చేశాం. ఇలాంటి క్యారెక్టర్, మూవీ చేయడం ఇదే తొలిసారి. ఈ సినిమా కథ వినగానే నచ్చింది. కొత్తగా అనిపించింది అందుకే సినిమాచేసేందుకు ముందుకొచ్చా. నేను ఫుల్ లెంగ్త్ యాక్షన్ మూవీ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. 'సత్యభామ' తో ఆకోరిక తీరిందన్నారు.



## 'వెపన్' ట్రైలర్ లాంచ్

మిలియన్ స్టూడియోబ్యానర్‌మీద ఎంఎస్ మన్జూర్ సమర్పణలో గుహన్ సెన్నియప్పన్ తెరకెక్కించిన చిత్రం 'వెపన్'. ఈ చిత్రంలో సత్యరాజ్, వసంత్‌రవి, తాన్యాహోప్ ప్రముఖ పాత్రలను పోషించారు. ఈ మూవీ జూన్ 7న విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ట్రైలర్‌లాంచ్ అనంతరం ఈ ఈవెంట్‌లో చిత్రయూనిట్ సత్యరాజ్ మాట్లాడుతూ, 'పెన్, మైక్, మీడియా అనేది రియల్ వెపన్. ఓటుఅనేది మరో గొప్ప వెపన్. తాన్యాహోప్ ఆంగ్లో ఇండియన్. కానీ తెలుగులో చక్కగా మాట్లాడారు. నేను 'అందరికీ నమస్కారం' మాత్రమే చెబుతున్నాను. ప్రస్తుతం భాష అనేదిహద్దుగా లేదు. బాహుబలి సినిమా ఎన్నో భాషల్లోకి వెళ్లింది. ఈ వెపన్ మూవీ అలాంటి చిత్రమే. ఇది హిట్‌కాబోతోంది అన్నారు. వసంత్ రవి మాట్లాడుతూ, 'ఫ్యాంటసీ యాక్షన్, సూపర్ హీరో ఎలిమెంట్స్ అంటూ ఇలా ఇంట్రెస్టింగ్‌గా గుహన్ ఈ కథను రాశారు. కామిక్ స్టైల్ ఈ మూవీ రాసుకున్నారు. ఇది చాలా గొప్పగా వచ్చింది. ఈ మూవీలో ఎంతో సీజీ వర్క్ ఉంది. కట్టప్ప పాత్ర తరువాత సత్యరాజ్ మళ్లీ అలాంటి ఓ యాక్షన్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. తాన్యాహోప్ మాట్లాడుతూ, 'వెపన్ మూవీ కోసం వచ్చినందుకు ఆనందంగా ఉంది. సత్యరాజ్, వసంత రవి, రాజీవ్‌లతో పని చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఎక్కువగా చెప్పలేను. రాజీవ్‌పిళ్లై మాట్లాడుతూ, ప్రతీ నటుడికి ఓ సూపర్ హీరో మూవీ చేయాలని ఉంటుంది. కెరీర్ ప్రారంభంలోనే ఇలాంటి ఓ మంచి క్యారెక్టర్ రావడం మామూలు విషయం కాదు.



## 'గం..గం..గణేశా'లో ఆనంద్‌దేవరకొండ పర్ఫార్మెన్స్ హైలైట్

**-దర్శకుడు ఉదయ్‌శెట్టి**

ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్‌మూవీ 'గం..గం..గణేశా' ఆనంద్ సరసన ప్రగతిశ్రీవాస్తవ, నయన్‌సారిక హీరోయిన్స్‌గా కనిపించను న్నారు. ఈ సినిమాను హై - లైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్‌శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.'గం..గం.. గణేశా' గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చింది. తాజాగా ఇంటర్వ్యూలో సినిమా హైలైట్స్ తెలిపారు. డైరెక్టర్ ఉదయ్‌శెట్టి. నేను విజయేంద్ర ప్రసాద్ టీమ్‌లో రైటర్‌గా వర్క్ చేసేవాడిని. ఒకసారి హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం కార్య క్రమంలో పాల్గొన్నాను. ఈ టైమ్‌లో ఈ స్టోరీ లైన్‌ఫ్లాష్ అయ్యింది. నాఫ్రెండ్, దర్శకుడు అనుదీప్ కేవీ ద్వారా ఆనంద్‌దేవరకొండ టీమ్‌కు ఈ స్క్రిప్ట్ సినాప్సిన్ పంపించాను. ఆ సాయంత్రమే నాకు ఫోన్ వచ్చింది. వచ్చి ఒకసారి కలవండి అని. నేను వెళ్లి స్క్రిప్ట్ గురించి వాళ్లకున్న డౌట్స్ క్లియర్ చేశాను. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్ చేద్దామని ఆనంద్ చెప్పారు. అలా 'గం..గం..గణేశా' జర్నీ బిగిన్ అయ్యింది. ఆనంద్‌దేవరకొండ ఇప్పటిదాకా బాయ్ నెక్ట్ డోర్ క్యారెక్టర్ చేశారు. సాఫ్ట్ నేచర్ రోల్స్‌లో కనిపించాడు. 'గం.. గం.. గణేశా'లో హీరో క్యారెక్టర్ గ్రే షేడ్స్‌లో ఉంటుంది. వినాయకుడి విగ్రహం చుట్టూ తిరిగే కథ ఇది విగ్రహం సంపాదించుకునేందుకు చాలా మంది ప్రయత్నిస్తుంటారు. ఈ సినిమా అన్నీ గ్రే క్యారెక్టర్స్ ఉంటాయి. హైదరాబాద్ నేపథ్యంగా మొదలయ్యే ఈ సినిమా ఆ తర్వాత కర్నూల్‌కు షిఫ్ట్ అవుతుంది. ఈ జర్నీలో సెకండాఫ్‌లో వెన్నెల కిషోర్ క్యారెక్టర్ హిలేరియస్‌గా వచ్చింది 'గం.. గం.. గణేశా' సినిమాలో స్క్రీన్ ప్లే ఆకట్టుకుంటుంది. కథలో నేను నమ్మిన ట్విస్ట్ అండ్ టర్న్స్‌ను అలాగే హోల్డ్ చేస్తూ స్క్రీన్ ప్లే సాగుతుంది. ఈ సినిమా మరో రెండేళ్లకు తెరపైకి తీసుకొచ్చినా కొత్తగా ఉంటుంది. విజయేంద్రప్రసాద్ పుట్టినరోజు విష్ చేసేందుకు వెళ్తే 'గం.. గం..గణేశా' కథను మరోసారి చెప్పించుకుని విని బాగా ఎంజాయ్ చేశారు. ఈ సినిమాతో హిట్ కొడుతున్నావ్ అని బ్లెస్ చేశారు. ఆయనకు మా కథ నచ్చడం నాలోని కాన్ఫిడెన్స్ పెంచింది. ఆనంద్ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అంతా 'గం.. గం.. గణేశా' సినిమా చూశారు. వాళ్లకు మూవీ బాగా నచ్చింది. నేను పూరిజగన్నాథ్‌ని చూసి ఇన్స్‌పైర్ అయ్యారు. అయితే రాజమౌళి సినిమాల్లోని డ్రామా చాలా ఇష్టం. మనకు సినిమా చూసేటప్పుడు డ్రామా మన మనసులకు రీచ్ అవుతుంది. అలాంటి యాక్షన్ డ్రామా మూవీస్ చేయాలని ఉంది. నా నెక్ట్స్ మూవీ యాక్షన్ డ్రామాగానే ఉంటుంది.



## ప్రేక్షకుల్ని అలరిస్తుంది 'భజే వాయు వేగం'

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీకాన్సెప్ట్స్ బ్యానర్‌పై హీరో కార్తికేయ గుమ్మకొండ హీరోగానటిస్తున్న సినిమా 'భజే వాయు వేగం' ఐశ్వర్యమీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది.హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషిస్తున్నాడు. ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అజయ్‌కుమార్ రాజు.పి.కో ప్రొడ్యూసర్ వ్యవహరిస్తున్నారు. సెన్సార్‌నుంచి యూఏ సర్టిఫికెట్ పొంది రేపు వరల్డ్‌వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. 'భజే వాయు వేగం' సినిమా. ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేస్తోంది. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, 'భజే వాయు వేగం' సినిమాలో నాకు మంచి క్యారెక్టర్‌ఇచ్చారు. తెలంగాణ పల్లెలోని ఓ తండ్రి కోసం ఇద్దరుకొడుకులు పడేఆరాటం ఈ సినిమాకు నేపథ్యం. చాలా రోజుల తర్వాత కథలో వెరీ ఇంపార్టెంట్ రోల్ చేశాను.డైలాగ్ రైటర్ మధు శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమంతుడికి తన శక్తి తనకు తెలియనట్లు, మనకు మనశక్తి తెలియదు. అందుకే ఏదైనా సమస్య వచ్చినప్పుడు భయపడతాం. 'భజే వాయు వేగం' సినిమాలో హీరో కూడా అంతే తన శక్తి తనకు తెలియదు.కాని సమస్య వచ్చినప్పుడు బలవంతులైన విలన్స్‌తో పోరాటం చేస్తాడు. ఈ సినిమాలో నేను భాగమవడం సంతోషంగా ఉంది.ఎడిటర్ సత్యజి మాట్లాడుతూ,రన్‌రాజ్ రన్‌సినిమాకు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రశాంత్,ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో నేను పనిచేశాం. భజేవాయువేగం సినిమాకు దర్శకుడిగా తను, ఎడిటర్‌గా నేను వర్క్‌చేయడం హ్యాపీగాఉంది. లిరిక్ రైటర్ రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, జాతిరత్నాలు సిని మాచిట్టి పాట రాసినప్పుడు మీరు బాగా యూత్ అయిపోయారే అని అన్నారు.





మాళవిక శర్మ నయా లుక్

## బుజ్జి అండ్ భైరవ యానిమేషన్ సిరీస్ ట్రైలర్

2డి యానిమేటెడ్ సిరీస్ బుజ్జి అండ్ భైరవ రెబల్ స్టార్ ప్రభాస్ 'కల్కి 2898 ఎడి' మాగ్నమ్ ఓపస్‌కు ప్రీల్యూడ్. ఈ సిరీస్ విజనరీ డైరెక్టర్ నాగ్ అశ్విన్ క్రియేట్ చేసిన కల్కి వరల్డ్‌ని, బుజ్జి అండ్ భైరవబ్యాక్ స్టోరీని సినిమా థియేటర్‌లలో విడుదల చేయడానికి ముందు పరిచయం చేయనుంది. మరి కొన్నిగంటల్లో ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఫ్యూచర్ వరల్డ్‌లో భైరవ ఒక మోటర్‌బైక్‌ను కొనుగోలు చేసి టాప్‌బౌంటీ హంటర్‌గా మారాలని ప్లాన్ చేస్తాడు. తన లక్ష్యాన్ని సాధించడానికి బుజ్జి అనే రోబోతో స్నేహంచేస్తాడు. వారు కలిసి ఆటోమొబైల్స్‌లోని అన్ని వేస్ట్ పార్ట్స్‌ని రీసైకిల్ చేస్తారు. వారి డ్రీమ్‌ని సాధించడానికి 6టన్నుల బీస్ట్ కార్‌ని నిర్మిస్తారు. ట్రైలర్ హ్యూమర్స్, అద్భుం చరస్‌గా ఉంది. వైజయంతీ మూవీస్ ఈసిరీస్ కోసం గ్రీన్ గోల్డ్ యానిమేషన్‌తో కలిసి పనిచేసింది.



బుజ్జి అండ్ భైరవ యానిమేషన్ సిరీస్ స్పెషల్ స్క్రీనింగ్ ఈవెంట్‌లో డైరెక్టర్ నాగ్‌అశ్విన్ మాట్లాడుతూ అందరికీ హాయ్ బుజ్జి ఎంట్రీకి ఎంతమంది అరుస్తారు? భైరవ ఎంట్రీకి ఎంతమంది అరుస్తారో అని వెయిట్ చేశాను. వాళ్లిద్దరూ కలిసినప్పుడు అన్నింటి కంటే ఎక్కువ సౌండ్ వచ్చింది.

# ముత్యమంత మొటిమే కదా?



అందంగా మెరిసే ముఖంపై చిననన మొటిమ వచ్చినా అమ్మాయిలకు ముచ్చెమటలు పొస్తాయి. ఇందుకు హార్మోన్ల ప్రభావంతో పాటు అధిక జిడ్డు, దుమ్మూధూళీ, ఆహారపుటలవాట్లు.. వంటి ఎన్నో కారణాలు. అలాగని వీటిని తగికగంచుకోవడానకి ఖరీదైన క్రీములు వాడుతున్నారా? అవేం అక్కర్లేదు..ఇంట్లోని పదార్థాలతో ఈ చిట్కాలు పాటించి చూడండి.

+ దాల్చిన చెక్కలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గునాలు మొటిమలకు కారణమైన బ్యాక్టీరియాని చంపేస్తాయి. రెండు చెంచాలు తేనె,కాసిని పాలు, చెంచా దాల్చిన చెక్కపొడి కలుపుకోవాలి. దీన్ని ముఖానికి పూతలా వేసి పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో ఇలా చేయడంవల్ల మొటిమలు తగ్గడమే కాదు, మచ్చలూ పోతాయి.

+ జిడ్డుని తొలగించి మొటిమలు రాకుండా బొప్పాయి అడ్డుకుంటుంది. బాగా పండిన బొప్పాయి గుజ్జులో పంచదార, పెరుగు కలిపిముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. అపై గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకోవాలి. రెండు చెంచాల నారింజ తొక్కల పొడికి తగినన్ని పాలు చేర్చి ముఖానికి రాసి ఇరవై నిమిషాల తరవాత కడిగేయాలి. వీటితో మొటిమలు తగ్గడమే కాదు చర్మం కొత్త మెరుపుతో కనిపిస్తుంది.

+ కలబంద గుజ్జులో కాస్త నిమ్మరసం తేనె కలిపి రోజూ రాసి ఆరనివ్వండి ఇలా పదిహేను రోజులు చేస్తే క్రమంగా మొటిమలు తగ్గుముఖం పడతాయి. □

# వన్ ఉమన్ మిషన్‌గా ప్రశంసలు



భుజాన బరువైన నీలి రంగు బాక్సుతో, నీలివర్ణ దుస్తుల్లో.. ఆమె పొలిమేరల్లోకి అడుగుపెడుతోందని తెలిస్తే చాలు. ఆ గ్రామ ప్రజలంతా సంతోషంలో మునిగిపోతారు. తమ మేకలు, పశువుల ఆరోగ్యం మెరుగుపడి.. తమ కష్టాలన్నీ తీరిపోతాయని భావిస్తారు. అంతలా అందరి అభిమానాన్ని పొందుతూ.. 'వన్ ఉమెన్ మిషన్'గా ప్రశంసలు అందుకుంటున్న ఈ 'పశు సఖి' గురించి తెలుసుకుందాం..

గ్రామస్తులంతా ఇష్టంగా పశుసఖి అని పిలుచుకొనే సరోజదేవిది రాయపుర్ గ్రామం. తన పిల్లలిద్దరినీ పెద్ద చదువులు చదివించాలని మొదట్లో వాళ్లని ప్రైవేటు పాఠశాలలో చేర్చింది సరోజ. భర్త కూలిపనులకు వెళ్లేవాడు. ఆ సంపాదన సరిపోక వేడుకల్లో సౌండ్ సిస్టమ్ ఆపరేటర్‌గానూ పనిచేసేవాడు. ఇంత చేసినా అతని సంపాదన పిల్లలకు స్కూల్ ఫీజు, పుస్తకాలు కొనడానికి కూడా వచ్చేది కాదు. తిరిగి అప్పు చేయాల్సి వచ్చేది. రుణభారం పెరుగుతుండటంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోని మార్చారు. మా ఆయనతోపాటు నేను కూడా ఏదైనా పనికెళ్లాలనుకున్నా. అప్పుడే అగాఖాన్ ఫౌండేషన్(ఎకెఎఫ్) కమ్యూనిటీ కోఆర్డినేటర్ ద్వారా వాళ్లు చేపట్టిన ఒక ప్రాజెక్టు గురించి తెలిసింది. మహిళలకు 'పశు సఖి'గా ఉద్యోగమిచ్చి గ్రామాల్లోని మేకలు, పశువుల సంరక్షణపై శిక్షణనిస్తారని తెలిసింది. వెంటనే దరకాస్తు చేసుకున్నా. ఎంపికవడంతో శిక్షణ కూడా తీసుకొని విధుల్లో చేరానంటుంది సరోజదేవి.

**తక్షణ చికిత్సతో.....** తక్షణ చికిత్సతో... ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైచ్ జిల్లా గ్రామాలన్నింటిలో జీవనాధారం మేకలు, ఇతర పశువుల పెంపకమే. గతంలో వాటికి అనారోగ్యం వస్తే చికిత్స కోసం మైళ్లదూరంలో ఉండే ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చేది. 'పశు సఖి'గా సరోజదేవి అక్కడ అడుగుపెట్టినప్పటి నుంచీ ఈ సమస్యలు తగ్గుముఖం పట్టాయి. పశువుల్లో నులిపురుగులు నిర్మూలన, వాటికి టీకాలు, మేకలకు వచ్చే వ్యాధులకు చికిత్స వంటి సేవలు అందిస్తున్నా. గ్రామాల నుంచి నాకు నిరంతరం ఫోన్‌లు వస్తూనే ఉంటాయి. తమ పశువులకు అనారోగ్యంగా ఉందని, ఆహారం తీసుకోవడం లేదని, పాల్వివడం లేదంటూ ఎన్నో సమస్యలు చెబుతుంటారు. మరికొందరు మేక ఈనలేక పోతోందని, పాలివ్వడం లేదంటూ ఎన్నో సమస్యలుచెబుతుంటారు. మరికొందరు మేక ఈనలని కబురు పెడతారు. అప్పటికప్పుడు పశువుల అనారోగ్య లక్షణాలు విని, తాత్కాలిక ఉపశమనం చెబుతా. అలాగే అత్యవసం మైన సమస్యల్ని ముందు పరిష్కరించి, ఆ తరవాతే మిగతావాటి వద్దకు వెళతా. మేకలు సాధారణంగా ఈనడానికి ముందు అనారోగ్యానికి గురవు తుంటాయి. మరికొన్ని డెలివరీ తర్వాత తీవ్రంగా జబ్బు పడతాయి. ఆయా వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్సనందించాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు టీకాలు వేయాలి. దీనిపై అందరికీ అవగాహన కలిగించడానికి వారానికొకసారి గ్రామీణ మహిళలందరినీ సమావేశపరుస్తా. ముఖ్యంగా పశువులకు టీకాల సమయాన్ని పాటించడం ఎంత ముఖ్యమో చెబుతుంటా. అలాగే మేక ఆరోగ్యానికి సంజీవనిలాంటి అజొల్లా మొక్క పెంపకంపై అందరిలో అవగాహన కలిగిస్తున్నానని చెబుతున్న 31 ఏళ్ల సరోజదేవి ఇప్పటి వరకు వందల మేకలకు సమయానికి చికిత్సనందించి ప్రాణాపాయం నుంచి తప్పించింది. అందుకే అందరూ ఆమెని ఆత్మీయంగా పశుసఖీ అనిపిలుచుకుంటారు. □

# వదులు దుస్తులే ఫ్యాషన్





బయట ఎండలు దంచేస్తున్నాయ్. ఈ ఉక్కబోతకు వదులు దుస్తుల్లో ఉండే సౌకర్యం.. దేన్లోనూ ఉండదు కదా! మరి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు టాప్‌లూ, లెగ్గింగ్‌లూ ఒంటికి బిగుతుగా అనిపించవూ! పైగా శుభకార్యాలు ఏమైనా వచ్చినా పట్టు చీరలూ, ఓణీలాంటివి ఈ సీజన్‌లో అసౌకర్యంగా ఉంటాయి. ఇలాంటప్పుడు కఫ్తాన్ దుస్తులే ఫ్యాషన్. రకరకాల డిజైన్లలో, వదులుగా, సౌకర్యంగా ఉండే ఈ కఫ్తాన్ ఫ్యాషన్ ఎపనపటికీ ట్రెండే. అందుకే నేటితరం అమ్మాయిలు అటు ఇష్టం. ఇటు సౌకర్యానికే తగ్గట్టు వీటికే ఓటేస్తున్నారు. ట్రెండీగా, ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే వింటేజ్ స్టైల్, కొంచెం పాష్‌గా, అధునాతనంగా మెరవాలనుకున్నప్పుడు మ్యాక్సీను ఎంచుకుంటే సరి. గ్లామర్‌గా కనిపించాలనుకున్నప్పుడు ఆఫ్ షోల్డర్ డిజైన్ సరిగ్గా నప్పుతుంది. మీరు కనుక కొంచెం ఎత్తు తక్కువ. ఉంటే, అలాంటప్పుడు మిడీ కఫ్తాన్ డ్రెస్ ఉత్తమ ఎంపిక షార్ట్ డ్రెస్‌లో మీరు ఎత్తుగా కనిపిస్తారు. ఫ్యాషనబుల్‌గానూ, ఆకర్షణీయంగానూ ఉంటారు. ఒకవేళ అందంగా, ట్రెండీగా కనిపించానుకుంటే అబ్‌స్ట్రాక్ట్ డిజైన్ కఫ్తాన్ గౌను వేసుకుంటే సరి. లుక్ అదిరిపోతుంది.ఇక శుభకార్యాలకు కొంచెం గ్రౌండ్‌గా, అందంగా ముస్తాబు అవ్వాలనుకుంటాం కదా! అలాంటప్పుడు ఎంబ్రాయిడరీ చేసిన లాంగ్ కఫ్తాన్ డ్రెస్‌లను ఎంచుకుంటే సరి. అందరిలోనూ ప్రత్యేకంగా నిలుస్తారు. మీకూ నచ్చిందా! అయితే ఈ సీజన్ కఫ్తాన్ అందమంతా మీదే.











# రెడ్ రోవర్ !





పిల్లలు రెండు బృందాలుగా ఏర్పడాలి. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని వరుసలో నిలబడాలి. వారికి ఎదురుగా రెండో బృందమూ అలానే నిల్చోవాలి. అయితే రెండింటి మధ్య 20 అడుగులు దూరం ఉండాలి. మొదటి టీమ్ నుంచి ఎవరో ఒక 'రెడ్ రోవర్ రెడ్ రోవర్ లెట్ రామ్ (ఏదో ఒక పేరు) ఓవర్ అని అరవాలి. పిలిచిన వ్యక్తి వచ్చి రెండో టీమ్‌లో చేతుల జతను విడగొట్టాలి. అలా వాళ్లు ఆ చైన్‌ను బ్రేక్ చేయగలిగితే ఓడిపోయిన టీమ్ నుంచి ఒకర్నివాళ్ల గ్రూపులోకి తెచ్చుకోవచ్చు. అలా చేయలేకపోతే వాళ్లే ఆ గ్రూపులో చేరాల్సి ఉంటుంది. అలా చివరికి ఒకరుమిగిలేదాకా ఆడుకుంటూ ఉండాలి. ఈ ఆట పిల్లల్లో ఉత్సాహాన్నీ ఐకమత్యాన్నీ పెంచుతుంది. □

# పిల్లల్లో ఊబకాయం -2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



**జాగ్రత్తలు-హోమియో చికిత్స:** సరైన ఆహారం అలవాట్లు అలవాటు చేసుకోవాలి. ఆహారంలో కాయగూరలు, ఆకుకూరలు పండ్లు, మిల్లెట్స్, వాల్ నట్స్, గింజలు ఎక్కువగా తీసుకోవాలి. అధిక కేటరీలున్న నాన్‌వెజ్ ఐటమ్స్, జింక్, ఫాస్ట్‌ఫుడ్ వేపుళ్లు తీసుకోరాదు. రెగ్యులర్ ఫిజికల్, మెంటల్ ఆక్టివిటీ ముఖ్యం. రోజూ నడక, యోగా, సైక్లింగ్, స్విమ్మింగ్, ఎరోబిక్ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ఒంటరిగా ఉండక, ఎక్కువసేపు టి.వి.కంప్యూటర్ల ముందు కూర్చోక, ఇంట్లో ఎక్కువ సేపు ఉండకుండా నల్గురితో తిరగడం మంచిది. తల్లిపాలు పిల్లలకి అన్ని విధాలా మంచిది. పోతపాలు త్రాగే పిల్లల్లో ఊబ కాయ సమస్య వుంటుంది. ఆహారాన్ని నమిలి మెల్లగా తినాలి. సులభంగా జీర్ణమయ్యే పోషక ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. స్పెషల్ డైట్‌ని పాటించాలి. 6-8 గంటల నిద్ర అవసరం. దీనికి మందులు, బేరియాట్రిక్ సర్జరీ ఉంది. స్ట్రెస్ తగ్గించాలి. విటమిన్ డి, బి కాంప్లెక్స్ విటమిన్స్ తీసుకోవాలి. ఆహారంలోని మార్పులతో జీర్ణకోశ సమస్యల్ని అధిమించవచ్చు.

**హోమియో చికిత్స :** కాల్కేరియా కార్బ్: ఇది ఒళ్ళు, తలలో అధిక చెమటలు, బద్ధకంతో మందకొడిగా నిస్సత్తువగా, భయంగా ఉంటారు. ఎముకల్లో బలం తక్కువ. వికారం, అసిడిటీ, గ్రంధుల వాపు, పోషణలోపం, థైరాయిడ్ ప్రాబ్లమ్ ఉన్నవారికిది మంచిమందు.

**గ్రఫయిటిస్ :** లావు బొద్దుగా ఉండే పిల్లలు చర్మంపై రాష్, ఎగ్జిమా వంటి వ్యాధులతో బాధపడుతుంటారు. సోమరిపోతులు కొద్ది పాటి శ్రమకే చెమట లు పడతాయి. వెర్రి ఆకలి. ఏదైనా తింటే హాయిగా ఉంటుంది. మానసికంగా అస్థిమితంగా ఉండి మలబద్ధకంతో బాదపడే వారికిది మంచి మందు.

**ఫైటోలక్కా :** స్థూలకాయంతో వళ్ళు నొప్పులు, గ్రంథులవాపు కీళ్ళ వాపు, గొంతునొప్పి, టాన్సిలైటిస్, పాదాల వాపు, మూత్రంలో ప్రోటీన్స్ పోవడం వంటి మూత్రకోశ వ్యాధులున్న వారికిది మంచి మందు.

**ఆంటిమెనియం క్రూడమ్ :** మితిమిరి భోజనచేసే స్థూలకాయులైన పిల్లలు, యుక్తవయస్కులకిది మంచి మందు. పిండివంటలు, తీపి, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా తిని అజీర్తి నాలుక మీద తెల్లని పూత ఉంటుంది. పిల్లలు కోపం,భయంతో ఉండడం వల్ల వార్ని ముట్టుకున్న, వారి వైపు చూచిన ఏడుస్తారు. కీళ్ళ నొప్పులతో నడవడం కష్టంగా ఉండేవారికిది మంచిమందు.

**ఫ్యూకస్ వెసైక్యులోసస్:** ఊబకాయం ఉన్న వారిలో అజీర్తి, గ్యాస్ ట్రబుల్, మలబద్ధకం, తలనొప్పి, థైరాయిడ్ ఉన్నప్పుడు ఇది ఉపయోగపడుతుంది. □

# ఆరోగ్యాన్నీ ఇచ్చే బూడిదగుమ్మడి



**బూడిదగుమ్మడికాయ.** కొందరు దీన్ని గుమ్మానికి కడతారు. ఇంకొందరు దీనితో వడియాలు పెడతారు. అంతకుమించి దీని గురించి మనకు పెద్దగా తెలియదు. నిజానికి ఇందులో ఎన్నో పోషకాలు మరెన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. బూడిదగుమ్మడిలో పీచు, జింక్, క్యాల్షియం, ఐరన్, విటమిన్‌బి1, బి2, బి3,బి5, బి6, సి-విటమిన్, ప్రొటీన్లు విస్తారంగా ఉన్నాయి. ఇది మేలుచేసే బ్యాక్టీరియాని వృద్ధి చేస్తుంది. ఎసిడిటీని తగ్గిస్తుంది. అల్సర్లకు ఔషధంలా పనిచేస్తుంది. శ్వాస ఇబ్బందులను తొలగిస్తుంది. మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. మలబద్ధక సమస్య తలెత్తదు. బరువు పెరగకుండా కాపాడుతుంది. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. టాక్సిన్లను నిరోధిస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. ఇందులో ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పి, వాపులను తగ్గిస్తాయి. ఇది జలుబు, జ్వరం, దగ్గు వంటి సాధారణ సమస్యలు మొదలు డిప్రెషన్, క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. బూడిదగుమ్మడి రసంలో చెంచా నెయ్యి కలిపి తాగితే స్వర ఇబ్బందులు తొలగుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. వీటి గింజల పొడిని నూనెలో మరిగించి తలకు రాసుకుంటే, బట్టతల, చుండ్రు, తలనొప్పి లాంటి సమస్యలు తగ్గుతాయి. ఇన్ని పోషకాలు, ఆరోగ్య లక్షణాలు ఉన్నాయని తెలిశాక బూడిదగుమ్మడిని నిర్లక్ష్యం చేయగలమా? □

# హనుమ సుగుణాలు



హనుమ మాతృభక్తి పరాయణుడు, మనం ఆ సుగుణాన్ని అలవరచుకుంటే వృద్ధాశ్రమాలే ఉండవు. పావని ప్రభుభక్తిపరుడు. ప్రభువంటే రాజు, యజమాని, హనుమకి ప్రభువు సుగ్రీవుడు, సుగ్రీ వాజ్ఞకు తిరుగులేదు. సీతజాడ కనిపెట్టమని ఆదేశించగా.. ఆంజనేయుడు సముద్రాన్ని దాటి, సీతమ్మ జాడ కని పెట్టాడు. అటు రామకార్యాన్ని, ఇటు రాజాజ్ఞను నెరవేర్చాడు. ఆ కార్యదీక్షను, ధైర్యసాహసాలను అలవరచుకోవాలి. ఆంజనేయస్వామి-స్వామిభక్తి ప్రపూర్ణుడు. స్వామి అంటే ఎవరు? సాక్షాత్తు శ్రీరాముడు. తన వినయం, విదేయత, భక్తి, సేవలతో స్వామిని అలరించాడు. ఆంజనేయుడిపట్ల అంత నమ్మకం ఉన్నందునే తన అంగులీకాన్ని ఇచ్చి పంపాడు రాముడు. అతడే కార్యసాధకుడన్న మహావిశ్వాసం రాముడిది. అడుగడుగునా ఎదురైన ఆటంకాల న్నిటినీ అధిగమించాడు. సీతా మహాసాధ్విని కలిసి, ఆనవాలును చూపాడు. ఆ తల్లిని ఓదార్చాడు. తిరిగి రాముని చేరుకుని, ధైర్యం చెప్పి, రావణ సంహారంలో ఎన్నో విధాల సహకరించాడు. సీతారాములను కలిపాడు. అంతేనా వారిని తన హృదయంలో స్థిరపరచుకున్న భక్తాగ్రేసరుడు అంజనీ పుత్రుడు. పరోపకారానికి, లోకశ్రేయస్సుకి మరో రూపం ఆంజనేయుడు. లక్ష్మణుని బతికించడానికి ఏకంగా సంజీవని పర్వతాన్నే పెకలించుకుని వచ్చాడు. దుష్టసంహారం చేసి, జగత్తుకు ఎనలేని మేలు చేకూర్చాడు. నిత్యం రామనామ స్మరణతో భూలోకాన్నే పునీతం చేశాడు. రామభక్త హనుమంతుని ఆరాధనతో ఇన్నీ సద్గుణాలు అలవడతాయి. □

ఆధ్యాత్మికం

# ఆకర్షిస్తున్న డుకన్ డైట్



**బరువు తగ్గడానికి మనలో చాలామంది ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటాం కదా! వాటిలో** ఎక్కువమంది ఆకర్షిస్తోంది డుకన్ డైట్. జెన్నిఫర్ లోపేజ్ కీమ్ కర్దాషియన్ సహా ఎందరో తారలు దీన్ని ప్రయత్నించడంతో మనవాళ్ల చూపూ దీనిపై పడింది. ఇతకీ ఏమిటీ డైట్? ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్.. ఈ డైట్ ప్రధాన సూత్రం. ఇంకా ఇది నాలుగు దశల్లోనూ సాగుతుంది. అవేంటంటే.. ఎక్కువ ప్రొటీన్, తక్కువ మొత్తం కార్బోహైడ్రేట్స్.. ఈ డైట్ ప్రధాన సూత్రం, ఇంకా ఇదినాలుగు దశల్లోనూ సాగుతుంది, అవేంటంటే.

**అటాక్ ఫేజ్..** ఇది వారం రోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్ ప్రొటీన్‌కే ప్రాధాన్యమివ్వాలి. అంటే స్కిన్‌లెస్ చికెన్, గుండ్లు, చేప, సోయాలతో పాటు కొవ్వులేని పాలు, పెరుగు, చీజ్ వంటివి తినొచ్చు. రోజులో నూనె స్పూనుకి మించకూడదు. కూరగాయలు,పండ్లు, కొవ్వులు, చక్కెరలను అసలు దగ్గరికి రానివ్వకూడదు. అందుకే స్పూను వరకూ ఓట్ బ్రాన్ తొనొచ్చు. వీటితోపాటు రోజూ 8 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగాలి.

**క్రూయిజ్ ఫేజ్:** ఇది 12 నెలల వరకూ ఉంటుది. ఈ సమయంలో పిండి పదార్థాలు లేని కాయగూరలు, ఆకుకూరలు, దుంపలు, మాష్రూమ్స్, ఉల్లి, బ్రకలీ, క్యాలీఫ్లవర్ వంటి వాటిని ప్రాధాన్యమివ్వాలి. ఒకరోజు లీన్ ప్రొటీన్ డైట్ తీసుకుంటే మరోరోజు కాయగూరలను తీసుకోవాలి. ఓట్ బ్రాన్, రెండు స్పూన్ల నూనెనీ తీసుకోవచ్చు. పండ్లు, బంగాళదుంప, మొక్కజొన్న, గోధుమ, వరి, బార్లీ, మిల్లెట్లు, చక్కెర వంటివి తినకూడదు.

**కన్సాలిడేషన్ ఫేజ్:** బరువు తగ్గడం మొదలుయ్యాక ఇది ప్రారంభమవుతుంది. అరకేజీ తగ్గిన ప్రతిసారి దీన్ని పాటించాలి. ఇది అయిదురోజులు ఉంటుంది. ఈ సమయంలో లీన్‌ప్రొటీన్లు, పిండిపదార్థాలు లేనికాయగూరలతోపాటు కార్బోహైడేట్స్ కొవ్వు ఉన్న పదార్థాలు, ఒక పండునీ తీసుకోవచ్చు. ఒకరోజు రైస్, నిచ్చన ఆహారాలు తీసుకోవచ్చు. రెండు స్పూన్ల ఓట్ బ్రాన్ రోజూ తప్పనిసరి అయితే తీపిపదార్థాలు, అరటి, ద్రాక్ష, చెర్రీస్‌కి అనుమతి ఉండదు. ఈ సమయంలో రోజూ కనీసపం 25 నిమిషాలు ఏదైనా వ్యాయామం తప్పనిసరి.

**స్టెబిలైజేషన్ ఫేజ్:** కోరుకున్నంత బరువు తగ్గగానే క్రూయిజ్ ఫేజ్‌ని పక్కన పెట్టి, ఈ దశ కొనసాగిస్తూ వెళ్లొచ్చు. ఇక్కడ మరీ నోరు కట్టుకోవాల్సిన పని ఉండదు. లీన్ ప్రొటీన్లను వారానికోసారి తీసుకోవచ్చు. వారంలో 2-3 సార్లు అన్నం, తీప పదార్థాలు, రోజూ పండ్లు, కాయ గూరలు తినొచ్చు. అయితే రోజూ 3 స్పూన్ల ఓట్ బ్రాన్ తప్పనిసరి. నచ్చినవన్నీ తినమన్నారు కదాని ఇష్టానుసారం లాగిస్తే బరువు పెరుగుతారు. □

# సొరకాయ చెక్కు పాటోలి

ఒక కప్పు శనగపప్పు నానపెట్టి, బరకగా గ్రైండ్ చేసి పక్కన పెట్టాం. సొర కాయ తొక్కను కడిగి, సన్ననగా తరగాలి. కడాయిలో గరిటెడు నూనె వేసి, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర చెంచా చొప్పున, అల్లం తరుగు, ఎండుమిర్చి, కరివేపాకు, నానిన శనగపప్పు వేయాలి. పప్పు సగం ఉడికిన తర్వాత సొరకాయ చెక్కు కూడా వేసి మగ్గనివ్వాలి. చివర్లో కొంచెం కొత్తిమీర, తగినంత ఉప్పు వేస్తే సరిపోతుంది. ఆరోగ్యాన్నిచ్చే సొరకాయ చెక్కుతో రుచకరమైన పాటోలి మీరూ ప్రయత్నించండి. □

# ఈ ఆల్ రౌండర్లు బెంచ్‌కే పరిమితం








**ఒక్క మ్యాచ్‌కూ దక్కని ఛాన్స్**

**ఫ్రాంచైజీలు, కెప్టెన్లకు కనిపించని టీ 20 మెరికలు**

**న్యూఢిల్లీ:** ఫ్రాంచైజీలు, కెప్టెన్లు మెరికల్లాంటి ప్లేయర్లను సక్రమంగా ఉపయోగించుకోవడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. దీంతో అంది పుచ్చిన అవకాశాన్ని సైతం వదులుకోవాల్సి వస్తోంది. టీ 20ల్లో మెరికల్లాంటి ఆణిముత్యాలు తమ ప్రతిభను కనపరిచినా అటువంటి వారు ఫ్రాంచైజీలు, చివరకు సంబంధిత కెప్టెన్లకు సైతం కనిపించడం లేదు. టీ 20 వరల్డ్ కప్ ప్రారంభానికి మరో రోజు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 సందడి మార్చి నుండి మొదలై మే 26తో పూర్తయింది. ఈ కాలంలో మొత్తం 74 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో కొన్ని మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయినా, ఆడిన మ్యాచ్‌లన్నీ అభిమానులకు ఉత్కంఠభరితమైన థ్రిల్ ఇచ్చాయి. ఈ లీగ్ టోర్నీ టైటిల్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకుని మూడోసారి ఛాంపియన్‌గా అవతరించింది. కాగా ఈ టోర్నీలో చాలా మంది బలమైన ఆటగాళ్లు వివిధ జట్లలో ఉన్నారు. వారిలో కొందరు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సి వచ్చింది. అయితే కొంత మంది ఈ ఐపిఎల్ 17వ సీజనులో బెంచ్‌పై ఉండాల్సి వచ్చింది. ఇలాంటి వారు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయారు. ఈ విధంగా ఐపిఎల్ 2024లో ఒక్క మ్యాచ్ కూడా ఆడని ముగ్గురు ఆటగాళ్లు ఉండటం అందరి దృష్టి ఇప్పుడు వారిపైనే ఉంది. వీరికి అటు ఫ్రాంచైజీలు కాని, ఇటు జట్టు కెప్టెన్లు కాని ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వకపోవడం విశేషం. ఇటువంటి వారిలో ఆల్ రౌండర్ కైల్ మేయర్స్ ఒకడు. లక్నో సూపర్ జెయింట్స్‌లో గత ఐపీఎల్ 16వ సీజనులో ప్రధాన ఓపెనర్‌గా కైల్ వ్యవహరించాడు. అతను 13 మ్యాచ్‌ల్లో 144.10 స్ట్రైక్ రేట్‌తో 379 పరుగులు చేశాడు. అయితే ఈ సజనులో లక్నో జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడేందుకు మేయర్స్‌కు అవకాశం ఇవ్వకపోవడంతో సీజన్ మొత్తం బెంచ్‌పై కూర్చోవాల్సి వచ్చింది. లక్నో సూపర్ జెయింట్స్ చాలా మ్యాచ్‌లలో క్వింటన్ డి కాక్, మార్కస్ స్టోయినిస్, నికోలస్ పూరన్‌లను విదేశీ ఆటగాళ్లుగా ఉపయోగించుకుంది.

అలాగే న్యూజిలాండ్‌కు చెందిన గ్లెన్ ఫిలిప్స్ తన సామర్థ్యం కారణంగా ప్రపంచంలోని ఏ టి20 జట్టులోనైనా ప్లేయింగ్ 11లో చోటు సంపాదించ గలడు. కానీ సన్ రైజర్స్ హైదరాబాద్ మాత్రం ఐపిఎల్ 2024 టోర్నీలో ఒక్క మ్యాచ్‌లో కూడా అతనిని ఆడించ లేదు. ఫిలిప్స్ స్పిన్ బౌలింగ్‌తో పాటు, వేగంగా బ్యాటింగ్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాడు. అయితే సన్ రైజర్స్ మేనేజ్‌మెంట్ కాని, జట్టు కెప్టెన్ కాని ఇతని నైపుణ్యాన్ని ఉపయోగించుకోలేకపోయింది. ఫలితంగా మొత్తం సీజన్‌లో బెంచ్‌కే పరిమితమ య్యాడు. ఇక గత ఏడాది డిసెంబరులో జరిగిన మినీ వేలంలో ఇంగ్లండ్ బౌలింగ్ ఆల్ రౌండర్ క్రిస్ వోక్స్‌ను పంజాబ్ కింగ్స్ 4.20 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఇతడినికి ఏ ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం ఇవ్వకుండా ఫ్రాంచైజీ, కెప్టెన్ పక్కన పెట్టారు. కనీసం సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో అయినా వోక్స్‌కు ఆడే అవకాశం లభించవచ్చని క్రికెట్ అభిమానులు ఆశించినా అందుకు కూడా ఛాన్స్ ఇవ్వకపోవడంతో బెంచ్‌పైనే కూర్చోవాల్సి వచ్చింది.



## సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత్ సంచలనం

**క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన షట్లర్లు ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్**

**న్యూఢిల్లీ:** సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మిశ్రమ ఫలితాలు లభించినా, భారత్ యంగ్ షట్లర్లు మాత్రం సంచలనం సృష్టించారు. యంగ్ షట్లర్లు ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ సంచలన విజయాలతో క్వార్టర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లగా, స్టార్ ప్లేయర్ పీవీ సింధు మాత్రం పోరాడి ఓడింది. సింగపూర్‌లో జరిగిన విమెన్స్ డబుల్స్‌లో ట్రీసా-గాయత్రి 21-9, 14-21, 21-15తో వరల్డ్ రెండో ర్యాంకర్లు దక్షిణ కొరియాకు చెందిన బీక్ హా నా-లీ సో హీకు షాకిచ్చారు. దీంతో బీక్ హ-లీ సోహీతో తలపడిన మూడు సార్లలో తొలి విజయాన్ని అందుకున్నారు. కాగా విమెన్స్ సింగిల్స్ ప్రి క్వార్టర్స్‌లో సింధు 21-13, 11-21, 20-22తో మూడో సీడ్ స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్ చేతిలో ఖంగుతిన్నది. 2018 నుండి మారిన్ చేతిలో సింధు ఓడటం ఇది వరుసగా 6వ సారి. 1 గంటా 8 నిముషాల మ్యాచ్‌లో తొలి గేమ్‌లో సూపర్‌గా ఆడిన తెలుగమ్మాయి రెండో గేమ్‌లో మారిన్ షాట్లకు బదులివ్వలేకపోయింది. అయితే డిసైడర్‌లో సింధు వరుసగా 11-9, 14-10, 18-15తో లీడ్‌లో మాత్రం నిలిచింది. కానీ వెంటనే తేరుకున్నమారిన్ డ్రాప్ షాట్స్‌తో 19-20 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో మారిన్ బలమైన క్రాస్ కోర్టు విన్నర్స్‌తో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. మెన్స్ సింగిల్స్‌లో హెచ్ ఎస్ ప్రణయ్ 13-21, 21-14, 15-21తో జపాన్‌కు చెందిన కెంటానిషి మోటో చేతిలో ఓడిపోయాడు.

## పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్స్‌లోకి భారత్ బాక్సర్స్



**న్యూఢిల్లీ:** ఇండియా బాక్సర్లు సచిన్ సివాచ్, సంజీత్ కుమార్ పారిస్ ఒలింపిక్స్ రేజ్‌లో మరోఅడుగు ముందు కేశారు. పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషనలో భాగంగా బ్యాంకాక్‌లో జరిగిన మెన్స్ 57 కేజీల ప్రి క్వార్టర్స్‌లో సచిన్ 5-0తో టర్కీకి చెందిన బటుహాన్ సిఫ్టిసిపై గెలవగా, 92 కేజీల విభాగంలోని రెండో రౌండ్‌లో సంజీత్ కూడా 5-0తో వెనిజులాకు చెందని లూయిస్ సాంచెజ్‌ను చిత్తు చేశాడు.

57 కేజీల్లో ముగ్గురు బాక్సర్లు మాత్రమే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. కాబట్టి సచిన్ మరో రెండు విజయాలు సాధిస్తే పారిస్ బెర్త్ దక్కుతుంది. 92 కేజీల్లో సెమీస్ చేరిన నలుగురికి ఒలింపిక్స్ ఆడే ఛాన్స్ ఉంటుంది. 51 కేజీల విభాగంలోఅమిత్ పంగల్ 4-1తో మెక్సికోకు చెందిన మురిసియో రుయుజ్‌పైన, విమెన్స్ 57 కేజీల విభాగంఠ జాస్మిన్ 5-0తో అజర్‌బైజన్‌కు చెందిన మహాసతి హమజయోవాపై నెగ్గి ముందంజలో ఉన్నారు.



## టీ 20 వరల్డ్ కప్ వార్మప్‌లో వెస్టిండీస్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఐసిసి టి 20 వరల్డ్ కప్ వార్మప్ మ్యాచ్‌లో విండిస్ ఆస్ట్రేలియాపై 35 పరుగుల తేడాతో విజయం సాధించిది. ట్రినిడాడ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 257 పరుగులుచేసింది. విండీస్‌బ్యాటర్ పూరన్ అత్యధికంగా 75 పరుగులుచేశాడు. తదుపరి పావెల్ 52 పరుగులు, ఛార్లెస్ 40 పరుగులు, రూథర్ ఫర్డ్ 47 పరుగులుకొట్టారు. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 222 పరుగు మాత్రమే చేసింది. ఆసిస్ బ్యాటర్లలో జోష్ ఇంగ్లీస్ 55 పరుగులు, నాథన్ ఎల్లిస్ 39 పరుగులు చేశారు.

## టీ 20 వరల్డ్ కప్‌లో స్టాప్ క్లాక్



**ఓవర్‌లో జాప్యానికి 5 పరుగులు కట్**

**కొత్త రూల్‌తో టెన్షన్‌లో బౌలింగ్ టీం**

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) టీ 20 వరల్డ్ కప్-2024 ప్రారంభానికి ఇంకో ఒక్క రోజో సమయం ఉంది. ఈ మెగా ఈవెంట్ జూన్ 2 నుండి ప్రారంభమవుతోంది, 2007లో మొదలైన ఈ మినీ వరల్డ్ వార్ ఇప్పటికే 8 ఎడిషన్లు పూర్తి చేసుకుని 9వ సీజనులోకి అడుగు పెడుతోంది. గత 8ఎడిషన్లలో ఐసిసి ఈ మోడల్‌లో అనేక కొత్త నిబంధనలను అనుసరించింది. అందుకు తగినట్లుగా ఈ సారి కూడా కొత్త రూల్‌ను తీసుకొచ్చింది. ఆ నియమ మే స్టాప్ క్లాక్ రూల్. టీ 20 ప్రపంచ కప్‌లో నిర్ణీత సమయంలో తమ ఓర్లను పూర్తి చేయని జట్లకు ఈ నియమం ఖచ్చితత్వంతో కూడుకున్నది. ప్రయోగా త్మకంగా ఈ నిబంధన విజయవంతం కావడంతో ఈ వరల్డ్ కప్ నుంచి వైట్ బాల్ ఫార్మాట్‌లో స్టాప్ క్లాక్ రూల్‌ని ఉపయోగించాలని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ నియమం ప్రకారం, రెండు ఓవర్ల మధ్య ఒక జట్టు తర్వాతి ఓవర్ ప్రారంభించడానికి 60 సెకన్లు ఇవ్వనున్నారు. ఈ టైం వ్యవధిలో బౌలింగ్ జట్టు తదుపరి ఓవర్‌ను ప్రారంభించాలి. ఓవర్ ముగిసిన వెంటనే, థర్డ్ అంపైర్ ఈ నిబంధనను అమలు చేస్తాడు. ఈ గడువులోపు ఓవర్ ప్రారంభం కాకపోయినట్లయితే, అన్ ఫీల్డ్ అంపైర్ బౌలింగ:న జట్టుకు రెండు హెచ్చరికలు జారీ చేస్తాడు. మూడవ హెచ్చరికపై 5 పరుగుల ఫెనాల్టీ విధించబడుతుంది. ఈ పరుగులు బ్యాటింగ్ జట్టు ఖాతాలో చేరతాయి. కాగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ఈ నిబంధనను 2023 డిసెంబరు నుంచి వైట్ బాల్ ఫార్మాట్‌లో అమలు చేసింది.వాస్తవానికి మ్యాచ్ సమయంలో కొన్ని సందర్భాల్లో ఈ నిబంధనను ఉపయోగించరు. అయితే ఈ నిబంధనను ఉపయోగించాలా వద్దా అనేది పూర్తిగా థర్డ్ అంపైర్‌పై ఆధారపడి ఉంటుంది. క్రీజ్‌లోకి కొత్త బ్యాట్స్‌మెన్ వచ్చినప్పుడు ఈ నియమం వర్తించదు. టీ విరామ సమయంలో కూడా ఇది మినహాయించబడుతుంది.

# భారత్‌కు లక్ష కిలోల బంగారం

**ముంబై, మే 31:** ఇంగ్లండ్ నుంచి భారీ ఎత్తున బంగారంనిల్వలను ఆర్‌బిఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100టన్నులు అంటే లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. అప్పట్లో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సి వచ్చింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబై మింట్ రోడ్డు సహా నాగ్‌పూర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బిఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర బ్యాంకు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కవ నిల్వ చేయాలనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈక్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంకు ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ కూడా అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసే నాటికి ఆర్‌బిఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా కొనుగోలు చేస్తూ వచ్చిన కేంద్ర బ్యాంకు గత యేడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ యేడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి-ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలుచేయడంవిశేషం. రవాణా, భద్రత విషయాలను పరిగణనలోకి తీసుకుంటే 100టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించడం మామూలు విషయం కాదు. దీని వెనక కొన్ని నెలల కసరత్తు అవసరం.



ఆర్‌బిఐ, ఆర్థిక శాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమగ్ర సమన్వయం ఉండాలి. ఈ బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు తొలుత ఆర్థిక శాఖ నుంచి ఆర్‌బిఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు తీసుకుంది. సాధారణంగా అన్ని దిగుమతులపై వర్తించే ఐజిఎస్‌టి మాత్రం తప్పలేదు. తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోవాల్సి ఉండడమే దీనికి కారణం. ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఉపయోగించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా తరలింపుతో ఆర్‌బిఐ నిర్వహణ వ్యయాలు స్వల్ప స్థాయిలో తగ్గుతాయి.

## మూడు మేజర్ ఐపిఒలు..

**ముంబై, మే 31:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతొలి త్రైమాసికంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ జాతర కొన సాగుతోంది. ఈ మధ్య కాలంలో గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ మినహాయిస్తే, పబ్లిక్ ఇష్యూకు వచ్చినవన్నీ ఎస్ఎంఇ ఐపిఒలే. క్రమంగా స్టాక్ మార్కెట్ మొత్తాన్నీ ఇవి డామినేట్ చేస్తోన్నాయి. ప్రస్తుతం మూడు ఎస్ఎంఇ ఐపిఒలు ఇన్వెస్టర్ల కోసం అందుబాటులో ఉన్నాయి. ఈ మూడూ కలిపి 136కోట్ల రూపాయలనుఇన్వెస్టర్ల నుంచి వసూలు చేయనున్నాయి. ఈ మూడింటిపైనా మార్కెట్ వర్గాల్లో మంచి అంచనాలే ఉన్నాయి. అలాట్ అయిన ఇన్వెస్టర్లకు మంచి లాభాలను పంచుతాయని భావిస్తోన్నాయి. దీనికి అనుగుణంగా వాటి గ్రేమార్కెట్ ప్రీమియం కూడా లాభాలను సూచిస్తోన్నాయి. ఎయిర్‌ట్రాన్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ప్రస్తుతం ఐపిఒ ఓపెన్ అయింది. సోమవారం నాటితో ముగియనుంది. మొత్తంగా 87 కోట్ల రూపాయలను కలెక్ట్ చేయడానికి పబ్లిక్ ఇష్యూకు జారీ చేసింది కంపెనీ. కనీస లాట్‌సైజు 800 షేర్లు. అంటే 800 కంటే తక్కువగా షేర్లను దాఖలుచేయలేం. 1,22,800 రూపాయలను కనీస మొత్తంగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అసోసియేటెడ్ కోటర్స్ లిమిటెడ్ ప్రస్తుతం ఈ ఎస్ఎంఇ ఐపిఒ ఓపెన్ అయింది. సోమవారం నాటితో ముగియనుంది. మొత్తంగా 5.1కోట్ల రూపాయలను కలెక్ట్ చేయడానికి పబ్లిక్ ఇష్యూను జారీచేసింది. కనీస లాట్ సైజు వెయ్యి షేర్లు. అంటే వెయ్యి కంటే తక్కువగా షేర్లను దాఖలు చేయలేం. 1,21,000రూపాయలను కనీస మొత్తంగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. టిబిఐ కార్న్ లిమిటెడ్ ప్రస్తుతం ఈ ఎస్ఎంఇ ఐపిఒ ఓపెన్ అయింది. మంగళవారం నాటితో ముగియ నుంది. మొత్తంగా 55.9 కోట్ల రూపాయ లను కలెక్ట్ చేయడానికి పబ్లిక్ ఇష్యూను జారీ చేసింది. కనీస లాట్ సైజు 1,200 షేర్లు. అంటే 1,200 కంటే తక్కువగా షేర్లను దాఖలు చేయలేం. 1,08,000 రూపాయలను కనీస మొత్తంగా ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. దీని జిఎంపి 95 రూపాయలుగా ఉంటోంది. లిస్టింగ్ నాడు ఒక్కో షేర్ మీరు 21 రూపాయలను అధిక ప్రీమీయం పలుకుతుంది. 5వ తేదీన అలాట్‌మెంట్ ఉంటుంది. అలాట్ కాని వారికి 60వ తేదీన రీఫండ్ చేస్తుంది.




## అదానీ షేర్ల ర్యాలీ..

**ముంబై, మే 31:** ఈ వీకెండ్ డే దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు చెందిన షేర్లు శుక్రవారం స్టాక్ మార్కెట్లో అమాంతం పెరిగాయి. ఇన్వెస్టర్లపై కనకవర్షాన్ని కురిపించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు ఏడు శాతానికిపైగా పెరుగుదల కనిపించింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో రూ.3,233.20 పైసల వద్ద ప్రారంభమై దూసుకుపోయి గరిష్టంగా రూ.3,432.60 పైసలకు చేరింది. అంటే దాదాపు 237 రూపాయల మేర పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, ఏడు శాతం కంటే దిగువకు మాత్రం వాటి ట్రేడింగ్ నమోదు కాలేదు. ఈ మధ్యకాలంలో ఈ స్థాయిలో అదానీ ఎంటర్ ప్రైజెస్ షేర్ల ధరలు ఎగబాకడం ఇదే తొలిసారి. అదానీ పవర్ షేర్లు కూడా ఇదే తరహా పెరుగుదల కనిపించింది. వాటి ధరలో 10శాతం వరకు పెరుగుతుంది. బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో రూ.706.80 వద్ద ప్రారంభమై గరిష్టంగా రూ.789.80 వద్ద ట్రేడయింది. అయితే రూ.73 మేర పెరిగింది. అదానీ టోటల్ గ్యాస్ షేరు ధర కూడా భారీగా పెరుగుదల నమోదు చేసింది. వాటి ధరలో 9.32 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో రూ.వెయ్యి దాటేసింది.



# వాణిజ్యం

## నేటి నుంచి మారనున్న రూల్స్

**ముంబై, మే 31:** నేటి నుంచి జూన్ నెల ప్రారంభమైంది. అయితే ఆధార్, అప్‌డేట్, ఎల్‌పిజి సిలిండర్ ధరలు, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి పలు మార్పులు కనిపిస్తాయి. ఇవి మన బడ్జెట్ విషయంలో కూడా చాలా మార్పులు తీసుకొస్తాయి. నిత్యం వాడే టూవీలర్ వెహికల్‌కు సంబంధించిన కొత్త డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ జూన్ 1, 2024 నుంచి మారనున్నాయి. అదేవిధంగా నేటి నుంచి ఫ్రీగా ఆధార్‌ఆర్డును అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆధార్ కార్డు హోల్డర్లు యుఐడిఎఐ గుడ్‌న్యూస్ చెప్పింది. ఆధార్ కార్డు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవాలనుకునేవారు ఉచితంగానే చేసుకోవచ్చు. ఈ అవకాశం కూడా జూన్ 1 నుంచి జూన్ 14 వరకు ఉంటుంది. ఇక ఆఫ్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవాలనుకునే వారు మాత్రం ప్రతి అప్‌డేట్‌కు 50 రూపాయలు చెల్లించి వినియోగదారులు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోగలరని యుఐడిఎఐ పేర్కొంది. ఇక ఈ సేవలు జూన్ 14 వరకు మైధార్ పోర్టల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని యుఐడిఎఐ తెలిపింది. జూన్ 1వ తేదీన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ సిలిండర్ ధరల్లో పలు మార్పులు జరగనున్నాయి. ఈ కంపెనీలు మే నెలలో ఎల్‌పిజి సిలిండర్ల ధరలను తగ్గించాయి. ఇక జూన్ నెలలో అవి మరింత తగ్గనున్నాయో, లేక పెరగనున్నాయో చూడాలి. రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం కొత్త నిబంధనలను వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం జూన్ 1 నుంచి ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో డ్రైవింగ్ పరీక్షలు చేయించుకోవడానికి, సర్టిఫికేట్‌లను జారీచేయడానికి మాత్రమే అధికారం కలిగి ఉంటాయి. వీటితో పాటు జరిమానాలను కూడా పెంచింది. అతివేగానికి జరిమానా రూ.1000 నుంచి రూ.2000వరకు ఉంటుంది. ఒకవేళ డ్రైవింగ్‌లో మైనర్ పట్టుబడితే మాత్రం అతను రూ.2వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆ వెహికల్ యజమాని రిజిస్ట్రేషన్ కూడా క్యాన్సిల్‌అవుతుంది. ఇక మైనర్‌కు పాతికేళ్లు వచ్చేవరకు లైసెన్స్‌కు అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈ నిబంధనలన్నీ నేటి నుంచి అమల్లోకి వచ్చాయి.




## స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 31:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప లాభాల్లో ముగిసాయి. నేటి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు సూచీలకు దన్నుగా నిలిచాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చింది. ఆఖర్లో అమ్మకాలతో లాభాలు పరిమితమైనప్పటికీ, సూచీలు ఐదు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 74,208.53 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై, చివరికి 75.71 పాయింట్లు పెరిగి 73,885.60 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 42.05 పాయింట్లు లాభపడి 22,530.70 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.83.49గా ఉంది. టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ వంటి షేర్లు లాభపడ్డాయి. నెస్లే ఇండియా, టిసిఎస్, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 81.40 వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 2363 డాలర్ల వద్ద కొన సాగింది.



## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రూ.78,213 కోట్లు

**ముంబై, మే 31:** బ్యాంకుల్లో క్లెయిమ్‌చేయని డిపాజిట్లు మార్చి నెలాఖరు నాటికి 26శాతం పెరిగాయి. 78,213 కోట్ల రూపాయలు అన్‌క్లెయిమ్ డిపాజిట్లుగా ఉన్నట్లు రిజర్వ్‌బ్యాంకు వార్షిక నివేదికల్లో వెల్లడించింది. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ కింద ఈ మొత్తం గత ఏడాది మార్చి చివరికి 62,225 కోట్లు ఉంటే ఈఏడాది 26 శాతం పెరిగి 78,213 కోట్లకు చేరింది. బ్యాంకులు, సహకార బ్యాంకుల్లోని ఖాతాల నుంచి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పదేళ్లు అంతకుమించి కొన్నేళ్ల నుంచి ఉన్నాయి. ఈ మొత్తం ఇపుడు ఆర్‌బిఐలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ (డిఇఎ)ఫండ్‌గా కొనసాగుతోంది. ఆపరేషన్‌లో ఖాతాలపై స్పష్టమైన సూచనలు జారీచేస్తూ రిజర్వ్‌బ్యాంకు బ్యాంకు కస్టమర్లకు అవగాహన పెంచే కార్యక్రమాలను పెంచుతోంది. ఇందుకోసం ఖాతాలను కూడా వర్గీకరించి ఆపరేటివ్, ఇనాపరేటివ్, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్‌ఖాతాలుగా వర్గీకరించింది. క్రమానుగతంగా నిర్వహించే సమీక్షల్లో రిజర్వ్ బ్యాంకు ప్రభుత్వ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల్లో మోసాలు కట్టడిచేయాలని, ఫిర్యాదులపై నిరంతర సమీక్ష ఉండా లని సూచించింది. ఫిర్యాదులను అత్యం త వేగవంతంగా పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు, ఇనాపరేటివ్ ఖాతాల్లో వారి నామినీలను సంప్రదించి వెంటనేవాటిని పరిష్కరించాలని వారి వారసులు, నామినీలు లేనిపక్షంలో నిబంధనల ప్రకారం వాటిని రిజర్వ్‌బ్యాంకు డిఇఎ నిధికి జమ చేయాల్సి ఉంటుందని ఆర్బీఐ ప్రకటించింది. ఇలాంటి డిపాజిట్లు, ఇనాపరేటివ్ ఖాతాల్లోని సొమ్మును చట్టబద్దంగా ఉన్న వారి వారసులకు అందేటట్లు బ్యాంకర్లు కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సూచించింది. ఈతాజా మార్గదర్శకాలు సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు అన్నింటికీ వర్తిస్తాయని ఆర్బీఐ సూచించింది. ఇలాంటి డిపాజిట్లు, ఖాతాలకోసమే రిజర్వ్‌బ్యాంకుప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. కేంద్రీకృత వెబ్‌పోర్టల్ ఉడ్‌గామ్(అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)ను ప్రారంభించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.